ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ సప్తమి తె. 5.14 వరకు, అనంతరం అష్టమి; నక్షత్రం: అనూరాధ రా. 2.24 వరకు, అనంతరం జ్యేష్ఠ; అమృతకాలం: సా. 3.15 నుండి 4.55 వరకు; వర్జ్యం: ఉ. 6.39 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు;

ఆంధ్రప్రభ

Estd 1938

www prabhanews com

Journalism first!



సంపుటి:56 • సంచిక:326 • గురువారం 8 మార్చి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+12 • వెల: 5.00 • Published from:Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



నింగిలో... శివంగి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు


నేలపై... సబల
నీటిలో... మేటి
ఇది... ఆమె కాలం!

2 లో

మహిళ ఉద్యోగులకు నేడు సాధారణ సెలవు

3

ప్రధానిపై చంద్రబాబు ఆత్మగౌరవ బాణం



"అరుణ్‌జైట్లీ దారుణంగా మాట్లాడారు. సెంటిమెంట్స్‌తో నిర్ణయాలు తీసుకోలేమన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్‌ను అవమానించడమే. మనమేమీ గొంతెమ్మకోర్కెలు కోరడంలేదు. అనివార్యమైన ఈ నిర్ణయాన్ని ప్రధానికి చెప్పేందుకు ప్రయత్నించా. ఆయన అందుబాటులోకి రాలేదు."

– బుధవారం రాత్రి 11 గం.లకు సచివాలయంలో ఏపీ సీఎం చంద్రబాబు





మోడీజీ... గుడ్‌బై!

తొలి అడుగులో ఇద్దరు కేంద్రమంత్రులు నేడు రాజీనామా

త్వరలోనే ఎన్డీయే నుంచి నిష్క్రమణకు అవకాశం

స్నేహానికి బీటలు!

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న వేళ భారతీయ జనతా పార్టీకి ఏపీ సీఎం చంద్రబాబు షాకిచ్చారు. గురువారం ఉదయం 11 గంటలకు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉండగా ఇంతకన్నా కొన్ని గంటల ముందే కేంద్రంలో ఉన్న తమ పార్టీకి చెందిన ఇరువురు మంత్రులను రాజీనామాలు చేయించాలని చంద్రబాబు నిర్ణయించారు. కేంద్రం నుంచి మంత్రులు తప్పుకోనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పూసపాటి అశోక గజపతిరాజు, సుజనా చౌదరి తమ మంత్రి పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు రాజీనామాలపై తుది నిర్ణయం తీసుకున్నారు. గురువారం ఉదయం ఈ ఇరువురు మంత్రులు తమ రాజీనామా లేఖలను అందజేయనున్నారు. రాజీనామా తొలి అడుగు అని ఎన్‌డిఏ కూటమిలో కొనసాగేది, లేనిది త్వరలోనే చర్చించి నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు బుధవారం రాత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చెప్పారు. రాజీనామాలపై ఇద్దరు కేంద్ర మంత్రులతో మాట్లాడానని పార్టీ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామని వారు చెప్పినట్టు తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్న భాజపా మంత్రులు కొనసాగుతారా, వైదొలుగుతారా ఆ పార్టీ ఇష్టమని చెప్పారు. రాజీనామాల అంశాన్ని ప్రధాని నరేంద్రమోడీకి తెలియజేద్దామని ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదని

⇨ 10వ పేజీలో...



మళ్లీ అదేపాట

హోదా లేదు.. ప్యాకేజీ తీసుకోండి • రెవెన్యూ లోటు కింద రూ.1600 కోట్లు ఇస్తాం • ప్యాకేజీ కింద ఈఏపీ, నాబార్డు ద్వారా నిధులు ఇప్పిస్తాం • రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి • రాజధానికి అడ్వాన్స్‌గా రూ.2,500కోట్లు ఇచ్చాం • పోలవరానికి రూ.5 వేల కోట్లు ఇచ్చాం: జైట్లీ

10

ఒప్పంద వివాహాలకు చట్టభద్రత

అర్ధాంతర విడాకుల నేపథ్యంలో స్త్రీకి భరోసా

అమలు సాధ్యాసాధ్యాలపై కేంద్రం కసరత్తు

న్యూఢిల్లీ: అర్ధాంతర విడాకులతో నిస్సహాయతకు గురవుతున్న మహిళల జీవితాలకు భద్రత కల్గించే దిశగా మోడీ సర్కార్ అడుగులు వేస్తున్నది. వివాహానికి ముందు కుదుర్చుకునే ఒప్పందాలకు చట్టబద్దత కల్పించడమే మార్గమని భావిస్తున్నది. ఈ తరహా చట్టం అమలు సాధ్యాసాధ్యాలపై మహిళా శిశు సంక్షేమశాఖ కసరత్తు చేస్తోంది. లింగ వివక్షతను నివారించడమే కాకుండా, బాధిత మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తోంది. ఇందుకు తక్షణ విడాకుల నేర బిల్లును రూపొందించనుంది. వివాహానికి ముందు ఒప్పందాలకు చట్టబద్ధత విధానం ప్రస్తుత పాశ్చాత్య దేశాల్లో అమలులో

⇨ 8వ పేజీలో...

కేంద్ర ప్రభుత్వోద్యోగుల డీఏ పెంపు

బేసిక్ 5%పై 2% పెంపు

కోటి మందికి లబ్ధి

ఖజానాపై రూ.7 వేల కోట్ల అదనపు భారం

డీఏ, డీఆర్ అదనపు వాయిదా విడుదల

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. డిఎ, డిఆర్‌కు సంబంధించి అదనపు వాయిదా నిధులను విడుదల చేసేందుకు కేంద్రమంత్రి వర్గం అనుమతించింది. బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్రమంత్రి వర్గం పలు నిర్ణయాలు తీసుకుంది. బేసిక్‌పై ప్రస్తుతమున్న 5శాతం రేటుపై పెరిగిన ధరలకు అనుగుణంగా మరో రెండు శాతాన్ని పెంపునకు అనుమతించింది. జనవరి 2018 నుంచి దీన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు,

⇨ 8వ పేజీలో...

రైతు సంక్షేమమే రాజకీయ అస్త్రం

• ఆ దిశగా సీఎం కేసీఆర్ కార్యాచరణ • విజయవంతమైన పథకాలపై దేశవ్యాప్త ప్రచారం • రైతు ఆదాయం పెంచడమే లక్ష్యంగా చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొన్నేళ్ళుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరాదరణ కారణంగా మరుగున పడిన రైతు సంక్షేమాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు తన రాజకీయ అజెండాలో ప్రధానాంశంగా ఎంచుకున్నారు. ఆ దిశగానే భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. గడిచిన మూడేళ్ళ కాలంగా రాష్ట్రంలో సత్ఫలితాలు సాధిస్తూ విశేష ప్రజాదరణ పొందిన పథకాలపై జాతీయ స్థాయిలో ప్రచారం చేసి దేశాన్ని ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జనాభాలో దాదాపు 80శాతం ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నందున వారి సంక్షేమమే ప్రధాన అజెండాగా ముందడుగు వేయాలని నిర్ణయించారు. తెలంగాణాలో అందుబాటులో ఉన్న సహజ వనరులను, ముఖ్యంగా జల వనరులను సద్వినియోగం చేసుకోవడంలో ఫలించిన వ్యూహాన్ని థర్డ్ ఫ్రంట్ ప్రచారాస్త్రంగా ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారు. తద్వారా తెలంగాణాలో సాధించిన ఆర్థిక వృద్ధి రేటు, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన జీవనోపాధి కల్పించిన విషయాన్ని వచ్చే నెలలో ఢిల్లీతో పాటు 16 ప్రధాన నగరాల్లో నిర్వహించే సభలు, సమావేశాల్లో వెల్లడించనున్నారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా జీవిస్తున్న పొరుగు రాష్ట్రాల్లో

⇨ 8వ పేజీలో...



ఏప్రిల్ 27న ఫెడరల్ ఫ్రంట్

హైదరాబాద్ కేంద్రంగా ప్రకటన • హాజరుకానున్న ఇతర రాష్ట్రాల నేతలు • టీఆర్ఎస్ ప్లీనరీలో అపూర్వ దృశ్యాలు • వ్యూహరచనలో కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రసమితి అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ముహూర్తం నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించే.. తెలంగాణ రాష్ట్రసమితి ఆవిర్భావ వేడుకనే ఫ్రంట్ ఏర్పాటుకు పునాదిసభగా చేసే వ్యూహరచనలో సిఎం నిమగ్నమైనట్లు సమాచారం. ఇప్పటికే మంత్రివర్గ సహచరులతో, పార్టీ ముఖ్యులతో దీనిపై చర్చించిన సిఎం కెసిఆర్ పార్టీ 17వ ప్లీనరీపై దేశం చూపు పడేలా చేయాలన్న ప్రణాళిక రూపొందిస్తున్నారు. రైతాంగ సమస్యల పరిష్కార విషయంలో గడచిన నాలుగేళ్ళలో.. తెలంగాణ పలు విజయాలు సాధించగా.. వీటిని ప్రధానంగా ప్రస్తావించడంతో పాటు దేశమంతా రైతాంగ సమస్యల పరిష్కారానికి ఒక ఎజెండాను, ఆలోచనను ప్లీనరీ వేదికగా ప్రకటించాలని సిఎం యోచిస్తున్నారు. ప్లీనరీకి ఎవరెవరిని ఆహ్వానించాలి అన్న అంశాలపై ఢిల్లీలో ఉన్న పార్టీ ఎంపీలతో కూడా సిఎం చర్చించినట్లు సమాచారం. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ కెసిఆర్ కూటమి ప్రతిపాదనకు మద్దతు ప్రకటించడంతో పాటు డిఎంకె వంటి పలుపార్టీల నేతలతో కూడా కూటమి ఆవశ్యకతపై చర్చించారు. జాతీయ స్థాయిలోనూ.. దీనికి సంబంధించి చర్చ ప్రారంభమైంది. ఒకేసారి.. ఆకస్మికంగా రాజకీయపార్టీలన్నీ కూటమిలాగా రావని.. ఇప్పటికే ఉన్న కూటములను, బంధాలను తెంచుకుని రావాలంటే కొంత సమయం పడుతుందని టిఆర్ఎస్ అంచనా వేస్తోంది. టిఆర్ఎస్ ఉద్యమానికి మద్దతు సంపాదించిన తరహాలోనే కూటమిలోని పార్టీలను.. పెంచుకుంటూ

⇨ 8వ పేజీలో...

కేసీఆర్ ఢిల్లీ టీం రెడీ

3 లో



బాసరలో కలకలం...

తండ్రీకొడుకు దారుణ హత్య

సిరిసిల్ల జిల్లాలో ఎంపీటీసీ భర్తపై దాడి.. అక్కడికక్కడే మృతి

పాత కక్ష్యలతోనే హత్య చేశారని పోలీసుల అనుమానం

3



పపువా గునియాలో భూకంపం

75 మంది మృతి

భారీగా ఆస్తి నష్టం

రంగంలోకి సైన్యం

న్యూ గునియా: పపువా న్యూ గునియాలో అర్ధరాత్రి భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 6.7గా నమోదయింది. జాతీయ విపత్తుల కేంద్రం ఈ భూకంపాన్ని ధృవీకరించింది. అర్ధరాత్రి రావడంతో ప్రజలు నిద్రలో ఉన్నారని, దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, 55 నుంచి 75 మంది వరకు చనిపోయి ఉంటారని విపత్తుల కేంద్రం అధికారులు తెలిపారు. చాలా ఇళ్లు నేలమట్టమయ్యాయని, ప్రభుత్వం సహా రెడ్‌క్రాస్ సంస్థ సహాయక చర్యలు చేపట్టిందని తెలిపారు. అయితే, న్యూగుయినీ, కొన్ని చిన్న దీవుల్లో 8 మిలియన్ ప్రజలు నివసిస్తున్నారని,న చాలామంది మారుమూల గ్రామాల్లో ఉన్నట్లు సదరన్ హైలాండ్స్ ప్రోవిన్స్ గవర్నర్ విలియం పోవీ వెల్లడించారు. అంతే కాకుండా ఒకపక్క కొండ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయని, వర్షపు నీటితోపాటు కొండ చరియలు విరిగిపడుతూ, మట్టితో కూడిన నీరు ప్రవహించడంతో

⇨ 8వ పేజీలో...

నింగిలో... శివంగి
నేలపై... సబల
నీటిలో... మేటి





కాలాన్ని లెక్కచేయకుండా కష్టపడుతున్నారు...ధైర్యాన్ని కోల్పోకుండా ముందడుగులు వేస్తున్నారు...వేధింపులు తట్టుకుని నిలబడుతున్నారు...వెరపు లేకుండా కొత్తపనుల్లో కాలుపెడుతున్నారు...అవకాశాలు సృష్టించుకుని ముందుకు వెళుతున్నారు. అవాంతరాలు ఎన్నిఉన్నా...నేటి మహిళ ఆగటం లేదన్నది నిజం. కొందరు ఆగినా...మరికొందరు ముందడుగు వేస్తూ...స్ఫూర్తిని నింపుతున్నారు...నిలబెట్టుకుంటున్నారు. స్త్రీలు వెనుకబడి ఉన్నది వందల వేల ఏళ్లు. కానీ మార్పుని స్వాగతించడం మొదలుపెట్టాక...పదుల సంవత్సరాల్లోనే వారు పదునుతేలారు...శారీరక సౌకుమార్యం నుండి సాధికారత వైపు, మానసిక దుర్బలత్వం నుండి మనోబలం వైపు చాలా వేగంగా అడుగులు వేస్తున్నారు. అందుకు ఉదాహరణగా మన కళ్లముందు అనేక అంశాలు కనబడుతున్నాయి. ఆకాశంలో సగం...అని అప్పుడెప్పుడో అన్నారు కానీ...ఇప్పుడు స్త్రీలు నింగి నేలా నీరు...అన్ని చోట్లా కనబడుతున్నారు...ఎంతటి కష్టతరమైన పనుల్లో అయినా మగవారితో తలపడుతున్నారు...ముఖ్యంగా మగతోడు లేకుండా ఏం చేయగలరు... అనే ప్రశ్నకు కూడా 'ఒంటరి'గా నిలబడి సమాధానం చెబుతున్నారు. ఇది ఆమె కాలం...అనే ఘనతని గుర్తింపుని తెచ్చుకుంటున్నారు

'ఎక్కువ పనిగంటలు ఉండలేరు, ప్రయాణాలు చేయలేరు...మెటర్నిటీ లీవులు పెడతారు...గట్టిగా ఏమైనా అంటే ఏడుస్తారు'....ఇలాంటి మాటలు ఉద్యోగాలు చేసే మహిళల గురించి వినబడుతుంటాయి. ఇప్పటికీ చాలామంది మగవాళ్లలో ఇలాంటి అభిప్రాయాలే ఉన్నాయి. అయితే నిజంగా మహిళలు ఇలాగే ఉంటే...వారు పైలట్లుగా, ఆర్మీ, నేవీ అధికారులుగా రాణించ గలరా...మంత్రులుగా నిర్ణయాధికారాన్ని నిలబెట్టుకోగలరా...దేశాధినేతలుగా చక్రం తిప్ప గలరా.....కార్పొరేట్ రంగంలో కెరీర్‌ని నిర్మించుకోగలరా. వీటన్నింటితో పాటు...ఒంటరిమహిళ అనే సమాజం ఇచ్చిన ట్యాగ్‌లైన్‌తోనూ....అనుకున్నది సాధిస్తూ...జీవితాన్ని తమకు నచ్చినట్టుగా మలచుకోగలరా....ఇవన్నీ సాధ్యమవుతున్నపుడు 'మహిళలకు ఇవి అసాధ్యం' అనేమాటలకు కాలం చెల్లినట్టుగానే భావించాలి.

ఆ పరిధి దాటి...ప్రగతి వైపు...

International Women's Day

ఆడపిల్ల చదువుకుని ఎంత మంచి ఉద్యోగం చేస్తున్నా 'ఆమెకు ఒక మంచి తోడు, ఒక మంచి అత్తవారిల్లు దొరకాలి...అత్తవారింట్లో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఆమె జీవితం హాయిగా సాగిపోవాలి'...లాంటి ఆలోచనలే ఉంటాయి తల్లిదండ్రుల్లో. కూతురు కలెక్టర్ అయిందని...ఏ తండ్రయినా గర్వంగా పొంగిపోతూ చెబితే...అవునా...ఇంతకీ అమ్మాయి పెళ్లెప్పుడు చేస్తున్నారు... అనేవారు మన చుట్టూ చాలామందే ఉన్నారు. స్త్రీ తన జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా పెళ్లి చేసుకుని ఇల్లాలు అనిపించుకోవడమే ఆమెకు అంతిమ లక్ష్యంగా ఉండాలనేది వారి అభిప్రాయం. ఇప్పటికీ మన సమాజంలో ఇలాంటి అభిప్రాయాల్లో పెద్దగా మార్పురాలేదు. కానీ ఆడపిల్లల మనోభావాల్లోనే చాలా మార్పులు వస్తున్నాయి. జీవిత లక్ష్యాన్ని సాధించడానికి



ఒంటరిగా ఉండటమే అవసరమైతే...అందుకు సిద్ధమేనంటున్నారు వారు. ఇలాంటప్పుడు పెళ్లి, కుటుంబ వ్యవస్థ గొప్పతనం లాంటివి తప్పకుండా తెరపైకి వస్తాయి. వీటికి గొప్ప నైతిక విషయాలుగా గుర్తింపు ఉన్న మన వ్యవస్థలో ఈ పరిధిని దాటితే అది బరితెగింపుగా, నియమాలు దాటటంగా కనబడుతోంది. కానీ ఇక్కడ ఆ అంశాలను ముడిపెట్టకుండా... వ్యక్తిగత ఇష్టాలు, లక్ష్యాలు నేరవేర్చుకోవటం, జీవితంలో అనుకున్నది సాధించడానికి కష్టపడటం, తమకాళ్లపై తాము నిలబడి...సమాజప్రగతిలో భాగస్వాములు కావటం...లాంటి అంశాలను ప్రధానంగా చేసి చూడాల్సిన అవసరం ఉంది. ఏదిఏమైనా మహిళలు తమ జీవితాలను స్టీరియోటైపు పాత్రలనుండి బయటకు తెస్తున్నారు. మీరు ఇలాగే ఉండాలి. అని చెబితే...వినే పరిస్థితి రానురాను తగ్గుతున్నది. ఢిల్లీకి చెందిన 29ఏళ్ల కనికా టెక్రివాల్... 24 విమానాలున్న భారతదేశపు అతిపెద్ద ప్రయివేటు ప్లెయిన్ ఛార్టర్ ప్లాట్‌ఫామ్ స్థాపకురాలు, నిర్వాహకురాలు. రోజుకి ఇరవై గంటలు పనిచేయాల్సి ఉంటుంది. ఇక పెళ్లికి, రిలేషన్ షిప్‌కి సమయం ఎక్కడుంది...అంటారామె.

మహిళలకు జీవితంలో లక్ష్యాలేమిటి...పెళ్లి చేసుకుని ఒక ఇంటిదైతే...అదే ఆమె జీవిత పరమావధి...అనేది ఒకపరిధితో కూడిన జీవనశైలి. పెళ్లి కుటుంబ జీవనాన్ని తక్కువ చేయటం కాదుకానీ...నిజంగా అదే ఆలోచనా ధోరణిలో మహిళలంతా ఉంటే...వారికంటూ జీవితంలో ప్రత్యేకంగా లక్ష్యాలేమీ ఉండవు. వారు తమ శక్తిసామర్థ్యాలకు, తమ శ్రమకు ఎప్పటికీ విలువ కట్టుకోలేరు. అందుకే... పెళ్లి మాత్రమే స్త్రీ జీవితాన్ని పరిపూర్ణం చేస్తుందని, పక్కన పురుషుడు ఉంటేనే...ఆమె జీవితం సంపూర్ణమవుతుందని భావించే వారికి వీరు...తమ శక్తి సామర్థ్యాలతో సమాధానం ఇస్తున్నారు. మనిషిగా గుర్తింపుని ఆశిస్తూ...తరాలుగా పాతుకుపోయిన భావజాలాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా 'పసితనంలో తండ్రి రక్షణ, వయసులో ఉన్నపుడు భర్త నీడ, వయసు మీరాక కుమారుడి అండ' అనే అతి గాఢమైన స్టీరియోటైపు భావజాలానికి ఒంటరి మహిళలు సవాలు విసురుతున్నారు.

కెరీర్‌లో ఒకస్థాయికి చేరుకుని ఒంటరిగా మిగులుతున్న స్త్రీలను తమ తరువాత తరాల కోసం పోరాడుతున్నవారిగానే భావించాల్సి ఉంటుంది. ఒక్కోసారి పెళ్లి అనేది స్త్రీకి చట్రంగా మారుతున్నపుడు...ఆ పరిధిని దాటితే కానీ...ముందుకు వెళ్లలేనప్పుడు...అలా దాటడాన్ని ముందడుగుగానే భావించాల్సి ఉంటుంది. మనదేశంలో ఒంటరిమహిళల సంఖ్య పెరుగుతోంది. 2001లో వీరి సంఖ్య ఐదు కోట్ల వరకు ఉండగా...అది 2011నాటి ఏడుకోట్ల వరకు పెరిగింది. అంతేకాదు మహిళల సగటు పెళ్లి వయసులో సైతం మార్పు వచ్చింది. 2001లో ఇది 18.3 సంవత్సరాలు ఉండగా...అది 2011 నాటికి 22.2 సంవత్సరాలకు పెరిగింది. అంతేకాదు...విదేశాలకు ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళల సంఖ్యసైతం పెరిగింది. ఇప్పుడు సింగిల్ ఉమెన్‌గా ఉన్నవారు తమ తల్లుల కాలంకంటే తమ జీవితాలు బాగున్నాయని భావిస్తున్నారు. స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్నారు, దేశవిదేశాల్లో తమకు నచ్చినచోటుకి ప్రయాణం చేయగలుగుతున్నారు. ఆర్థిక భద్రతకోసం కాకుండా కేవలం సహచర్యం కోసమే పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. అయితే వీరు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమీ లేవా...అంటే ఉంటున్నాయి. ఇప్పటికీ సింగిల్‌ఉమెన్‌కి ఇల్లు అద్దెకు కావాలంటే...ఎన్నో ఆటంకాలు ఎదురవుతున్నాయి. పెళ్లి ఎప్పుడు చేసుకుంటావ్...అనే ప్రశ్న, ఒత్తిడి అయినవారి నుండే కాదు...సమాజంనుండి ఎప్పుడూ ఉంటుంది. ఆమె ఎలా జీవిస్తోంది...అనే కుతూహలం చుట్టుపక్కల వారిలో ఉండితీరుతుంది. ఆమెతో ఎవరు సన్నిహితంగా ఉంటున్నారు, ఎవరెవరు ఆమెకోసం ఇంటికి వస్తున్నారు...లాంటి విషయాలు ఆమె చుట్టుపక్కన ఉన్నవారందరికీ ఆసక్తికరంగానే అనిపిస్తాయి. ఇక సింగిల్‌గా ఉన్న మహిళలు ఎంత కష్టపడి పైకి వచ్చినా...వారికి ఆ క్రెడిట్ అంతత్వరగా దక్కదు. ఆమె మరోరకంగా విజయం సాధించి ఉంటుందనే ఊహాగానాలు వినబడుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ వారు తమకోసం తాము జీవించడాన్ని ఒక సవాలుగా తీసుకుని జీవిస్తున్నారంటే...భావితరాన్ని ఒక పరిధిని దాటిస్తున్నట్టేనని భావించాలి.



గగనమంత ఘనత

నాటి ఝాన్సీ లక్ష్మీభాయ్ నుంచి నేటిరకు... భారతీయ మహిళలు యుద్ధరంగంలో తన ప్రతిభను చాటుతూనే ఉన్నారు. మగవాళ్లు మాకంటే ఎందులో గొప్పోళ్లంటూ అన్నిరంగాల్లోనూ దూసుకెళ్తున్నారు. ఆకాశమంతా మేమే అంటూ ప్రపంచ యవనికపై మువ్వన్నెలు అద్దుతున్నారు. భారత కీర్తిపతాకను గగన తలంపై రెపరెపలాడిస్తున్నారు. తమ కలలను సాకారం చేసుకుంటూ.... విమానపైలెట్లుగా రాణిస్తూ.. ..దేశానికి సేవలు అందిస్తున్నారు. ఇటీవల జరిగిన భారతీయ మహిళా పైలట్ల అసోసియేషన్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్రమంత్రి జయంత్‌సిన్హా ప్రకటించిన ప్రకారం ..అటు ఎయిర్ ఫోర్స్ లో లేదా ఇటు ఎయిర్ ఇండియాలో.... ప్రపంచంలోనే అత్యధిక విమాన పైలెట్లున్న దేశంగా కొత్త రికార్డు సృష్టించారు భారతీయ నారీమణులు. అంటే విమానయాన రంగం లో భారతీయ మహిళ సాధిం చిన.. గగన మంత ఘనత ఇది!అంతే కాదు.. విమానయాన రంగం అభివృద్ధిలో మహిళలు గణనీయ మైన పాత్ర పోషిస్తూ.... ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఫ్లైయింగ్ ఆఫీసర్ అవని చతుర్వేది... ఏకంగా యుద్ధ విమానాన్ని నడిపి ..భారతీయ మహిళ సాధించలేనిది అంటూ ఏదీ లేదని నిరూపించారు. జామ్‌నగర్‌లో జెట్ ఫైటర్ షోలోను ఆమె నడిపిన సంగతి తెలిసిందే. భావనా కాంత్, మోహనా సింగ్‌లతో పాటు అవని చతుర్వేది జూన్ 18, 2016లో ఎయిర్ ఫోర్స్ స్క్వాడ్రన్‌లో ప్రవేశించారు. డిసెంబర్ 16, 2017లో రెండో బ్యాచ్‌లో మరో ఇద్దరు మహిళలు ఎయి.ర్‌ఫోర్స్‌లోని ఫైటర్ స్ట్రీమ్‌లో ప్రవేశించారు. 2015లో భారత ప్రభుత్వం యుద్ధరంగంలోకి మహిళలకు ప్రవేశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆకాశంలో సగం కాదు ఆకాశమంతామేమే.. అంటూ బారతీయ ధీరవనితలు దూసుకొస్తున్నారు. మరోవైపు...ఇప్పటికి ఆర్మీ మరియు నావికాదళంలో మహిళలకు కొన్ని పరిమితులు ఉన్నాయి. కాని జెట్‌ఫైటర్‌ను నడిపిన అవని మాత్రం..మాకు పరిమితులెందుకు.... అవకాశం ఇస్తే గగన తలాన్నంతా ఆక్రమిస్తామని చాటిచెప్పింది! ఆదిశలో భారత ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తుందని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆకాంక్షిద్దాం!



- ఫీచర్స్ డెస్క్

యుద్ధనౌకలకూ...సిద్ధమే!

ఊయలలలూపే చేతులు తుపాకి పట్టుకుని దేశాన్ని రక్షిస్తాయా...అనే ప్రశ్నకు ఇప్పుడు చాలామంది స్త్రీలు అవునని సమాధానం చెబుతున్నారు. రిపబ్లిక్ డే నాడు జరిగే త్రివిధ దళాల కవాతులో స్త్రీలు తమ ధైర్యానికి నిదర్శనంగా కనబడుతూ కదం తొక్కుతున్నారు. తమ స్థాయిని పెంచుకున్న తీరుని తమ పదఘట్టనలతో నినదిస్తూ లోకానికి చాటుతున్నారు. స్త్రీలు అత్యంత తక్కువగా ఉన్న నేవీ ఫోర్స్‌లోనూ వారి ఉత్సాహం, ధైర్యం, ముందడుగు స్పష్టంగా కనబడుతోంది. 1994లో సంధ్యాసూరి యుద్ధనౌకలో విధులు నిర్వర్తిస్తున్నపుడు అక్కడ మహిళల సంఖ్య కేవలం ఇద్దరు. మిగిలిన 250మంది పురుషులే. సంధ్యాసూరి అప్పట్లో లాజిస్టిక్ ఆఫీసర్‌గా పనిచేసేవారు. కష్టపడి పనిచేసేవారు తప్పితే ఎలాంటి మినహాయింపులు ఆశించలేదు. అయినా ఆమెని లేడీ అని పిలిచేవారు తప్పితే ఆఫీసర్ అనేవారు కాదు. ఇదంతా 1990 దశకం నాటి మాట. ఇప్పుడు పరిస్థితి మారింది. 2015నాటికి మహిళల ప్రాతినిధ్యం బాగా పెరిగింది. యుద్ధ నౌకల్లో మహిళలను అనుమతించాలనే విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. నౌకల నిర్మాణంలో మహిళలకు సైతం అనుకూలంగా ఉండేలా మార్పులు చేశారు. 1992లో సైనిక దళాల్లో మహిళలను మెడికల్, పారామెడికల్ విభాగాలలో మాత్రమే నియమించేవారు. తర్వాతికాలంలో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సి) ద్వారా నియామకాలు జరిపారు. నేడు నేవీలో 570 మంది మహిళా అధికారులు ఉన్నారు. నిజానికి నేవీలో పనిచేయడానికి



మహిళలకు తగిన వసతులు నేటికీ తక్కువగానే ఉన్నాయి. కానీ ఈ రంగంలోకి రావాలనే ఉత్సాహం మాత్రం వారిలో తగ్గటం లేదన్నది నిజం. అందుకే స్త్రీలకు అనుకూలంగా అనివార్యంగా కొన్ని మార్పులు అక్కడ జరుగుతున్నాయి. తమకు అనుకూలంగా లేని, సౌకర్యాలు లేని రంగాల్లోకి కూడా మహిళలు జంకులేకుండా వెళుతున్నార నడానికి ఇదే నిదర్శనం. గత సంవత్సరంలో కొంతమంది మహిళలు బృందంగా ఏర్పడి నౌకలో ప్రపంచయాత్రకు వెళ్లి రికార్డు సృష్టించారు. ఈ రంగంలోకి మరింతగా దూసుకురావడానికి మేము సిద్ధంగానే ఉన్నామని చెప్పకనే చెప్పారు.

గవర్నర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్ఎల్. నరసింహన్ మహిళా లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ సమగ్రత, సమైక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించడంలో మహిళలు గొప్ప పాత్ర పోషించారని మహిళా దినోత్సవ సందేశంలో గవర్నర్ పేర్కొన్నారు. సమాజానికి స్ఫూర్తిదాయకం భారతీయ మహిళలు సమాజానికి స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. కుటుంబ వ్యవస్థ, దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు సమాజానికి దేవుడిచ్చిన వరం అని అన్నారు.

తెలుగు ముఖ్యమంత్రుల శుభాకాంక్షలు





అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు ప్రజలకు, ముఖ్యంగా మహిళ లకు తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందినపుడే ఏ సమాజమైనా సంపూర్ణంగా పురోగమిస్తుందన్నారు. మహిళలు సాధికారత సాధించడం కోసం యావత్ సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళల అభ్యున్నతి, స్వేచ్ఛ, భద్రత, ప్రోత్సాహం కల్పించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

ద.మ. రైల్వే జీఎం మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సాధికారతకు రైల్వే తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇప్పటికే మూడు మహిళా రైల్వే స్టేషన్లను ప్రకటించడం జరిగిందన్నారు. మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయం అని అన్నారు. రైల్ నిలయంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో కూడా ఆయన పాల్గొన్నారు.



ఆ మూడు రైల్వేస్టేషన్లలో మహిళా ఉద్యోగులే

బేగంపేట, చంద్రగిరి, ఫిరంగిపురం


హైదరాబాద్, ఆంధ్రప్రభ: మహిళా ఉద్యోగులలోని శక్తియుక్తులను, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింపచేసే దిశలో దక్షిణ మధ్య రైల్వే కొత్త చొరవ తీసుకుంది. గుంతకల్లు డివిజన్‌లో చంద్రగిరి రైల్వే స్టేషన్‌లో రైళ్ల నిర్వహణ, టికెట్ల బుకింగ్, భద్రత మొదలైన అన్ని కార్యకలాపాల నిర్వహణకు మహిళా ఉద్యోగులనే నియమించి మహిళా ఉద్యోగుల రైల్వే స్టేషన్‌గా ఏర్పాటు చేసింది. దీనికి కొనసాగింపుగా జోన్‌లోని మరో రెండు రైల్వే స్టేషన్ల సికింద్రాబాద్ డివిజన్‌లో బేగంపేట, గుంటూరు డివిజన్‌లో ఫిరంగిపురం రైల్వే స్టేషన్లను కూడా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా ఉద్యోగుల రైల్వే స్టేషన్లుగా ప్రకటించేందుకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేశారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ ఈ మూడు స్టేషన్లను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. మహిళా ఉద్యోగులతో ముఖాముఖి నిర్వహించారు. చంద్రగిరి రైల్వే స్టేషన్‌లో నలుగురు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్లు, ముగ్గురు పాయింట్స్ ఉమెన్ మహిళలే. చంద్రగిరి రైల్వే స్టేషన్ తనిఖీ సందర్భంగా మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అక్కడ విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగుల అంకిత భావాన్ని, నిబద్ధతను అభినందించారు. బేగంపేట రైల్వేస్టేషన్‌లో 8 మంది కమర్షియల్, నలుగురు రిజర్వేషన్ గుమస్తాలను, రైల్వే రక్షణ దళానికి సంబంధించిన ఆరుగురు పోలీసులు, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ సహా అందరూ మహిళలనే నియమించడానికి దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తుంది. ఫిరంగిపురం రైల్వే స్టేషన్‌లో ముగ్గురు మహిళా అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్లు, ఆరుగురు పాయింట్స్ ఉమెన్, ఇద్దరు మహిళా ఆర్‌పీఎఫ్ పోలీసులను నియమించడానికి జోన్ ప్రణాళిక సిద్ధం చేసింది



ఏపార్టీ మనకు సురక్షితం?!

నేతల అన్వేషణ!

- అన్ని పార్టీల్లోనూ సమస్యలే..
- అటు- ఇటు వలసలు అనివార్యం?
- ఫలితంగా కూటమి ప్రభుత్వం రావొచ్చు?



హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్లో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు స్పష్టమౌతున్నాయి. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ఇప్పటికే ప్రస్తుత ప్రజాప్రతినిధుల్లో పలువురు పార్టీమారే ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. గతెన్నికలకు ముందుకు రాష్ట్ర విభజన కారణంగా కాంగ్రెస్ పట్ల విశ్వసనీయత పూర్తిగా కొరవడింది. ఆ పార్టీలో దశాబ్దాల తరబడి వివిధ పదవులు అనుభవించిన నాయకులు కూడా రాత్రికి రాత్రే తెలుగుదేశం, బిజెపిల్లో చేరారు. వీరిలో కొందరు ఆయా పార్టీల తరపున సీట్లు పొంది తిరిగి చట్టసభల్లోకి ప్రవేశించారు. మరికొందరు ఆశించిన ఫలితాన్ని పొందలేక పోయారు. అయితే ఇలా పార్టీలు మారిన పలువురు తెలుగుదేశం, బిజెపిల్లో ఇప్పటికీ ద్వితియశ్రేణి పౌరులుగానే పరిగణించబడుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నాయకుల్తో సమానంగా వీర్ని తెలుగుదేశం చూడ్డంలేదు. అలాగే ఆర్ఎస్ఎస్ భావజాలం నుంచొచ్చిన సైద్ధాంతిక నిబద్ధతగల బిజెపి నాయకులిలా పార్టీ మారొచ్చిన గాలివాటు నాయకులకు తమతో సమానంగా గుర్తింపునివ్వడంలేదు. పేరుకు ప్రజాప్రతినిదులుగా ఉన్నా అధినేత నుంచి సీనియర్ల వరకు వీరిపట్ల సందేహాస్పద దృక్పథంతోనే వ్యవహ రిస్తున్నారు. మరోవైపు ఎక్కడ పోగొట్టుకున్నామో.. అక్కడే తిరిగి పొందాలన్న చందంగా కాంగ్రెస్ హోదా ఉద్యమాన్ని సీరియస్గా తీసుకుంది.

రాష్ట్ర విభజనకు కారకులైన తామే రాష్ట్ర పునరుజ్జీవానికి దోహదపడతామంటూ హామీలిస్తోంది. ఆ పార్టీ అధినేత రాహుల్గాంధీ తామధికారంలోకొస్తే తొలి సంతకం హోదా దస్త్రంపైనేనంటూ ప్రకటించడం ద్వారా ఆంధ్రప్రదేశ్లో ఆ పార్టీ తిరిగి ఊడలేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాగల ప్రసక్తి లేనప్పటికీ కొద్దిపాటి సీట్లను కాంగ్రెస్ కూడా పొందగలుగుతుందన్న ధీమా తాజా పరిణామాల్తో మాజీ కాంగీయులకేర్పడింది. దీంతో తెలుగుదేశం, బిజెపిల్లో ద్వితీయశ్రేణి పౌరులుగా బతుకీడ్చడం కంటే తిరిగి సొంత పార్టీ మెట్లెక్కడమే మేలన్న ఆలోచన వీరిలో కొందరు చేస్తున్నట్లు సమాచారం.

గతెన్ని కలకు ముందు రాష్ట్రంలో ప్రత్యేక పరిస్థితులున్నాయి. ఇందుకనుగుణంగా గెలుపే ధ్యేయంగా శక్తివంతమైన నాయకుల్ని ఇతర పార్టీల్నుంచి చేర్చుకుంది. బాగా డబ్బు, పలుగుబడి కలిగిన పారిశ్రామిక వేత్తలకు సీట్లిచ్చి బరిలో దింపింది. దీనికి మోడి, బిజెపిల గాలి కూడా తోడైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. దేశంలో ఎలా ఉన్నా ఆంధ్రప్రదేశ్ కొచ్చేసరికి బిజెపి పట్ల విశ్వాసం తగ్గుతోంది. మోడిపై వ్యతిరేకత పెరుగుతోంది. రాష్ట్ర పున రుజ్జీ వానికి కేంద్రం ఏం చేయడం లేదన్న ఆందోళన తీవ్రతర మౌతోంది. ఈ నేపధ్యంలో పొత్తులెలా ఉంటాయన్న సందిగ్ధం నెలకొంది. మరోవైపు అధికారమే ధ్యేయంగా జగన్ తన సర్వ శక్తులొడ్డి పోరాడుతున్నారు. తీవ్ర స్థాయిలో ప్రయ త్నాలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పట్నుంచే సురక్షిత పార్టీని ఎంచుకోవడం మేలన్న భావం పలువురిలో వ్యక్త మౌతోంది. హిందూవాద నేపధ్యంలేని బిజెపి నాయకులు స్పష్టమైన హామీలుంటే తెలుగుదేశంలో చేరేందుకు ప్రయ త్నాలు చేస్తున్నారు. అలాగే గతెన్నికలకు ముందు తెలుగు దేశం, బిజెపిల్లో చేరిన మాజీ కాంగీయులు సొంతగూటివైపు దృష్టిమరల్చారు. అధికార పార్టీలో సీట్లొచ్చే అవకాశాల్లేని బలమైన నాయకులు పోటీచే ధ్యేయంగా వైకాపాలో ప్రయ త్నాలు మొదలెట్టారు. వీరందరితో పాటు గతెన్నికల్లో వైకాపా తరఫున గెలుపొంది తెలుగుదేశంలో చేరిన ఎమ్మెల్యేల్లో పలువురికి భవిష్యత్ పట్ల బెంగ పట్టుకుంది. ఆయా నియోజకవర్గాల్లో తెలుగుదేశం ఇన్ఛార్జిలుగా వ్యవహరిస్తున్న వార్నికూడా తమకు సీట్లొచ్చే అవకాశాలపై సందిగ్ధమేర్పడింది. ఒకవేళ అధినేత సీటిచ్చినా ప్రబలాద రిస్థాయానన్న భయాందోళనలు పెరిగాయి. దీంతో వారో రాజకీయ పార్టీవైపు దృష్టిపెట్టడం మంచిదన్న భావం వ్యక్త మౌతోంది.

ఇలా దాదాపు అన్ని పార్టీల్లోనూ సంశయాత్మక పరిస్థితి నెలకొంది. ఎందులో కొనసాగితే తమకు భవిష్యత్ భద్రమో తెలీని అయోమయంలో వీరంతా కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారే అవకాశాలుంటాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. బలమైన నాయకుల రాకపోకల కారణంగా ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు వెలువడే అవకాశాలుండవని కూడా వీరు సూత్రీకరిస్తున్నారు. కొన్ని పార్టీల కూటమి లేదా కలసి మాత్రమే ప్రభుత్వాన్నేర్పాటు చేసే అవకాశాలుంటాయని విశ్లేషిస్తున్నారు.

ఎన్డీయేకి బీటలు

కేబినెట్ నుండి వైదొలిగిన తెదేపా

అదేబాటలో శివసేన, సందిగ్ధావస్థలో శిరోమణి అకాలీదళ్

న్యూఢిల్లీ: ఎన్డీయే కూటమిలో భాగస్వామ్య పక్షాల మధ్య అంతరం పెరుగుతోంది. ఆయా పక్షాల రాజకీయ ప్రయోజనాలను పరిరక్షించడంలో కూటమికి నేతృత్వం వహిస్తున్న బిజెపి నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్ విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలతో పాటు, పార్లమెంట్వేదికగా ప్రధానమంత్రి ఇచ్చిన ప్రత్యేకహోదా హామీని నెరవేర్చడంలో అలక్ష్య వైఖరికి నిరసనగా కేంద్ర కేబినెట్లో తెదేపా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి రాజీనామా చేయనున్నారు. తాజా పరిణామ నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన శివసేన కూడా ఎన్డీయే కూటమి నుంచి వైదొలగనున్నట్టు సమాచారం. అటు కేంద్ర కేబినెట్ నుంచి, ఇటు మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలో శివసేన నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు రాజీనామా చేయనున్నట్టు సమాచారం. ఇప్పటికే పలుమార్లు ఇదే అంశాన్ని ఆ పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే ప్రకటించిన విషయం తెలిసిందే. పంజాబ్ రాష్ట్రానికి చెందిన శిరోమణి అకాలీదళ్ కూడా బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో విసిగి, వేసారినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగడంతో పాటు ఎన్డీయే కూటమి నుంచి బైటకు రావాలని ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది.

నేడు మహిళా ఉద్యోగులకు సాధారణ సెలవు

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 8వ తేదీన (గురువారం) మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవును ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్, శైలేంద్ర కుమార్ జోషి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలోని మహిళా ప్రభుత్వ ఉద్యోగలందరికీ ఈ ప్రత్యేక సాధారణ సెలవు వర్తింపచేస్తుందన్నారు. ప్రభుత్వం 2010 నుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సం దర్భంగా ప్రభుత్వ ఉద్యోగులైన మహిళలకు ప్రత్యేక సాధారణ సెలవును ఇస్తున్నది. మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో ఉద్యోగినీలు కూడా పెద్ద ఎత్తున పాల్గొనాలనే ఆలోచనతోనే ప్రభుత్వం ప్రతి ఏటా సెలవు ప్రకటిస్తుంది. శాఖాధి పతులు, జిల్లా కలెక్టర్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మహిళా ఉద్యో గులు 8వ తేదీన సెలవు తీసుకొనే వెసులుబాటు కల్పించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

లలిత కళాతోరణంలో మహిళా దినోత్సవం

మార్చి 8న పబ్లిక్ గార్డెన్స్లోని లలిత కళాతోరణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, భాషా సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో విశిష్ట మహిళా పురస్కారాలను ప్రదానం చేయన్నారు. సాయంత్రం 5.30 గంటలకు ఉప సభాపతి పద్మా దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగే విశిష్ట మహిళా పురస్కార ప్రదానోత్సవంలో ముఖ్యఅతిధిగా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్రావు, ప్రత్యేక అతిథులుగా ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, గౌరవ అతిథులుగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అజ్మీరా చందూలాల్ పాల్గొంటారు.

కేసీఆర్తో ఆ ముగ్గురు

ఢిల్లీ టీం రెడీ

అధినేతకు తోడుగా హరీష్, కవిత, సంతోష్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతీయరాజకీయ ప్రవేశాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి కెసిఆర్ ఏప్రిల్ 27నుండి తన జోరును మరింత విస్తృతం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో తనకు తోడుగా టీంను కూడా కెసిఆర్ ఖరారుచేసుకున్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే కుమార్తె కల్వకుంట్ల కవిత నిజామాబాద్ ఎంపీగా ఉండగా, మరోసారి ఆమెను అక్కడినుండే పోటీకి దింపాలని సిఎం నిర్ణయించినట్లు చర్చ జరుగుతోంది. మొదట జగిత్యాల నుండి అసెంబ్లీకి పోటీచేయాలని కవిత భావిస్తున్నట్లు ప్రచారం జరగ్గా, జాతీయ స్థాయిలో గత నాలుగేళ్ళలో కవిత పెంపొందించుకున్న సంబంధాలు.. మహిళానేతగా దూసుకెళ్ళే స్వభావం జాతీయరాజకీయాల్లో ఫ్రంట్కు ఉపయోగపడుతాయని కెసిఆర్ భావిస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆదినుండీ ముఖ్యమంత్రి వ్యవహారాలు చక్కబెడుతూ.. సిఎంకు కుడిభుజంగా.. వ్యవహరిస్తున్న జోగినిపల్లి సంతోష్కుమార్ను రాజ్యసభ అభ్యర్ధిగా పంపాలని సిఎం ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎంపిక వల్ల జాతీయ స్థాయిలో పార్టీకి, వ్యక్తిగతంగా ముఖ్యమంత్రికి బాధ్యతల భారం తగ్గుతుందని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి.

ట్రబుల్ షూటర్ తన వెంటే..

టిఆర్ఎస్లో ట్రబుల్షూటర్గా పేరున్న రాష్ట్రనీటిపారుదల శాఖా మంత్రి హరీష్రావును మెదక్ లేదా జహీరాబాద్ పార్లమెంట్ స్థానాల నుండి పోటీకి నిలిపి.. జాతీయ రాజకీయాల్లో తనకు తోడుగా కెసిఆర్ ఉంచుకుంటారన్న చర్చ జరు గుతోంది. మహారాష్ట్ర, కర్ణాటకలతో పాటు పలు రాష్ట్రాల నేతలతో ఉన్న సం బంధాలు.. ఏ టాస్క్ అప్పగించినా విజయవంతంగా పూర్తి చేసుకురావడం, నేర్పుగా.. ఓర్పుగా సమస్యలు పరిష్కరించే బలం జాతీయస్థాయి రాజకీయాల్లో ఫెడ రల్ ఫ్రంట్కు దోహదపడతాయని సిఎం భావిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర రాజ కీయాల్లో పూర్తిగా కెటిఆర్కు స్వేచ్ఛనిచ్చి జాతీయస్థాయి ఫ్రంట్ నిర్మాణానికి ఈ ముగ్గురు నేతలను తీసుకెళ్ళేలా ప్లాన్ చేస్తున్నారని చెబుతున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఏ బాధ్యత అప్పగించినా.. శిరసావహిస్తానని పలువార్లు హరీష్రావు ప్రకటించిన నేపథ్యంలో తాజా రాజకీయపరిణామాలపై పార్టీలో, ప్రజల్లో చర్చ జరుగుతోంది.

త్వరలో ఏపీ మంత్రివర్గ విస్తరణ

రేసులో షరీఫ్, రవిచంద్ర, పయ్యావుల, పల్లెరఘునాథ రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శాసనసభ బడ్జెట్ సమావేశాల తర్వాత ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రి వర్గాన్ని విస్తరించే అవకాశం ఉంది. భారతీయ జనతా పార్టీకి చెందిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు మంత్రి వర్గం నుంచి తప్పు కోవడంతో మరో ఇద్దరు తెదేపా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అమాత్య పదవులు దక్కనున్నాయి. మంత్రివర్గంలో చంద్రబాబుతో కలిపి 26 మంది మంత్రులున్నారు. విస్తరణలో ఇద్దరికీ అవకాశం ఉంటుందని, ఎవరినీ తొలగించే సూచ నలు కనిపించడం లేదని తెదేపా వర్గాలు చెబుతున్నాయి.సార్వత్రిక ఎన్ని కల్లో గెలిచాక తనతో పాటు మంత్రివర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఏడాది క్రితం రెండో సారి కొందరు మంత్రులను తొలగించి ఆ స్థానంలో మం త్రులుగా అదే సామాజిక వర్గానికి చెందినవారికి అవకాశం కల్పించారు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా నుంచి పార్టీ ఏపీ అధ్యక్షుడు కళావెంకట్రావు, అచ్చెంన్నాయుడు, విజయనగరం నుంచి వైకాపా నుంచి తెదేపాలో చేరిన ఆర్వీ సుజయ్ కృష్ణ రంగారావు, విశాఖ జిల్లా నుంచి గంటా , అయ్యన్న పాత్రుడు, తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న యనమల, ఉప ముఖ్య మంత్రి చినరాజప్ప, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి జెవహర్, పితాని ,మాణి క్యాలరావులు ఉన్నారు. కృష్ణా జిల్లా నుంచి కామినేని , కొల్లు రవీంద్ర, దేవినేని ఉమా, గుంటూ రు జిల్లా నుంచి పత్తిపాటి పుల్లా రావు, నక్కా ఆనంద్బాబు, ప్రకాశం జిల్లా నుంచి సిద్ధా రాఘవరావు, నెల్లూరు జిల్లా నుంచి ఎమ్మెల్సీలు నారాయణ, సోమి రెడ్డి , కడప జిల్లా నుంచి ఆదినారా యణరెడ్డి, అనం తపురం జిల్లా నుంచి కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత, చిత్తూరు జిల్లా నుంచి అమర్నాథ్ రెడ్డి, కర్నూలు జిల్లా నుంచి ఉప ముఖ్య మంత్రి కేఈ , అఖిలప్రియలు మంత్రివర్గంలో ఉండగా చంద్రబాబు తనయుడు లోకేష్ కూడా అమా త్యులుగా గత విస్తరణలో బాధ్యతలు చేపట్టారు. ఇద్దరు బీజేపీ మంత్రుల రాజీనామా తో ఖాళీగా ఉన్న ఈ రెండు పదవులను త్వరలో చంద్రబాబు భర్తీ చేస్తారని తెలుస్తోంది. ప్రకాశం, కడప జిల్లాల నుంచి మంత్రి వర్గ విస్తరణలో ఇరువురికి అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు. కాగా, మైనార్టీ, గిరిజన సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రివర్గంలో అవకాశం లేకపోవడంతో ఈ విస్తరణలో ఈ రెండు సామాజిక వర్గాలకు చెందిన వారిని మంత్రులుగా ఎంపిక చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. నంద్యాల ఉప ఎన్నిక తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ మంత్రి ఫరూఖ్ను శాసన మండలి ఛైర్మన్గా ఎంపిక చేశారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఎమ్మెల్సీగా ఉన్న షరీఫ్కు ఈ విస్తరణలో అవకాశం దక్కవచ్చని భావిస్తు న్నారు. అనంతపురం జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నేత ఎమ్మెల్సీగా ఎన్నికైన పయ్యావులను శాసనమండలి చీఫ్ విప్గా నియమించారు. ఆయన కూడా ఈ దఫా మంత్రి పదవికి పోటీ పడే అవకాశం ఉంది. నెల్లూరు జిల్లాకు చెందిన తెలుగు యువత మాజీ అధ్యక్షుడు, ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాకు పార్టీ అధ్యక్షు డిగా కొనసాగుతున్న బీద రవిచంద్ర ను కూడా మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. గత విస్తరణలోనే రవిచంద్ర మంత్రి పదవి కోసం పావులు కదిపారు. ఈ దఫా విస్తరణలో కచ్చితంగా అవకాశం కల్పిస్తానని చంద్రబాబుతో పాటు యువనేత నారా లోకేష్ హామీ ఇచ్చారు. గత మంత్రివర్గ విస్తరణలో పదవి కోల్పోయిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి కూడా తన సామాజికవర్గం నుంచి ఈ దఫా మంత్రి పదవికి పోటీ పడే అవకాశం ఉంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

నేడు వి-హబ్ ప్రారంభం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరిం చుకుని రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వి-హబ్ను గురువారం ప్రారంభించనున్నారు. ఇటీవల హైదరాబాద్లో జరిగిన ప్రపంచ పారిశ్రామిక వేత్తల సదస్సు (జీఈఎస్) సందర్భంగా వి-హబ్ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేసి పూర్తిస్థాయిలో దాన్ని ప్రారంభించి మహిళా ఔత్సాహికులను అందుబాటులోకి తేనున్నారు. మహిళా సాధికారత, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించిన ఐటి మంత్రిత్వశాఖ అంతర్జాతీయ సదస్సు వేదికగా వి-హబ్ ఏర్పాటుపై కేటీఆర్ ప్రకటించి మహిళలను ప్రోత్సాహించడంపట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు.

ఎంపీటీసీ భర్త దారుణ హత్య

సిరిసిల్ల జిల్లా కొత్తపెల్లిలో ఘటన



గంభీరావుపేట, ప్రభన్యూస్: రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావుపేట మండలానికి చెందిన కొత్తపెల్లి ఎంపీటీసీ బీనవేని చంద్రకళ భర్త దేవయ్య(42)ను అదే గ్రామానికి చెందిన వంగ సందీప్రెడ్డి అనే యువకుడు బుధవారం కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. గ్రామస్థులు, సంబంధీకులు, ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపిన వివరాల మేరకు కొత్తపెల్లి ఎంపీటీసీ భర్త దేవయ్య అదే గ్రామానికి చెందిన సందీప్ ఒక విందుకు హాజరయ్యారు. అక్కడే ఉన్న సందీప్తో దేవయ్య వాగ్వివాదం పెంచుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి సందీప్ తన వెంట తెచ్చుకున్న కత్తితో దేవయ్యను సున్నిత భాగాలైన చాతిపై తదితర భాగాలపై బలంగా పొడవడంతో దేవయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. నిందితుడు సందీప్ తండ్రి శ్రీనివాస్రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్రెడ్డికి మృతుడు దేవయ్యకు గతంలో వివాదాలు ఉన్నాయని , ఇదే హత్యకు దారి తీసినట్లుగా గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ హత్య జరగడంతో కొత్తపల్లి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇది కావాలని చేసిన హత్యే అని ఒక రోజు క్రితం నుండే నిందితుడు సందీప్ పెద్ద కత్తికోసం వెతుకులాడుతున్నాడని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఇది కక్షతో చేసిన హత్య అని తమకు న్యాయం ఏం చేస్తారో చెప్పేవరకు మృతదేహాన్ని పోస్టుమార్టంనకు పంపించమని సంబంధీకులు పట్టుబట్టారు. ఇది కులాల మధ్య చిచ్చు రాజేస్తున్నారని వారు ఆవేదనగా తెలిపారు. ఎల్లారెడ్డిపేట సీఐ రవీందర్, గంభీరావుపేట ఏఎస్సై జాఫర షరీఫ్లు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతామన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, తల్లితండ్రి ఉన్నారు.

తండ్రి, కొడుకు దారుణ హత్య

బాసర, ప్రభ న్యూస్ : నిర్మల్ జిల్లా, బాసర మండల కేంద్రంలో తండ్రి, కొడుకుల దారుణ హత్య కలకలంరేపింది. రైల్వేస్టేషన్ ప్రాంతంలోని భైంసా నుండి నిజామాబాద్ వైపు వెళ్ళే స్టార్ ఇన్ రెస్టారెంట్ యజమాని, తండ్రిని గుర్తి తెలియని దుండగులు అతి కిరాతకంగా హత్యచేశారు. నిజామాబాద్-భైంసా రహదారి పక్కన బాసరలో గల స్టార్ ఇన్ రెస్టారెంట్ను గత పది సంవత్సరాల కాలంగా లీజుకు తీసుకుని రితేష్ అనే వ్యక్తి నడుపుతున్నాడు. ఇతనికి తన తండ్రి, భార్య, కుమారుడు ఉన్నారు. ఎప్పటిలాగే మంగళవారం స్టార్ ఇన్ రెస్టారెంట్ను 11 గంటల ప్రాంతంలో మూసేసి రెస్టారెంట్లోనే సేదతీరారు. మరుసటి రోజైన బుధవారం ఉదయం 9 గంటలవుతున్న యజమాని బయటకు రాకపోవడంతో పనిచేసే కార్మికులు యజమానిని లేపేందుకు వెళ్ళి చూసేసరికి రక్తపు మడుగులో ఉండడాన్ని చూసి భయ భ్రాంతు లకు లోనయ్యారు. పక్కనున్న వారికి ఈ సమా చారాన్ని తెలి యజేసి పోలీసు లకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న బాసర ఎస్ఐ మహేష్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రెస్టారెంట్ యజమాని రితేష్(44), తన తండ్రి గోపీనాథ్(64)ల రక్తపు మడుగులో పడి ఉన్నారు. ఎవరో గుర్తుతెలియని దుండగులు గొంతు కోసి అతి దారుణంగా హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ స్టార్ ఇన్ రెస్టారెంట్ను పరిశీలించారు.

రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మహిళా భద్రత, అభివృద్ధికి తెలంగాణ ప్రభు త్వం పెద్దపీట వేస్తు న్నదని నిజామాబాద్ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురు వారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం సంద ర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్ను పార్లమెంట్లో ఎపుడు ప్రవేశపెట్టినా తాము మద్దతిస్తామన్నారు. విద్యతో పాటు అన్నిరంగాల్లో అందివచ్చిన అవకాశాలు వినియోగించుకుంటూ ధైర్యంగా ముందడుగు వేస్తే విజయం వరిస్తుందన్నారు. మహిళల అక్షరాస్యత పెరగడం, ఉన్నత చదువులు చదవడం వల్ల పురుషుల్లో మార్పు వస్తున్నదన్నారు.

కేసీఆర్ థర్డ్ ఫ్రంట్కు

ఎన్ఆర్ఐల మద్దతు

నేడు ప్రగతి భవన్లో ప్రత్యేక భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశంలో భాజపా, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ కూటమిని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు విదేశాల్లో స్థిరపడిన వారినుంచి మద్దతు లభిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలనుంచి సుమారు 40మంది ప్రవాస భారతీయులు బుధవారం హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. వారంతా రాత్రికి శంషాబాద్లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరు కున్నారు. గురువారం ప్రగతి భవన్లో సీఎం కేసీఆర్ను కలిసి మద్దతు తెలుపడంతో పాటు అభినందనలు తెలియజేయనున్నారు. టీఆర్ఎస్ పార్టీని జాతీయ పార్టీగా రూపకల్పన చేసి దేశాన్ని పునరుద్ధరించేందుకు ప్రారంభించిన కసరత్తులో విజయం సాధించాలని ఎన్ఆర్ఐలు ఆకాంక్షిస్తున్నారు. దేశాభివృద్ధికి చేసే కృషిలో తమవంతు భాగస్వామ్యం ఉంటుందని అమెరికా నుంచి వచ్చిన డాక్టర్ మోహన్ తెలిపారు.

హోదాకోసం ఐక్య ఉద్యమం

- గుంటూరు ప్లీనరీలో పార్టీ వ్యూహం ప్రకటిస్తా
- దక్షిణాది రాష్ట్రాలు ఐక్యం కావాలి
- నన్ను వాడుకొని వదిలేశారు
- మీడియాతో ఇష్టాగోష్టిలో పవన్కళ్యాణ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక కేటగిరి హోదా కల్పించకుంటే ప్రజా ఉద్యమం తప్పదని, అది హింసాత్మక సంఘటనలకు దారితీసే ప్రమాదం లేకపోలేదని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. విభజన బిల్లు హామీలు అమలు చేయడం లేదన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, వారి గుండెల్లో గూడు కట్టుకున్న ఆవేశం ప్రజ్వరిల్లితే అది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో కేంద్ర ప్రభుత్వం గ్రహించాలని ఆయన సూచిం చారు. రాష్ట్ర ప్రజలను కేంద్ర ప్రభుత్వం వంచించిందని, రాష్ట్ర హక్కులను సాధించేందుకు ప్రజలతో పాటు రాజకీయ పార్టీలు కూడా ఐక్యంగా కలిసి ఉద్యమించాలని ఆయన పిలుపు నిచ్చా రు. ప్రత్యేక హోదా, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, జనసేన కార్యక్రమాలు తదితర అంశాలపై ఆయన మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన పలు ప్రశ్నలకు పవన్ కళ్యాణ్ సమాధానాలు ఇస్తూ తమ పార్టీ వైఖరిని స్పష్టంచేశారు.

ప్రత్యేక హోదా ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో రాష్ట్రానికి అన్యాయం చేసిందని భావిస్తున్న ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, భవిష్యత్తులో ఇది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో భాజపాకు ఎంపీలు పెద్దగా లేరని, మరో పది దశాబ్దాల్లో కూడా ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాలేదన్న భావనతోనే ఆంధ్రప్రదేశ్పట్ల చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు, కేటాయింపులు రాజకీయాలతో ముడిపడ్డాయని, ఈ కోణంలోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం లేదని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. నాలుగేళ్ళుగా ఎదురు చూస్తున్న ప్రజలకు నిరాశే మిగిలిందని, తమకు జరిగిన అన్యాయాన్ని ఎదురించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని ఆయన చెప్పారు. అయితే ప్రత్యేక హోదా సాధన కోసం ప్రజలతో పాటు రాజకీయ పార్టీలన్నీ కలిసి నడవాలని ఆయన పిలుపునిచ్చారు. హోదా ఉద్యమానికి నాయకత్వం వహిస్తారా అని ప్రశ్నించగా, ఈనెల 14న జరిగే జనసేనపార్టీ ప్లీనరీ సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు ఐక్యం కావలసి ఉందని, హక్కుల సాధన కోసం రాజకీయాలు అతీతంగా ఉద్యమించాలని పవన్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రధాని మోడీ అన్యాయం చేశారని భావిస్తున్నారా అని ఓ విలేకరి ప్రశ్నించగా, మోడీని ఒక వ్యక్తిగా కాకుండా కేంద్ర ప్రభుత్వాన్నే ప్రశ్నించాల్సి ఉందన్నారు. ఏపీకి హోదా ప్రకటించకుంటే ఉత్తర, దక్షిణాదిలో తేడాలు వస్తాయని గతంలోనే తాను ప్రధాని మోడీకి వివరించానని చెప్పారు. 2014 ఎన్నికల్లో మోడీకి మద్దతు ఇచ్చి ఇప్పుడు ఆయన్నే వ్యతిరేకిస్తున్నారు కదా అని ప్రశ్నించగా, దేశంలో ఓ ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు కోసమే ఎన్డిఏకు మద్దతు ఇచ్చానని స్పష్టంచేశారు. అయితే తనను వాడుకుని వదిలేశారని వ్యాఖ్యానిస్తూ భాజపా తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. భాజపా, తెదేపాలు తనను వాడుకుని ఇప్పుడు చిన్న పిల్లవాడిలా చూస్తున్నట్టు ఉన్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎన్నో హామీలు ఇచ్చిన భాజపా ఇప్పుడు రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే ప్రజలు సహించే పరిస్థితిలో లేరని పవన్ కళ్యాణ్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలంటే ఉత్తరాదికి అలుసేనని, అయితే ఈ పరిస్థితిలో హక్కుల సాధన కోసం ఉమ్మడిగా పోరాడాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై సాధించే శక్తి ఒక్క రాష్ట్రానికి ఉంటుందని తాను భావించడం లేదని, ఈ పరిస్థితుల్లో ఉమ్మడిగానే ఎదుర్కోవాలని పవన్ అభిప్రాయపడ్డారు. ప్రత్యేక హోదా సాధించే విషయంలో కూడా రాష్ట్రంలో ఒకే మాటపై నిలిచి కేంద్రంపై ఒత్తిడితెచ్చే స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు.

కేంద్ర ప్రభుత్వం మాట ఇస్తే నిలుపుకునే పరిస్థితిలో లేదని, కేంద్రాన్ని వ్యతిరేకించే వారిపై వేధింపులు ఉంటాయని, తనపై కూడా ఐటి దాడులు చేసేందుకు ప్రయత్నించారని పవన్ కళ్యాణ్ చెప్పారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే, ఇచ్చిన హామీని గుర్తుచేస్తే ఇలాంటి దాడులు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు.

2019లో తన వైఖరేంటో గుంటూరు ప్లీనరీలో ప్రకటిస్తానని స్పష్టంచేశారు. హోదా కోసం తాను ఢిల్లీ వెళ్ళి పోరాడినా ప్రయోజనం లేదని, హోదా ఉద్యమం కోసం జేఏసీ లాంటి సంస్థలు అవసరమని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాలు వివాదాలను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని అన్నారు. మాఫియా లీడర్లు మాట ఇస్తే నిలబడతారని, కానీ రాజకీయ నేతలు నిలబెట్టుకోవడం లేదని పవన్ అన్నారు.

థర్డ్ఫ్రంట్ అంటే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు కోసమని అందరూ అనుకుంటున్నారని, కానీ ప్రాంతీయ పార్టీలు స్వతంత్రంగా వ్యవహరించడానికేనని ఆయన అన్నా రు. ఈ ఫ్రంట్ ఏర్పాటు అవసరం ఎంతో ఉందని, అందుకు వ్యూహం, బాధ్యతలు భవిష్యత్తులో తెలుస్తాయ న్నారు. కేంద్రంతో సయోధ్యగా ఉంటే తప్పు లేనపుడు ఇద్దరు తెలుగు ముఖ్యమంత్రులు సయోధ్యగా ఉంటే తప్పేంటని ఆయన ప్రశ్నించారు.

కేంద్రంతో గొడవలు పడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకంజ వేస్తోందని, కేంద్ర మంత్రులు ఇప్పుడు రాజీనామా చేసినా అంతగా ఫలితం ఉండదని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. తెదేపా, వైకాపాలు కేసులకు భయ పడుతున్నాయన్న అనుమానం వస్తోందని అన్నారు. గుజ్జర్లు, తెలంగాణ ఉద్యమం తరహాలో హోదా కోసం ఉద్యమం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా రాజకీయ పార్టీలు ఉద్యమం నడుపుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకహోదా విషయంలో ససేమిరా అంటున్న తరుణంలో తాను ఢిల్లీకి వెళ్ళిన ప్రయోజనం ఉండదని తన అనాసక్తత వెల్లడించారు. సమస్య పరిష్కారం ఢిల్లీలో ఉన్నపుడు ఉద్యమం కూడా అక్కడే చేయాలేగానీ ఇక్కడ చేస్తే ఫలితం ఉండదన్నారు. ప్రత్యేక హోదా అంశం రాష్ట్రంలో తీవ్రమైన చర్చనీయాంశమైన నేపథ్యంలో దీనిపై ఎలా ముందుకు వెళ్ళాలో 14న జరిగే ప్లీనరీలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

జనసేన ప్లీనరీకి భారీగా ఏర్పాట్లు

గుంటూరు సమీపంలో బహిరంగ సభ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జనసేనపార్టీని పటిష్టపరిచేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ విస్తృతంగా కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. 2019 ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటం, సంస్థాగతంగా బలాన్ని పుంజుకోవాలని చూస్తోన్న పవన్ ఈనెల 14న ప్లీనరీ జరపాలని నిర్ణయించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో ప్లీనరీ సభకు సన్నాహాలు చేస్తున్నారు. ప్లీనరీ ఏర్పాట్లు, అనుసరించాల్సిన వ్యూహం తదితర అంశాలపై పార్టీ నేతలతో పవన్ చర్చలు జరుపుతున్నారు. ఈ సభకు 13 జిల్లాల నుంచి పెద్దఎత్తున జనం తరలివస్తారని అంచనా వేస్తున్నారు. నాలుగు నుంచి ఐదు లక్షల మంది జనాన్ని ప్లీనరీకి సమీకరించాలని భావిస్తున్న జనసేన అందుకు తగ్గట్టుగా సభా ప్రాంగణ ప్రాంతంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 8 మార్చి 2018

మహిళలూ... జిందాబాద్!


మహిళలు అన్ని రంగాల్లో ముందంజ వేస్తున్నారు. మహిళా సాధికారతను సాకారం చేస్తున్నారు. ఇంజనీర్లు,డాక్టర్లు, బ్యాంకులు, కార్పొరేట్‌సంస్థల చైర్మన్లు, కార్యనిర్వహణాధికారిణులుగా రాణిస్తున్నారు. రాజకీయాల్లో కూడా అవకాశం వస్తే తమ ప్రతిభను చాటుకుంటున్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మహిళా శక్తికి నిలువెతు నిదర్శనం. విద్యా,ఉద్యోగ రంగాల్లో తమ ప్రతిభను చాటు కుంటున్న మహిళలు సమానావకాశాలను చేజిక్కించు కుంటున్నారు. అయితే, పట్టణాలు, నగరాల్లో మహిళలకు లభిస్తున్న స్వేచ్ఛ,సమానవాకాశాలు పల్లెల్లోనూ, ఓమాదిరి పట్టణాల్లో లభించడం లేదు.విద్యా రంగంలో వెనకబడటమే ఇందుకు కారణం.మహిళలకు విద్య అవసరం లేదని వాదించే ప్రబుద్ధులూ, మూఢాచారాలు, దురాచారాలను పాటించేవారూ ఇప్పటికీ ఉన్నారు.అన్ని స్థాయిల్లో మహిళలకు సమానావ కాశాలు, సమానమైన ఆదరణ లభించినప్పుడే సాధికారత సంపూర్ణంఅవుతుంది. అన్ని రంగాల్లో మహిళల అభ్యున్నతి సాధిస్తున్న తరుణంలోనే అదే స్థాయిలో వారిపై వేధింపులూ పెరిగాయి. ప్రభుత్వాలు చట్టాలు చేయగలవు. వాటిని అమలు చేయాల్సిన బాధ్యత యంత్రాంగాలదే. యంత్రాంగంలో మహిళల వాణికి ప్రాధాన్యత లభించాలి. మహిళలకు విద్యతో పాటు ఆస్తి హక్కు ఉంటేనే సాధికారత సక్రమంగా అమల వుతుందని మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు త్రికరణ శుద్ధిగా నమ్మారు. తెలుగు నాట మహిళలకు ఆస్తిలో సమాన వాటా లభించేట్టు చేసింది ఆయనే. తొలి మహిళా విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పింది ఆయనే. చట్టంలోని లొసుగులను అడ్డుపెట్టుకుని మహిళలకు రావాల్సిన వాటాకు తూట్లు ప్రయత్నాలు ఇప్పటికీ జరుగుతున్నాయి. మహిళల సంక్షేమం కోసం కొత్త చట్టాలు అవసరంలేదు.ఉన్న చట్టాలను తుచ తప్పకుండా అమలు జేస్తే చాలు. మహిళా సంఘాల డిమాండ్ అదే. ఉద్యోగాల్లో, పబ్లిక్ ప్రదేశాల్లో ఉద్దేశపూర్వకంగా తమను తాకడానికి ప్రయత్నించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటే ఇలాంటి పెడధోరణులు పెరగవు. నిప్పును ఉద్దేశపూర్వకంగా తాకినా, యధాలాపంగా తాకినా కాలుతుంది. మహిళల పట్ల అనుచితంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవడానికి బదులు రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేస్తున్న వారికి మహిళల భద్రత పట్ల చిత్తశుద్ధి లేదనడం అసత్యం కాదు.

మహిళల ఫిర్యాదులను నమోదు చేయడానికి పోలీసు స్టేషన్లలో అధికారులు నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు తరచూ వస్తున్నాయి. ఉద్యోగాలు చేసే మహిళలు విధి నిర్వహణ పూర్తి చేసుకుని ఇళ్ళకు బయలుదేరే సమయంలో వారి పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై నిఘా వేసి పట్టుకోవడానికి తెలంగాణ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన షీ టీమ్స్ బాగా పని చేస్తున్నాయన్న ప్రశంసలు కేంద్రం నుంచి ఎన్నో సార్లు లభించాయి. ఇలాంటి టీమ్స్‌ని అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు కావల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోటీ పరీక్షల్లో, వృత్తి విద్యా కోర్సుల్లో మహిళలు ముందంజ వేస్తున్న విషయం పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ఏటా వెల్లడవుతోంది. మహిళలకు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మంచి అవకాశాలు లభిస్తున్నాయి. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న వాగ్దానాన్ని ప్రధాన రాజకీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ నెరవేర్చలేకపోయాయి. మహిళా సాధికారత కోసం ప్రధాని నరేంద్రమోడీ కూడా అనేక చర్యలు ఇప్పటికే ప్రకటించారు. ఒక్క మహిళల విషయంలోనే కాకుండా దళితులు, అట్టడుగు వర్గాలు, అసహాయ వర్గాల పట్ల సమాజం దృక్పథంలో మార్పు వచ్చినప్పుడే ఆశించిన లక్ష్యాలను ప్రభుత్వాలు సాధిస్తాయి. ప్రజాస్వామిక వ్యవస్థలో జీవిస్తున్నా, ఆ స్ఫూర్తికి జనాభాలో అధిక సంఖ్యాకులు తిలోదకాలు ఇవ్వడం వల్లనే దాడులు ముమ్మరమవుతున్నాయి. వీటి నివారణ కేవలం పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగాల వల్ల సాధ్యం కాదు. మహిళల భద్రత కోసం మహిళా సంఘాలు చురుకైన పాత్ర పోషిస్తున్నాయి. నిరంతర వార్తా స్రవంతులు నిర్వహించే గోష్టులలో మహిళా సంఘాల నేతలు తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్టు వెల్లడిస్తున్నారు.సమాజంలో వెల్లివిరిస్తున్న మహిళా చైతన్యానికి ఇది నిదర్శనం.ఇలాంటి గోష్టులు మహిళల్లో ఆత్మస్థయిర్యాన్ని పెంచుతాయి. తాము సబలమేనన్న మనోధైర్యాన్ని కల్పిస్తాయి. గతంలో కన్నా ఇప్పుడు మహిళా చైతన్యం వెల్లివిరుస్తోంది. తమను తాము రక్షించుకోగల స్థాయికి మహిళలు ఎదిగారు. మహిళలూ జిందాబాద్ అని అనిపించుకుంటున్నారు.

కుంచెల చెలికాడు.. దామెర్ల

ఆయనకు ప్రకృతి ఆరాధన పట్ల మక్కువ ఎక్కువ. గోదావరి ఒడ్డుకు వెళ్ళటం, ఇసుకలో నడుస్తూ, ప్రకృతి అందాలను తిలకించటం, కుంచె అందుకొని అందుబాటులో వున్న వాటిపై ఆ సుందర దృశ్యాలను చిత్రించటం రామారావు నిత్యకృత్యం. ఆయనే ప్రఖ్యాత చిత్రకారుడు దామెర్ల రామారావు. 1897 మార్చి 8న రాజమండ్రిలో జన్మించారు. రామారావును ఐదేళ్ళ వయసులోనే రాజమండ్రి లోని మునిసిపల్ స్కూలులో చేర్పించారు. వ్యాపకం మరోవిధంగా ఉన్నపుడు, మనసు మరో వైపుకు లాగుతున్నపుడు చదువుపై దృష్టి సారించటం, ఏకాగ్రత కనబరచటం సాధ్యంకాదు. పైగా మేనమామ గాడిచర్ల రామ్మూర్తి చిత్రకళాధ్యాపకుడు. ఆయన వద్దనే చిత్రకళలో ఓనమాలు దిద్దటం, మెళకువలు నేర్చుకోవటం, సన్నిహితులు ప్రశంసించటంతో రామారావు దినచర్య చిత్రకళకే పరిమితమైపోయింది.


నేడు జయంతి

కూర్లే స్వతహాగా చిత్రకారుడు. ప్రకృతి ప్రేమికుడు. రామారావు వర్ణాల వెనకదాగిన ఔన్నత్యాన్ని చిత్రాల వెనకదాగిన ఉన్నతభావాలను కూర్లే ప్రశంసించకుండా ఉండలేకపోయారు. పైగా భుజం తట్టి రామారావును ప్రోత్సహించారు. చిత్రకళలో తనకున్న మెళకువలను రామారావుకు బోధించేవారు. పసితనంలో మేనమామ రామ్మూర్తి ఓనమాలు దిద్దించితే (చిత్రకళలో) కళాశాలలో చేరాక స్వయంగా ప్రిన్సిపాల్ ఆ విద్యకు మెరుగులు దిద్దటం ఆశ్చర్యకరమే. రామారావుతోపాటు మరికొందరు ఆ కళాశాలలో ఉండేవారు. 1916 జూన్‌లో రామారావు ముంబై వెళ్ళారు. అక్కడి జెజె స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ స్కూలు ప్రిన్సిపాల్ సిసియల్‌ఎన్ బర్న్స్ రామారావు గీసిన చిత్రాలను చూశారు. ఐదేళ్ళ డిప్లమా కోర్సులో ఆయనను మూడో సంవత్సరం కోర్సు విద్యార్థిగా అడ్మిట్ చేసుకున్నారు. హ్యూమన్ మోడల్స్, స్టిల్ లైఫ్ అనాటమీ లాంటి ప్రాధాన్యత రంగాలపై పట్టు సాధించటంలో రామారావు నిమగ్నమయ్యారు. 1917 అక్టోబర్‌లో కూర్లేతో కలిసి అజంతా, ఎల్లోరాలను సందర్శించారు. ఆ గుహల్లోని కుడ్య చిత్రాలను చిత్రీకరించిన రీతులను ఆకళింపు చేసుకున్నారు. 1919 లో సత్యవాణితో వివాహమైంది. 1922లో రామారావు రాజమండ్రికి వచ్చేశారు. దంపతులిద్దరూ చిత్రకళకే తమ జీవితాలను అంకితం చేశారు. భార్యతో కలిసి తిరుపతి వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో జ్వరం వచ్చింది. రాజమండ్రి చేరేనాటికి మసూచిగా రూపుదాల్చింది. 1925 ఫిబ్రవరి 6న తుదిశ్వాస వదిలారు రామారావు. అప్పటికి ఆయన వయస్సు 28 ఏళ్ళు మాత్రమే.

- దాసరి ఆళ్వారస్వామి




ఉత్సాహం రెట్టింపవ్వాలంటే..

స్త్రీ ఏకాక్షరంగా కనిపించే త్రిశక్తి స్వరూపిణి. సకారం సాత్త్విక గుణాలకీ, తకారం తమోగుణానికీ, రకారం రజోగుణానికి సంకేతాలు. సత్త్వ, రాజ, తమోగుణాల శక్తులు అంతర్లీనంగా ఉంటాయి.

సి.నారాయణరెడ్డి అన్నట్లు మహిళ - సహనానికి ఏలిక, సమరానికి కాళిక! విత్తు ముందా? చెట్టుముందా అంటే ఎలా ఇదీ అని చెప్పలేము, పురుషుడు ముందా స్త్రీ ముందా అంటేనూ చెప్పలేం.

రెండు చేతులూ కలిస్తేనే చప్పట్లు అలాగే స్త్రీ పురుషులిద్దరూ కలిసి మెలసి ఆలోచించి ఆచరిస్తేనే ప్రగతికి మెట్లు. జర్మనీలో కెతెన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకురాలు మరియా మిస్ ఇండియన్ ఉమెన్‌పై మంచి పరిశోధనా గ్రంథాన్ని రాసింది. ఆమె పాలకొల్లు లేసు పరిశ్రమపై సైతం పరిశోధన సాగించారు. ఆమెను ఒకసారి నేను కలిసినప్పుడు మీరే అంశంపై పరిశోధన చేశారని అడిగాను.



భారతీయ గ్రామీణ మహిళల చుట్టుపక్కల తగవులపై ఆర్థిక ప్రభావం అనే అంశంపై పరిశోధన చేశానని ఆమె చెప్పారు. అవును ఆర్థిక ప్రభావంపైనే నూటికి తొంభై అంశాలు ఆధారపడి వున్నాయి. ఆడది చదువుకుని, ఉద్యోగాలు చేయాలా? ఊళ్ళేలాలా? అనే ఈసడింపు ఒక పాత రోతవాక్యం, ఒక అవశేష అపరిపక్వవాక్యం. ఇద్దరూ ఉద్యోగం చేయకపోతే ఎలా? మహిళా సాధికారత లేకపోతే ఎలా అనే వర్తమాన వాక్యానికి ప్రాధాన్యం ఏర్పడింది.

ఝాన్సీలక్ష్మి, రుద్రమ, సరోజినీదేవి, మొల్ల, దుర్గాబాయి దేశ్‌ముఖ్ - ఇలా కొన్నిపేర్లు - వేదకాలంలో అయితే గార్గి, మైత్రి వంటివారు, సంగీత రంగంలో అయితే సుబ్బలక్ష్మి, లతామంగేష్కర్, సుశీల - ఇలా ఇలా కొన్నిపేర్లు ఆనాటివి, ఈనాటివి కొన్ని నేనున్నానని అంటూ పైకి వచ్చినా - స్త్రీ పురుష జనగణాంకాల దృష్టితో చూస్తే స్త్రీలు ఇంకా ఎంతగానో సంఖ్యాపరంగా వివిధ రంగాలపరంగా ముందుకువచ్చి ఉండవలసిందే.

స్త్రీకి భారతదేశంలో పూజ్యభావం ఎక్కువగా ఇచ్చారేగాని సమభావాన్ని అంతగా ప్రసాదించలేకపోయారు. సృష్టికర్త పురుషుడు. చదువులతల్లి, కలుముల తల్లి స్త్రీలే. ఒకవైపున స్వయంవరం స్త్రీ ఆకాంక్షలకు ప్రాధాన్యమివ్వడంలో మార్మోగిపోయినా, మరోవైపు పతివ్రతా వ్యవస్థ యావత్తు పురుషాధిక్య సమాజానికే పట్టం కట్టింది. నోముల వ్యవస్థ పురుష ప్రాధాన్యానికి నిలబడింది. ఇప్పటికీ స్త్రీ సంపాదనపరురాలైనా తన తల్లిదండ్రులకు బట్టలూ గిట్టలూ పెట్టాలంటే మగరాయుడికి లోయల్టీగా ఉండడంలో పరిస్థితి మారలేదు.

మహిళలకి అన్యాయాలు జరిగినప్పుడు గొంతులు విప్పి వివిధ మాధ్యమాల ద్వారా నిరసనలు తెలపడంలో మహిళా సంఘాలు ముందుంటున్నాయి. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాలలో నిత్య కార్యక్రమాలు గల మహిళా సంఘాలున్నాయా అంటే ఆలోచించాలి. ఓల్గా, సంధ్య, మల్లాది సుబ్బమ్మ, కుప్పిలి పద్మ, శ్యామల శిలాలోలిత వంటి ఎందరో మహిళామణులు తమ తమ రంగాల ద్వారా, రచనల ద్వారా మహిళల వరకు వికాసానికి కృషి చేస్తూనే ఉన్నారు. విమలక్క వంటి ప్రజా కళాకారిణులు ఉద్యమాలలో వహించే పాత్ర ఇంతా అంతా కాదు. నీలిమేఘాలు మహిళోద్ధరణ కవిత్వ మార్గంలో ఒక మరపురాని గొప్పకవితా సంపుటి. గోగు శ్యామల వంటి వారి కవితా సంపుటాలు ఎంతగానో ప్రయోజన దాయకాలయ్యాయి. హైదరాబాద్‌లోని అస్మిత వంటి సంస్థలు, భూమిక వంటి పత్రికలు మహిళా సముద్ధరణోన్ముఖంగా రచనల ద్వారా కార్యక్రమాల ద్వారా సముచిత పాత్ర నిర్వహిస్తున్నాయి. సుసేన్ తీరు, కె.లలితా వంటి వారు ఆంగ్లంలో వుమెన్ రైటింగ్ ఇన్ ఇండియా ఫ్రమ్ 600 బిసి యూటీప్రెజెంట్ అనే అపూర్వ గ్రంథాన్ని సంధానపరిచారు. దారులేసిన అక్షరాలు పేరిట తెలుగులోకి ఆ గ్రంథాన్ని అనువదించారు. ఇటువంటి గ్రంథాలు, స్త్రీవాద సంబంధ గ్రంథాలు యువతరం మహిళలు అధ్యయనం చేసి నూతనాలోచనల కాంతిదారుల్లో ప్రయాణిస్తేనే మహిళోన్నతి పలురంగాల అభ్యున్నతి. స్త్రీల ఆలోచనల స్థాయితోపాటు పురుషుల అవగాహన, సహానుభూతుల స్థాయి పెరిగితేనే మహిళా దినోత్సవాల ఉత్సాహాలు రెట్టింపవడం.

- సన్నిధానం శృతకీర్తి, 9292055531

సాధికారతతోనే పురోగతి

మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా స్త్రీలు శారీరక, మానసిక, లైంగిక, ఆర్థిక హింసకు బలవుతున్నారు. మహిళలపై హింసకు సంబంధించి ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదికలో ఎన్నో దిగ్భ్రాంతికరమైన నిజాలు ఉన్నాయి. ఆదిమ సమాజంలో పురుషునితో సమానంగా స్త్రీ స్వేచ్ఛ అనుభవించింది. అడవికి వెళ్ళా పిట్టను కొట్టా పొయ్యిలో పెట్టా అనేంతకాలం స్త్రీ స్వేచ్ఛకు ఆటంకం రాలేదు. సంతానోత్పత్తి కారణంగా స్త్రీ ఇంటికి పరిమితం అయి పురుషుడు బయటకు వెళ్ళి సంపాదన ప్రారంభించటంతో విభజన మొదలైంది. అంతరాల దొంతర లాంటి సమాజంలో పురుష బానిసకు మరో బానిసగా స్త్రీ మారింది. పురుషస్వామ్య సమాజంలో నేటికి తలకిందు భావనలే సవ్యమైనవిగా చెలామణీ కావటం విచిత్రం. మనిషి పుట్టుకకు, యవ్వనంలోనూ, వృద్ధాప్యంలోనూ, నిరంతరం స్త్రీపైనే ఆధారపడి ఉంటాడు. స్త్రీ పరాధీన అనటం పురుషులకు అలవాటైపోయింది.



స్త్రీ హక్కుల గురించి సాధికారత గురించి మాట్లాడగానే అది పురుషులకు వ్యతిరేకం ఏమాత్రం కాదు. అంతర్జాతీయ ఆర్థిక వేదిక వెలువరించిన స్త్రీ పురుష సమానత నివేదిక 2017 లో 144 దేశాల జాబితాలో భారత్ 108 వ స్థానంలో ఉండటం చాలా విషాదం. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయి నుంచి కెప్టెన్ లక్ష్మీ సెహగల్, అరుణా అసఫ లీ, కల్పనాదత్ లాంటి వారి వరకు ఎందరో మహిళలు అసాధారణ ప్రతిభ చూపించారు. క్రమంగా రాజకీయాల్లో మహిళా ప్రాధాన్యం తగ్గుతోంది. 1998 నాటికి 73- 74 రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయత్‌రాజ్ వ్యవస్థలో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పించారు. దీనివలన స్థానికసంస్థల్లో దేశవ్యాప్తంగా 32 లక్షల మంది ఎన్నికైన ప్రతినిధుల్లో 14 మంది మహిళలు ఉన్నారు. పార్లమెంట్‌లోనూ, రాష్ట్రాల శాసనసభల్లోనూ మహిళలకు మూడోవంతు ప్రాతినిధ్యం కల్పించాలన్న బిల్లు నేటికి 22 ఏళ్ళు గడిచినా పార్లమెంట్ ఆమోదం పొందలేదు. పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం మనదేశంలో 12 శాతం, బంగ్లాదేశ్‌లో 20 శాతం, పాకిస్తాన్‌లో 17.5 శాతం ఉంది. స్కాండినేవియన్ దేశాలైన డెన్మార్క్, నార్వే, స్వీడన్‌లో మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ ఎప్పటినుంచో వుంది. 2011లో భారత రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ప్రతిపక్ష నాయకురాలు లాంటి అత్యున్నత పదవులను మహిళలు చేపట్టినా మహిళా రిజర్వేషన్ బిల్లులో కదలిక రాలేదు. మార్చి 9, 2016న మహిళా రిజర్వేషన్ బిల్లు వెంటనే ఆమోదించాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రపంచంలోనే మొదటిసారిగా జాతీయ మహిళా పార్లమెంట్‌ను 2017, ఫిబ్రవరిలో విజయవాడలో నిర్వహించారు. అమరావతి డిక్లరేషన్‌ను 2017, నవంబర్ 17న ప్రకటించారు. విద్య, చట్టపరమైన హక్కులు, ఆరోగ్యం - పోషకాహారం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, రీసెర్చ్-ఇన్నోవేషన్, రాజకీయాలు, సామాజిక భద్రత, సమతుల్య అభివృద్ధి లక్ష్యాలు, సామాజిక అభివృద్ధి డిజిటల్ అక్షరాస్యత లాంటి పది అంశాలపై దృష్టి సారించి మహిళల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అమరావతి డిక్లరేషన్ కార్యాచరణ ప్రణాళిక సూచించింది. బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలు లాంటి సాంఘిక దురాచారాలు రూపుమాపేందుకు కందుకూరి వీరేశలింగం లాంటి వారు చేసిన కార్యాచరణ మనకు ఆదర్శం కావాలి. ఇలాంటి సమస్యలు ప్రస్తుతం మరో రూపం తీసుకుంటున్నాయి. ఆడపిల్లలకు వేధింపులు, వరకట్న సమస్య, గృహహింస పెరిగిపోతున్నాయి. గృహ హింస చట్టం కూడా పురుషస్వామ్య భావజాలానికి అడ్డం వేయలేకపోతోంది. కేంద్ర హోం మంత్రిత్వశాఖ నివేదిక ప్రకారం ప్రతి 44 నిమిషాలకు ఒక కిడ్నాప్, 47 నిమిషాలకు ఒక రేప్, 17 నిమిషాలకు ఒక వరకట్న హత్య చోటుచేసుకుంటోంది. స్త్రీల పట్ల ఘోరమైన నేరాలు జరుగుతుంటే సమాజం చూపిస్తున్న నిర్లిప్తత ఆందోళన కలిగిస్తోంది.

మనకు రాజ్యాంగం ప్రకారం అన్నిహక్కులు ఉన్నాయి. ఆచరణలో మాత్రం వెనుకబడి ఉన్నాం. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నట్లు ఆచరణలోకి రాని చట్టాలు ఎన్నిమాత్రం ఉంటే ఏం? అనేది ఎంతో నిజం. అప్పుడూ, ఇప్పుడూ స్త్రీ జీవించే హక్కుకోసం, స్వేచ్ఛ, భద్రతల కోసం, ప్రైవసీ కోసం, రాజ్యాంగబద్ధ హక్కులకోసం పోరాడుతూనే ఉంది. చట్టం తన పని తాను చేయకపోవడం వల్ల, పోలీసులు శాంతి భద్రతలను మాత్రమే తమ బాధ్యతగా భావించడం మహిళల దుస్థితికి మరో కారణం జనాభాలో సగభాగం ఉన్న మహిళలపై హింస నివారించి, అడ్డుకట్ట వేయాల్సిన అంశంగా పోలీసులు భావించడం వల్ల ప్రభుత్వాలు చేసిన సర్వచట్టాలు బూడిదలో పోసిన పన్నీరుగా పనికి రాకుండా పోతున్నాయి. సతీసహగమనం దూరాచాన్ని వ్యతిరేకిస్తూ నాటి బ్రిటిష్ పాలకులు చట్టం చేశారు సతీ సహగమనం వద్దని ఈ రోజు ఎవరికీ చెప్పాల్సిన పనిలేదు. సంఘ సంస్కార స్థాయి ఆ మేరకు పెరిగింది. వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ కూడా కట్నం సమస్య అలానే ఉంది. స్త్రీ సంక్షేమ చట్టాలు చేయటంతో పాటు, అమలుకోసం గట్టి చర్యలు, ప్రణాళిక అవసరం. మహిళ పురుషుడితో సమానమని, ఎందులోనూ తక్కువ కాదని చిన్నతనం నుంచే ప్రతి మగవానికి తల్లిదండ్రులు చెబుతూ ఉత్తమ సంస్కారాన్ని అందించటం అవసరం. ఆడపిల్లగా పుట్టినందుకే నాకు ఇన్నికష్టాలు అని ఏ ఆడపిల్ల అనుకోకుండా సమాజంలోని సంస్కార స్థాయి పెరిగేందుకు, పితృస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించేందుకు అందరమూ కృషి చేయాలి. మహిళా సాధికారితతోనే సమాజ పురోగతి సాధ్యం అని గుర్తించాలి. అప్పుడే మహాకవి గురజాడ చెప్పినట్లు ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాయగలదు.

-పోతుల సునీత, టీడీపీ ఎమ్మెల్సీ

మహిళలకు స్ఫూర్తి కావాలి

నూటపదిసంవత్సరాలుగా మార్చి 8ని ప్రపంచంలోని అన్ని దేశాలు శ్రామిక మహిళా పోరాట దినంగా పాటిస్తున్నాయి. 1908 మార్చి 8 నాడు న్యూయార్క్‌లోని కుట్టుపని చేసే మహిళా కార్మికులు మహిళలకు ఓటుహక్కు కావాలని, మేము యంత్రాలం కాదు, మాకు విశ్రాంతి కావాలి కనుక పని గంటలు తగ్గించాలి. మా శ్రమకు విలువ ఉంది. కనుక జీతాలు పెంచాలి. పోరాటాలు పురుషుల సొత్తుకాదు, మేమూ పోరాడగలమని డిమాండ్ చేస్తూ పోరాడి విజయం సాధించిన రోజు. ఈ విజయం దేశ దేశాలలోని వేలాదిమంది మహిళల దృష్టిని ఆకర్షించింది. 1910లో కోపెన్‌హెగ్‌లో నిర్వహించిన శ్రామిక మహిళల రెండో అంతర్జాతీయ మహా సభలో మహిళలు తమ ఉనికినీ, అస్థిత్వాన్నీ చాటుకున్న రోజైన మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినంగా పాటించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. తాను ఎంతవరకు చదువుకోవాలీ, ఎలా జీవించాలీ నిర్ణయించుకొనే స్వేచ్ఛ మాత్రం స్త్రీకి లేదు. స్త్రీ నడకపై, నడతపై, నవ్వుపై ఆంక్షలు ఇలా స్త్రీలంటే చిన్నచూపు. వివక్షత, స్త్రీ ఎప్పుడూ మగవాడి కనుసన్నల్లో జీవించాలి. చిన్నప్పుడు తండ్రి, పెళ్ళి తరువాత భర్త ముసలితనంలో కొడుకుల ఆధీనంలో జీవించాల్సి వస్తుంది. ఇలా స్త్రీని బందీని చేయటం ఈ సమాజం మొదటి నేరం. చివరకు మన చరిత్ర ఆవిష్కరించే కృషి అందరూ చేయాలి.

అమలుకు నోచుకోని చట్టాల కారణంగా స్త్రీలపై కుటుంబ హింస, లైంగిక హింస, రాజ్యహింస రోజురోజుకూ పెరుగుతున్నాయి. 1956, 1986లలో రూపొందించిన హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆడ మగ తేడా లేకుండా ఆస్తిలో సమానహక్కు ఇవ్వబడింది. పితృస్వామ్య వ్యవస్థలో ఏ కుటుంబం మహిళలకు ఆస్తిలో వాటా ఇవ్వటం లేదు. 1961 వరకట్న నిషేధ చట్టం చేసినప్పటికీ ఈ దురాచారం గౌరవంగా అమలు చేయబడుతూ పెళ్ళిపేరుతో జరిగే తంతు వ్యాపారంగా మారి మహిళలపట్ల శాపంగా పరిణమించింది. అనేక దేశాలలో పురుషుల కంటే స్త్రీల సంఖ్య ఎక్కువగా ఉంది. కాని భారతదేశంలో ప్రతి వెయ్యిమంది పురుషులకు 927 మంది మాత్రం స్త్రీలు ఉన్నారు. 2011 జనాభా లెక్కల్లో ఈ నిష్పత్తి ఆశాజనకంగా లేదు. చట్టాల అమలులో చిత్తశుద్ధిలేని కారణంగా ఆడపిండాలను గుర్తించి మొగ్గలోనే తుంచివేస్తున్నారు.

స్త్రీ అణచివేతలోని ఆర్థిక అంశాలు చూస్తే సంస్కృతి, నాగరికత ప్రారంభంలో వేట, చేపలు పట్టడం, మొత్తంగా ఆహార సేకరణ వంటి వృత్తులను స్త్రీలు చేపట్టేవారు. వీరే వ్యవసాయాన్ని కనుగొన్నారు. పశువుల పెంపకాన్ని కూడా కనుగొన్నారు. ఇది మానవ జీవన విధానంలో, గొప్ప మార్పును తెచ్చింది. అది సంచార జీవితానికి ముగింపుపలికి స్థిరనివాసానికి దారితీసింది. ఇది చరిత్రలో గొప్ప ముందడుగు. సామాజిక పురోగమనానికి మానవ పునరుత్పత్తి అత్యంత ప్రధానమైంది, అవసరమైందిగా గుర్తించటం వలన ఆనాటి సమాజం స్త్రీలను అత్యంత గౌరవ భావంతో చూసేది. మహిళ ఇంటిపనికి గొప్ప సామాజిక విలువ కూడా ఉండేది. సామాజిక సంపద మొత్తంలో ఇంటిపని అత్యంత ముఖ్యమైన భాగంగా ఉండేది. ఇటువంటి మంచిస్థితిని వ్యక్తిగత ఆస్తి, వర్గ సమాజం పుట్టుకొచ్చాక స్త్రీలకు ఆస్తి హక్కు లేకపోవటం స్త్రీ వంటింటి కుందేలు అయిపోవటం మొదలై అవి నేటివరకు కొనసాగుతూనే ఉన్నాయి. సరిగ్గా వివక్షత ఇక్కడే మొదలైంది. స్త్రీ రెండు రకాలుగా బానిసగా మారిపోయింది. ఇంటి బయట జీతమొచ్చే బానిస. ఇంట్లో జీతంలేని బానిస. స్త్రీలు శ్రమ చేయాలే తప్ప వారికి ఆస్తిని కలిగి ఉండే హక్కు మాత్రం ఉండదు. స్త్రీని విముక్తి చేసి పురుషుణ్ణి ఉన్నతీకరించాలి. పితృస్వామ్యానికి మూలం ఆర్థిక అసమానతలు ఆర్థిక అసమానతలకు మూలం పెట్టుబడిదారీ మార్కెట్ ఉత్పత్తి విధానం. దీనిని మార్చటానికి సమసమాజ నిర్మాణం జరగాలి. సామాజిక ఉత్పత్తిలో శ్రమ విముక్తి జరిగే స్త్రీల భాగస్వామ్యం పెరిగి వారి విముక్తికి దారితీస్తుంది. ఆ దిశగా సామాజిక నిర్మాణం జరగాలి. ఇదే స్త్రీ విముక్తికి, అన్ని సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం.

-లింగంగుంట్ల గజేంద్రమ్మ
ఉపాధ్యాయురాలు
9705493054

వివక్ష తొలగితేనే భద్రత

నాగరికత ఎంత అభివృద్ధి చెందినా మహిళల స్థితిగతుల్లో ఎటువంటి మార్పు రాలేదు. ఆనాడు సతీ సహగమనం దురాచారానికి బలి అయిన మహిళలు ఇప్పుడు సాధికారత సాధించుకున్నా సమాన హక్కులను అనుభవించలేకపోతున్నారు. మహిళా సాధికారత శాఖను కేంద్రంలో, రాష్ట్రాల్లో ఏర్పాటయ్యాయి. కానీ ఏం లాభం మహిళల హక్కులు ఇప్పటికీ కాలరాస్తున్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా మహిళల ఓట్లను దండుకోవడానికి ఆకాశంలో సగభాగమంటూ పార్టీలతో నిమిత్తం లేకుండా అంతా పొగడ్తలతో ముంచెత్తేస్తుంటారు. సమాజంలో లింగ వివక్ష ఇంకా కొనసాగుతోంది. ఆడపిల్ల పుట్టిందంటే తల్లితండ్రులు కూడా భారంగా భావించే రోజులు దాపురించాయి. తల్లి కడుపులో బిడ్డ మగో, ఆడో నిర్ధారణకు పరీక్షలను బహిరంగంగా నిర్వహిస్తున్నారు. వీటిని నిషేధించే చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదు. ఆడ శిశువు పుడుతుందన్న సంకేతాలు రాగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. మహిళల పట్ల సమాజం దృక్పథం మారితేనే వారికి తగిన భద్రత లభిస్తుంది.

ఆడవారి పట్ల పురుషుల దృక్పథంలో మార్పు వస్తే తప్ప ఎన్ని చట్టాలు వచ్చినా, మహిళలకు సమాజంలో సమాన హక్కులూ, స్వేచ్ఛ దక్కవు. విద్యా,ఉద్యోగ రంగాల్లో మహిళలు అందరి కన్నా ముందుటున్నారు. అయినప్పటికీ వారికి భద్రత కొరవడుతోంది. ఆడపిల్లలకు స్వేచ్ఛ కుటుంబం నుంచే రావాలి. కుటుంబ సభ్యులు గౌరవిస్తేనే, ఆడవారిని సమాజం గౌరవిస్తుంది. ఆడపిల్లలు తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించాలి. సామాజిక మాధ్యమాలు, ప్రసార మాధ్యమాల ప్రభావానికి దూరంగా చదువు, నైపుణ్య శిక్షణపై శ్రద్ధ తీసుకుంటూ సామాజికంగా గుర్తింపునూ, గౌరవాన్ని పొందేందుకు నిరంతరం కృషి చేయాలి.

మహిళల పట్ల వివక్షకు వ్యతిరేకంగా ఆనాడు రాజారామమోహన్ రాయ్, పూలే దంపతులు,కందుకూరి వీరేశలింగంపంతులు వంటి సంస్కర్తలు ఎంతో కృషి చేశారని చెప్పుకోవడమే కాదు, వారి ఆశయాలను అమలులో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. మహిళలకు ఉద్యోగాలు చేసే ప్రదేశాల్లోనూ, రైల్వే,బస్ స్టేషన్లు, ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో భద్రత లభించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది. హైదరాబాద్ పోలీసు శాఖ మహిళలపై దాడులు జరగకుండా నివారించేందుకు షీటీమ్స్‌ని ఏర్పాటు చేశారు. అవి బాగా పని చేస్తున్నాయి. దేశంలోనే మహిళల భద్రతకు ఉత్తమ నగరంగా హైదరాబాద్ ఎంపికైనట్టు నగర పోలీసు విభాగం అధిపతి ఇటీవల ఒక కార్యక్రమంలో వెల్లడించారు. అదే మాదిరిగా అన్ని నగరాల్లో, ముఖ్య పట్టణాల్లో ఇలాంటి బృందాలు ఏర్పడి ఆడవారికి సంపూర్ణ భద్రత లభించేట్టు చూడాలి.

ఏటా పదో తరగతి, ఇంటర్ తదితర పబ్లిక్ పరీక్షల్లో బాలుర కన్నా బాలికలే అగ్రస్థానంలో వస్తుండటాన్ని చూస్తున్నాం. మెడిసిన్, ఇంజనీరింగ్ వంటి వృత్తి విద్యా కోర్సుల కోసం జరిగే ప్రవేశపరీక్షల్లో కూడా బాలికలు అగ్రస్థానంలో నిలుస్తున్నారు. తగిన ప్రోత్సాహాన్ని అందిస్తే, బాలికలు బాలుర కన్నా ఇంకా ముందుకు దూసుకుని పోగలరని ఈ ర్యాంకులు తెలియజేస్తున్నాయి. మహిళా పురోగమనాన్ని బట్టే దేశ పురోగమనాన్ని అంచనా వేస్తానని ఆనాడే డాక్టర్ అంబేద్కర్ పేర్కొన్నారు. ఆడ పిల్లల వేధింపులను నిరోధించడానికి అన్ని స్థాయిల్లోనూ పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. సమాజంలో అన్ని వివక్షలకు మూలం అజ్ఞానమేనని రాజారామమోహన్ రాయ్ అన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు ఆయన. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, ఎన్నో ప్రణాళికలు అమలైనా మహిళల స్థితిగతులు మారకపోవడానికి కారణంపాలకుల నిర్లిప్తతే.

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామంటూ ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల ముందు వాగ్దానం చేస్తుంటుంది. అధికారంలోకి రాగానే ఆ విషయాన్ని పక్కన పెడుతుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లు దశాబ్దాలు దాటినా పార్లమెంటు ఆమోదం పొందకపోవడానికి రాజకీయ నాయకుల ద్వంద్వ వైఖరే కారణం.

మహిళల పట్ల వివక్ష నివారణకు భ్రూణ హత్యలను నిలువరించాలి. లింగ నిర్ధారణ పరీక్షల నిషేధాన్ని తుచ తప్పకుండా అమలు జేయాలి. బాలికల్లో అభ్యుదయ భావాలు పెంపొందింపజేయాలి. వారిలో ఆత్మన్యూనతా భావం పెరగకుండా చూడాలి.అన్నింటికన్నా ఆడవారి పట్ల మగవారి దృక్పథంలో మార్పు రావాలి.రక్షణ, వైమానిక, అంతరిక్ష ,శాస్త్ర,విజ్ఞాన పరిశోధనా రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి.టెలివిజన్ చానల్స్ కార్యక్రమాలపై గట్టి పర్యవేక్షణ ఉండాలి. ముఖ్యంగా, మహిళల పట్ల గౌరవాన్ని పెంచే కార్యక్రమాలు తప్ప ఇతర కార్యక్రమాలూ, సీరియల్స్ ప్రసారంకాకుండా చూడాలి.టీవీ సీరియల్స్‌లో మహిళలను విలన్‌లుగా చూపించడాన్ని నిషేధించాలి. స్వాతంత్ర్య సమరంలో ప్రముఖ పాత్ర వహించిన మహిళల గురించిన కార్యక్రమాలను తరచూ ప్రసారం చేయాలి.

మహిళల త్యాగాలనూ, సామాజిక సేవనూ స్తుతించే కార్యక్రమాలను ప్రసారం చేయాలి. పెళ్ళిళ్ళ పేరిట మహిళలు మోసపోకుండా వివాహాల నమోదును తప్పని సరి చేయాలి. ఇందుకోసం ప్రవాస భారతీయ చట్టానికి మరిన్ని కోరలు బిగించాలి. విదేశాల్లో భారతీయ మహిళల స్థితిగతులపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేయించి వారి భద్రతకు చర్యలు తీసుకోవాలి. మహిళల హక్కుల రక్షణ కోసం సామాజిక చైతన్యం వెల్లివిరియాలి. అప్పుడే మహిళలకు భద్రత లభిస్తుంది.

-మేకిరి దామోదర్, 9573666650

సహజ వనరుల్ని దోచేస్తున్నారు

- కేసీఆర్‌పై నిప్పులు చెరిగిన పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సిరిసిల్ల నుంచే టీఆర్ఎస్ పతనం: పొన్నం




సిరిసిల్ల, ప్రభన్యూస్ : మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో ముంచి భవిష్యత్ తరాలను తాకట్టు పెడుతున్నాడని కేసీఆర్ తీరుపై టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల విలువైన సహజ వనరులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజాచైతన్య బస్సు యాత్ర బుధవారం సిరిసిల్లకు చేరుకుంది. సిరిసిల్ల మండలం రగుడు స్టేజీ వద్ద కాంగ్రెస్ శ్రేణులు బస్సు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి పాతబస్టాండ్ అంబేద్కర్ చైరస్తా మీదుగా బైపాస్ రోడ్డు వరకు రోడ్ షో కొనసాగింది. అనంతరం బైపాస్ రోడ్డు వద్ద ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కట్కం మృత్యుంజయం, కేకే మహేందర్‌రెడ్డి, సిటీ కమిటీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి నాయకులు మాట్లాడారు. పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న రాష్ట్రం కేసీఆర్ కుటుంబం పాలైందన్నారు. ప్రజలు సమస్యల్లో మునిగిపోతే కేవలం కేసీఆర్ కుటుంబానికే బంగారు తెలంగాణ తప్ప ప్రజలకు ఒరిగిందిలేదని మండిపడ్డారు. లక్షల కోట్లను దోచుకుంటున్నారని ఆరోపించారు. మిషన్ భగీరథ పేరుతో జరిగిన అక్రమాలను ప్రజలు గమనించాలని అన్నారు. ఆంధ్రా పెట్టుబడిదారులు ప్రయోజనాల కోసం ఆరు శాతం కమీషన్ తీసుకున్నది వాస్తవం కాదా అని సవాలు విసిరారు. చివరకు ఓట్లేసి గెలిపించిన సిరిసిల్ల ప్రజలకు ఏం చేశారని లారీలతో తొక్కిస్తారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే తగిన బుద్ధి చెబుతామని అన్నారు. రైతులకే ఏకకాలంలో 2 లోల రుణమాఫీతో పాటు, గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్య తీసుకుంటామని నిరుద్యోగ యువతకు రూ.3వేల జీవనభృతి , స్వశక్తి సంఘాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా గ్రాంటు అందిస్తామని అన్నారు. టీఆర్ఎస్ కుటుంబ పాలన అంతం చేసేందుకు సిరిసిల్ల నుండే శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు.

కోట్లు కొల్లగొట్టిన కేసీఆర్ కుటుంబం: జీవన్‌రెడ్డి

కేసీఆర్ కుటుంబం రాష్ట్రంలో కోట్లు కొల్లగొడుతుందని సీఎల్పీ శాసనసబ పక్ష నేత జగిత్యాల శాసనసభ్యులు జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో మొదలుపెట్టిన ప్రాజెక్టులను డిజైన్ల పేరుతో మార్పులు చేసి కమీషన్లకోసం కోట్లలో అంచనాలు పెంచేసి ప్రజాధానం కొల్లగొడుతున్న తీరును ప్రజలు గమనించాలన్నారు. రైతాంగాన్ని ఉద్ధరిస్తున్నానని చెప్పుకుంటున్న కేసీఆర్ సబ్సిడీ ట్రాక్టర్ల పేరుతో రూ. 300 కోట్ల ప్రజాధనాన్ని టీఆర్ఎస్ కార్యకర్తలకు ధారపోశారని ఆరోపించారు. అనధికారంగా వేల కోట్ల విలువైన ఇసుకను తరలించుకుపోతున్నారన్నారు. దోపిడీకి చరమగీతం పాడేందుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా స్పందించాలని కోరారు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, శబ్బీర్‌అలీ మాట్లాడుతూ మాటలతో మభ్యపెడుతూ అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ కుటుంబం దేశంలోనే అత్యంత అవినీతికరమైందని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

తప్పుదోవ పట్టించేందుకే థర్డ్ ఫ్రంట్ నాటకం: రేవంత్

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ పేరుతో కొత్త నాటకం ఆడుతున్నారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. సభలో కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పదే పదే రేవంత్‌రెడ్డి మాట్లాడాలంటూ కార్యకర్తలు పట్టుబట్టారు. రేవంత్‌రెడ్డి ఉపన్యాసం ఆద్యాంతం ఆసక్తికరంగా సాగింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పనిచేసిన కేకే మహస్తదర్‌రెడ్డి స్థానంలో పోటీపడిన కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్న తీరుపై వ్యంగ అస్త్రాలు విసిరారు. బతుకమ్మ చీరలతో బతుకులు బాగు చేస్తాడనుకుంటే కమీషన్లకోసం సూరత్ చీరలు తెప్పించి అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. ఇటీవల థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానంటూ మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహార శైలిపై రేవంత్‌రెడ్డి పెగ్గేస్తే వెనుకేదో...మేందేదో తెలియని కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ ఏర్పాటుపై ఓ పాత్రికేయుడు తనకు చెప్పాడంటూ వినిపించిన పిట్ట కథకు సభలో చప్పట్లు మారుమోగాయి.

సిరిసిల్ల నుంచే టీఆర్ఎస్ పథనం: పొన్నం

మాయమాటలతో అధికారంలోకి వచ్చి వనరుల దోపిడీకి పాల్పడుతున్న టీఆర్ఎస్ పార్టీ పతనం సిరిసిల్ల నుంచే మొదలవుతుందని పీసీసీ ఉపాధ్యక్షులు పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షలను గౌరవించి సోనియా గాంధీ తెలంగాణను ఇచ్చారని, తీరా రాష్ట్రం ప్రస్తుతం కేసీఆర్ కుటుంబం పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడిగా దోచుకుంటున్న టీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడుతూ రానున్న ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు.

సభలో 'నేరెళ్ళ' దుమారం...

బహిరంరగ సభలో నేరెళ్ళ ఘటన ప్రధానాంశంగా మారింది. వీ.హెచ్.హన్మంతరావు మొదలుకుని నాయకులంతా నేరెళ్ళ ఘటనలో ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. లెక్కలోకి రాకుండా ఇసుకను తరలించుకుపోతున్న వైనంపై మండిపడ్డారు. బతుకమ్మ చీరలు బాగులేకపోతే తగులబెట్టినమహిళలపై కేసులు పెట్టి, ప్రాణం తీసిన లారీల యజమానులపై కేసులు పెట్టని ప్రభుత్వం తీరుపై వక్తలంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, శాసనసభ్యులు స్థానికల నాయకులు పాల్గొన్నారు. ఈ సభ కాంగ్రెస్ నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది.

'కార్మిక శాఖ పనితీరు మెరుగవ్వాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కార్మిక శాఖ పనితీరును రాష్ట్ర హోంమంత్రి, కార్మిక శాఖా మంత్రి నాయిని నర్సింహారెడ్డి బుధవారం సచివాలయంలో సమీక్షించారు. కార్మికశాఖకు చెందిన బాయిలర్స్, ఫ్యాక్టరీలు తదితర శాఖల అధికారులతో మంత్రి సమావేశమై శాఖకు సంబంధించిన పదోన్నతులు ఇతర అంశాలను తెలుసుకున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కార్మిక శాఖ ప్రథమస్థానం సాధించడంపై ఆయన అధికారులను ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు అధికారులు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. కార్మికుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని, వాటిని కార్మికులకు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల కోసం ప్రమాద మరణ బీమా పథకం వివాహ కానుక, ప్రసూతి సాయం తదితర పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు కార్మికులు సభ్యత్వం ఖచ్చితంగా పొంది ఉండాలని, ఆ దిశగా వారిని చైతన్యపరచాలని ఆయన అధికారులకు సూచించారు. కార్మికులకు సభ్యత్వం కల్పించేలా స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమీక్షలో కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్‌గోయల్, కమిషనర్ ఆఫ్ లేబర్ అహ్మద్ నదీం, ఫ్యాక్టరీల శాఖ డైరెక్టర్ చంద్ర మోహన్, బాయిలర్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళపై అత్యాచారం

ఇచ్చోడ, ప్రభన్యూస్: ఓ ఆదివాసీ యువతి(20)పై కలప స్మగ్లర్ అత్యాచారం చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా, ఇచ్చోడ పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని మాన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గుండివాగు గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ యువతి తన పంట చేలలో పనిచేస్తుండగా కేశవపట్నం గ్రామానికి చెందిన కలప స్మగ్లర్ ఇస్రా ఆదివాసీ యువతిపై అత్యాచారం చేసినట్లు బాధితురాలు మంగళవారం రాత్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వైద్య చికిత్సల కోసం బాధితురాలిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి, పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కేసీఆర్ అంటే కిలాడి: పొంగులేటి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మూడవ ఫ్రంట్ విషయంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు హిడెన్ ఎజండాతో ముందుకు వెళ్తున్నారని కాంగ్రెస్ ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి దక్కాల్సిన నిధులు, అమలు కావాల్సిన విభజన చట్టంలోని అంశాల ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి చేకూరాల్సిన ప్రయోజనాల అమలు గురించి పోరాడకుండా ఓట్ల రాజకీయం కోసం థర్డ్ ఫ్రంట్ అంటూ జాతీయ రాజకీయాలలో హడావిడి చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కిలాడి రాజకీయాలలో ఆరితేరిన వ్యక్తి అని, ఫ్రంట్ పేరుతో చర్చనంతా తన చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు.

మహేందర్ కుటుంబానికి రూ. 25 లక్షలు అందించాలి : వీరయ్య

ఉద్యోగం రాదనే బెంగతో మహేందర్ అనే వికలాంగుడు ఆత్మహత్య చేసుకున్నాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని టిపిసిసి వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ, మహేందర్ ఆత్మహత్య చేసుకుంటే ఒక్క టిఆర్ఎస్ నేత కూడా పరామర్శించకపోవడం దారుణమన్నారు. మహేందర్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.


సంబల్‌పూర్ నుంచి 26 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శంబల్‌పూర్ – బనాస్‌వాడీ మధ్యన 26 ప్రత్యేక రైళ్లు నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ప్రయాణికుల రద్దీ పెరగడంతో విజయవాడ మీదుగా ఈ ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నారు. ప్రత్యేక రైళ్లు శంబల్‌పూర్ నుండి ఏప్రిల్ 4, 11, 18, 25, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీలలో బయలుదేరి విజయవాడ మీదుగా బనస్‌వాడీకి మరుసటి చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో బనాస్‌వాడీ నుండి ఏప్రిల్ 6, 13, 20, 27, మే 4, 11, 18, 25, జూన్ 1, 8, 15, 22, 29 తేదీలలో బయలుదేరి మరుసటి రోజు శంబల్‌పూర్ చేరుకుంటాయి. ఈ ప్రత్యేక వీక్లీ రైళ్లలో ప్రత్యేక ఛార్జీలను వసూలు చేస్తారు. మార్గమధ్యని అన్ని ప్రధానమైన స్టేషన్లల్లో ప్రత్యేక రైళ్లను నిలుపుదల చేయడం జరుగుతుంది.

ప్రజారోగ్య బలోపేతానికి తీసుకున్న చర్యలేమిటి?

- తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం


హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేందుకు తీసుకున్న చర్యలపై సమగ్ర వివరాలను సమర్పించాలని ఏపీ, తెలంగాణ రాష్ట ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. కొన్ని దశాబ్దాల క్రితం ముఖ్యమంత్రులు కూడా వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే వారని హైకోర్టు గుర్తు చేసింది. అయితే నేటి ప్రభుత్వాసుపత్రులు ఆ పాత్రను నిర్వహించేందుకు తగవని, వాటిలో నానాటికీ మౌలిక సదుపాయాల స్థాయి దిగజారిపోతోందని హైకోర్టు అభిప్రాయపడింది. హైదరాబాద్ బీబీనగర్ లో రూ.125 కోట్ల ప్రజాధనంతో ఏడేళ్ల క్రితం నిర్మించిన నిజామ్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రి ఇంకా ఎందుకు పనిచేయడం లేదో చెప్పాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.అమర్‌నాథ్ గౌడ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని జర్నలిస్టు కె.నరేందర్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ...ప్రైవేటు కార్పొరేట్ దవాఖానాల్లో ఆరోగ్యశ్రీ పథకంలో అనేక అక్రమాలు, అవినీతి చోటు చేసుకుంటున్నట్లు తెలిపారు. బీబీనగర్‌లో రూ. 125 కోట్ల వ్యయంతో



నిమ్స్ ఆసుపత్రి భవనాన్ని ఏడేళ్ల క్రితం నిర్మించినప్పటికీ, నేటికీ పనిచేసే పరిస్థితిని కల్పించడం లేదన్నారు. ఈ దశలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్ స్పందిస్తూ.. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ..నిమ్స్ వ్యవహారంతో పాటు ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. అలాగే ఏపీ లో ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణ మార్చి21 కి వాయిదా వేసింది.

బీసీలకు మోడీ చేసిందేమీలేదు

- మంత్రి జోగు రామన్న




హైదరాబాద్, ఆంధ్రప్రభ: బిసిలకు గత నాలుగేళ్ళలో ప్రధాని మోడీ చేసిందేమీలేదని, రాష్ట్ర బడ్జెట్ స్థాయిలో కూడా దేశమంతా కలిపి బిసిలకు కేటాయింపులు లేవని రాష్ట్ర అటవీ శాఖా మంత్రి జోగురామన్న మండిపడ్డారు. బుధవారం టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 71ఏళ్ళు దేశాన్ని ఏలిన కాంగ్రెస్, బిజెపిలు అన్నింటా వైఫల్యం చెందాయన్నారు. దేశం దశదిశ మార్చేందుకే ముఖ్యమంత్రి కెసిఆర్ మూడోఫ్రంట్ ప్రకటన చేశారని, ఈ ఫ్రంట్ ప్రకటనతో బిజెపి, కాంగ్రెస్ పార్టీలలో వణుకు ప్రారంభమైందన్నారు. కొత్త రాజ కీయం కోసం దేశాన్ని అభివృద్ధిపథంలో నిలిపేందుకే కెసిఆర్ ఫ్రంట్ ప్రతిపాదన తెచ్చారన్నారు. కులవృత్తులను సిఎం కెసిఆర్ కాపాడుతుంటే ప్రధానిమోడీ, వాటికి ఊతమిచ్చే ఒక్క చర్యను కూడా ప్రకటించలేదన్నారు. రిజర్వేషన్ల పెంపుపై కేంద్రం నిర్ణయం తీసుకోకుండా తెలంగాణకు మోడీ అన్యాయం చేస్తున్నారన్నారు.

జాతీయస్థాయిలో ఓబిసి మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని కెసిఆర్ కేంద్రమంత్రిగా ఉన్నపుడు ప్రతిపాదిస్తే.. ఇప్పటివరకు దానిని జాతీయ పార్టీలు పట్టించుకోలేదన్నారు. రిజర్వేషన్లపెంపుపై ఢిల్లీలో తమ పార్టీలు చేస్తున్న ఆందోళనను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం 24 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెడితే బిసిలకు కేటాయించింది కేవలం 932కోట్లు మాత్రమేనని, ఒక్క తెలంగాణ ప్రభుత్వమే బిసిల సంక్షేమానికి రూ.5వేల కోట్లకు పైగా కేటాయించిందన్నారు. ఎంబిసిలకు కూడా కార్పోరేషన్ కేటాయించి నిధులు కేటాయించిన ఘనత సిఎందేనన్నారు. కెసిఆర్ ఫ్రంట్‌కు అన్నివర్గాల నుండీ విశేష స్పందన వ్యక్తమవుతోందన్నారు. టిఆర్ఎస్ ప్లీనరీ వేదికగా జాతీయ నాయకుల సమక్షంలో కొత్తఫ్రంట్ ప్రకటన వస్తుం దనే వార్త తెలంగాణకు గర్వకారణమన్నారు.

ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించి తెలంగాణను సాధించిన ఘనత కెసిఆర్ దేనన్నారు. బిసిల సంక్షేమాన్ని కాంగ్రెస్, బిజెపి విస్మరించాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం బిసిల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సమావేశంలో ఎంబిసి కార్పోరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పైనుంచి కిందపడ్డ బస్సు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పెను ముప్పు తప్పింది. మూసాపేట ఫ్లైఓవర్ వద్ద బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. మాదాపూర్‌లోని ఐటీ కంపెనీ సెయింట్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను తీసుకువెళుతున్న సోని ట్రావెల్స్‌కు చెందిన బస్సు (ఏపీ 28 టీప 7676), అమీర్‌పేట నుంచి చింతలవైపు వెళ్తూ, రెయిలింగ్‌ను, డివైడర్‌ను ఢీకొట్టి ఫ్లైఓవర్ పైనుంచి కిందపడింది. ఆ సమయంలో బస్సులో 40 మంది ఉద్యోగులు ఉండగా, బస్సు సుమారు 7 అడుగులపై నుంచి కిందపడింది. ఫ్లైఓవర్ మొదట్లోనే ప్రమాదం జరగడంతో ఉద్యోగులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ నిద్రమత్తుకు తోడు, రాంగ్‌రూట్‌లో వేగంగా రావడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలిం చామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


మంత్రుల నివేదికను అమలు చేయాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల సమస్యలపై మంత్రులకమిటీ రూపొందించిన నివేదికను అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కమిటీ నివేదికలో పలు అంశాలు ఉన్నాయని, వాటిలో ఎక్కువ శాతం ప్రభుత్వానికి ఆర్థికభారం లేనివి ఉన్నాయని వాటిని అమలు చేసేలా సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవాలని సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంఘం కోర్ గ్రూప్ సమావేశం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం బీసీ భవన్‌లో జరిగింది. ఈసమావేశంలో నీల వెంకటేష్, సి రాజేందర్, భూపేష్‌సాగర్, పి సతీష్, జి కృష్ణతదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

- వారికి సరైన వాటా అందడం లేదు: జూలూరి



జగ్గయ్యపేటలో తెలంగాణా రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ నాయకులు

జగ్గయ్యపేట టౌన్, ప్రభన్యూస్ : దేశజనాభాలో సగభాగం ఉన్న బీసీలకు అందాల్సిన వాటా అందడంలేదని తెలంగాణా రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్ అన్నారు. బుధవారం కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒక సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 34శాతం బీసీలుండగా, తెలంగాణాలో 56శాతం బీసీలున్నారని తెలిపారు. బీసీలకు అనుబంధ కులాలుగా ఉన్న 24 సంచార జాతులవారిని ఇంతవరకూ గుర్తించలేదని, తెలంగాణాలో ఈ సంచార జాతుల వారిని బీసీ కులాలలో చేర్చడానికి అధ్యయనం మొదలుపెట్టినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీలకు మంచిరోజులు రానున్నాయని, బీసీల జనాభా ప్రకారం దామాషా పద్దతిలో విద్య, ఉద్యోగ విషయాలలో రిజర్వేషన్లు కావాలని కమిషన్ దృష్టికి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

ప్రజా ప్రతినిధులపై కేసులు పెట్టండి

- చెరుకుపల్లి పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తామిచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా కోడిపందేలు నిర్వహించడం, ప్రోత్సహించారని, గుంటూరు జిల్లాకు చెందిన నలుగురు ప్రజా ప్రతినిధులపై వచ్చిన ఫిర్యాదును పరిశీలించి, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, దర్యాప్తు జరపాలని హైకోర్టు చెరుకుపల్లి పోలీసులను ఆదేశించింది. దర్యాప్తు చేసిన తరువాత తుది నివేదికను సంబంధిత కోర్టుకు సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేసినంత మాత్రాన వారు నేరం చేసినట్లు భావించరాదని హైకోర్టు అభిప్రాయపడింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మి తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించడం, ప్రోత్సహించారని పేర్కొంటూ రేపల్లె ఎమ్మెల్యే ఎ.సత్యప్రసాద్, ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్, మాజీ శాసనసభ్యులు దేవినేని మల్లికార్జునరావు, ముమ్మనేని వెంకటసుబ్బయ్యలపై చెరుకుపల్లి పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదంటూ న్యాయవాది భాను ప్రకాష్ హైకోర్టును ఆశ్రయించారు.

ఐపీఎస్ బదలీలపై ఉత్కంఠ

- తుది జాబితా సిద్ధం..సీఎం ఆమోదమే తరువాయి?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఐపీఎస్ బదిలీల్లో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. తుది జాబితా సిద్ధమైందని చెబుతున్నా చివరి నిమిషంలో పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు ఉండవచ్చని తెలుస్తోంది. అయితే స్వల్ప సంఖ్యలోనే బదిలీలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పోలీసు శాఖలో సంస్కరణల అమలులో ముందు వరసలో నిలిచిన డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రస్తుతం ఐపీఎస్‌ల బదిలీలలోసైతం తనదైన మార్క్‌ని కనబర్చబో తున్నారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన పరిణామాలను పరిగణనలోనికి తీసుకుని ఈ బదిలీలు ఉండవచ్చని తెలుస్తోంది. హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సహా ఇతర కీలక స్థానాల్లో ఈ బదిలీలు ఉండవచ్చని సమాచారం. గత నవంబర్ నుంచి నగర కమిషనర్‌గా ఇంఛార్జి బాధ్యతలను అదనపు కమిషనర్ శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు. ఈ స్థానంలో అంజనీకుమార్ పేరు దాదాపుగా ఖరారైందని సమాచారం. సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా స్వాతిలక్రా పేరు కన్‌ఫర్మ్ అయినట్లు తెలుస్తోంది. జిల్లాల ఎస్పీలను పూర్తిస్థాయిలో మార్చనున్నట్లు సమాచారం. వరంగల్ కమిషనర్ సుధీర్‌బాబును హైదరాబాద్ రేంజ్ డీఐజీగా బదిలీ చేస్తారని, ఆ స్థానంలో ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌ను రవీందర్‌ను నియమించనున్నట్లు సమాచారం. రీజనల్ ఐజీలు నాగిరెడ్డి, స్టీఫెన్ రవీంద్రలను కీలక విభాగాలకు బదిలీ చేయనున్నట్లు సమాచారం. హైదరాబాద్ శాంతి భద్రతల అదనపు సీపీగా మల్లారెడ్డిని, హౌసింగ్ ఎండీగా అడిషినల్ డీజీపీ సంతోష్ మెహ్రాను, ఐజీలు చౌహాన్‌ను వరంగల్ కమిషనర్‌గానూ, అనిల్ కుమార్‌ను నార్త్‌జోన్ ఐజీగా నియమించనున్నట్లు తెలుస్తోంది. శాంతిభద్రతల అదనపు డీజీపీ పోస్టులో ఐజీ ర్యాంకు అధికారిని నియమించే అవకాశం ఉంది. మొత్తం 41 మందితో తుది జాబితా రూపొందిందని చెబుతున్నారు. ఆ జాబితాపై సీఎం ఆమోద ముద్ర పడాల్సి ఉంది.

మగవాళ్లతో సమానంగా రాణించగలం: నేరెళ్ల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అవకాశాలు వస్తే మగవాళ్లతో సమానంగా మహిళలు రాణిస్తారని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద చెప్పారు. మహిళలు సమర్థవంతులని, నిజాయితీగా ఉంటారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఆమె ఆంధ్రప్రభతో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా మహిళాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. మహిళల పట్ల అఘాయిత్యాలు, దారుణాలు, లైంగిక దాడులు జరుగుతున్నప్పటికీ వాటిని నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే మహిళా సాధికారత అనేది వీలైనంత త్వరలో సాధించగలమన్నారు.

మహిళలతోనే దేశాభివృద్ధి

భవిష్య భారతి బ్యాంకు చైర్మన్

మహిళలు సాధికారత సాధిస్తేనే దేశం అభివృద్ధి పథంలో సాగుతుందని భవిష్య భారతి బ్యాంకు చైర్మన్ పెద్ది సంతోషి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 60 ఏళ్ల తర్వాత కూడా గ్రామాలలో మహిళలపై వివక్ష కొనసాగుతోందని, ఈ విషయంలో ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. నగరాలు, పట్టణాల్లో పరిస్థితి మారిందని, పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాలలో దూసుకుపోతున్నారన్నారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో...

అక్కడే దేవతల నివాసం

- గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు మమత




హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ మహిళా దినోత్సవం వేడుకలు తెలంగాణ గెజిటెడ్ భవన్, నాంపల్లిలో గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షురాలు వి. మమత ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. వివిధ డిపార్ట్‌మెంట్‌ల నుంచి వచ్చిన మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ మహిళలు గౌరవప్రదంగా జీవించడానికి తెలంగాణ ప్రభుత్వం షీటీమ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారని పురాణాల్లో, చరిత్రలో ఈ విషయం లిఖించబడిందన్నారు. మహిళలు వంటింటి పాత్రకే పరిమితం కాకుండా ధైర్యంగా సమన్వయంతో సమష్టిగా ఉండి సమాజ సేవ చేయడానికి ముందుకు రావాలని ఆమె కోరారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో మహిళల పాత్ర ఎంతో కీలకమయ్యిందన్నారు. తెలంగాణలో రాజకీయ పరంగా మహిళలు ఇంకా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఈకార్యక్రమంలో పలువురు మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

కాలం చెల్లిన కట్టుబాట్లతో బాలికలకు ఇబ్బందులు

- అవగాహన కల్పించేందుకు టీమ్ నిర్బంధం ముందుకు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహిళలు అన్ని రంగాల్లో ప్రగతిపథంలో దూసుకుపోతున్నా ఇప్పటికీ కాలంచెల్లిన కట్టుబాట్లతో బాలికలు (బుతుస్రావం)పై విషయమై భయపడుతున్నారని టీమ్ నిర్బంధ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రకృతి సహజంగా సంభవించే జీవసంబంధితమైన అంశం (బహిష్టు) పట్ల బాలికలకు అవగాహన కల్పించేందుకు టీమ్ నిర్బంధం ముందుకు వచ్చింది. మార్చి8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా బహిష్టు పట్ల అవగాహన కల్పిస్తూనే దాని పట్ల ఉన్న అపోహలను పోగొట్టేందుకు ప్రయత్నిస్తోంది. మారు మూల ప్రాంతాల్లోని బాలికలకు సైతం చేరువయ్యేందుకు టీమ్ నిర్బంధం స్ఫూర్తిదాయకమైన గీతంతో ముందుకువచ్చింది.

సామాజిక ఉద్యమకారిణి గేయ రచయిత ఎంఎస్ గౌరీ వం దన హృద్యంగా ఈ గీతాన్ని రచించగా సుబ్రమణ్యం ఎడగొట్టి నిర్మించిన ఈ పాటకు సీజె భరత్ సంగీతం అందించారు. మ్యూజిక్ మిక్సింగ్‌ను ఘంటసాల విశ్వనాథ్ చేయగా క్రియేటివ్ హెడ్‌షాట్ ఫోటోగ్రఫీ వజ్రనాభ్ నటరాజ్ మహర్షి (ముంబై) చేశారు. హరిప్రియ ఈ పాటను హృద్యంగా ఆలపించారు.

థియేటర్ల బంద్ విరమణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వర్చువల్ ప్రింట్ ఫీ(వీపీఎఫ్) ఛార్జీలు, కట్ ఆఫ్ టైమ్ తగ్గింపు విషయంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు (డీఎస్‌పీ) దక్షిణాది సినీ నిర్మాతలకు మధ్య నెలకొన్న ప్రతిష్టంభన ఎట్టకేలకు తొలగింది. ఇరువర్గాల మధ్య బుధవారం జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఛార్జీల విషయంలో సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఎస్ఐఎఫ్‌సీసీ) ఐక్య కార్యాచరణ సమితి (జాక్)-డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది. డిజిటల్ ప్రొజక్షన్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన వీపీఎఫ్‌ను తగ్గించేందుకు డీఎస్‌పీలు అంగీకరించాయి. ఫలితంగా నిర్మాతల జాక్, ప్రదర్శనకారులు సమ్మెను విరమించుకునేందుకు నిర్ణయించుకున్నారు. రేపటి నుంచి సినిమాలు యథావిధిగా ప్రదర్శితమవుతాయి.

కాగా, ఏప్రిల్ 6 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నట్లు సమాచారం. డిజిటల్ ప్రొవైడర్స్ వసూలు చేస్తున్న ఛార్జీలకు నిరసనగా ఐదు రాష్ట్రాల్లోని చిత్ర పరిశ్రమ ఐక్య కార్యాచరణ సమితి మార్చి 2 నుండి థియేటర్స్ బంద్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో వారం రోజుల నుండి తెలుగు రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళలలో థియేటర్స్ మూతపడ్డాయి. వారం రోజుల బంద్ ప్రభావం వల్ల తెలుగు రాష్ట్రాల్లో సుమారు 1700 థియేటర్స్ మూతపడిన సంగతి విదితమే. సినిమాలు లేక దిగాలుగా ఉన్న సినీ లవర్స్‌కి ఊరటనిచ్చేలా.. ఈ విషయం బయటకు రావటంతో కాస్త ఆనందపడుతున్నారు.

మ్యూచ్‌వల్ కాలర్ యాప్‌తో స్త్రీలకు భద్రత

- ఎంటైర్ యాప్ వ్యవస్థాపకుడు సాంబశివరావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మ్యూచ్‌వల్ కాలర్‌తో మహిళలకు మరింత భరోసా కలుగుతుందని ఎంటైర్ యాప్ వ్యవస్థాపకులు ఎం.సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం బేగంపేటలో గ్రీన్‌పార్క్ హోటల్‌లో మ్యూచ్‌వల్ కాలర్ మొబైల్ యాప్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌ను ఇండియాతో పాటు అమెరికాలో కూడా ఆవిష్కరించామన్నారు. 3 రోజులు క్రితం అమెరికాలో ఈ యాప్‌ను ఆవిష్కరించామన్నారు. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోని లాగిన్ కావాలన్నారు. దీంతో ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్లు అన్నీ అందులో నిక్షిప్తం అవుతాయన్నారు. ఇలా ఎవరైతే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటారో వారికి ఎలాంటి ఫోన్ వచ్చినా అది ఎక్కడి నుంచి వస్తుందో, ఎవరి పేరుతో ఉందో అన్ని తెలిసిపోతాయన్నారు. ఒకవేళ మన ఫోన్ మరిచిపోయి బయటకు వెళ్లినప్పుడు మన స్నేహితుల ఫోన్‌లో ఈ యాప్ ఉంటే మన యూజర్ నేమ్, పాస్‌వర్డ్ కొడితే మన కాంటాక్ట్లు అన్నీ వస్తాయన్నారు. ఈ యాప్ మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మనకు వచ్చే చాలా ఫోన్ కాల్స్ ఎక్కడినుంచి వస్తున్నాయో వారితో మాట్లాడితే కానీ అర్థం కాదన్నారు. ఆ కాల్‌ను లిఫ్ట్ చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉంటామని, ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారికి అలాంటి పరిస్థితి ఎదురుకాదని ఫోన్ రాగానే ఎవరు ఫోన్ చేశారో వారి పేరుతో సహా తెలిసిపోతుందన్నారు. గతంలో వచ్చిన ట్రూకాలర్ దీనికి చాలా తేడా ఉందన్నారు. ఇది ప్రస్తుతం అండ్రాయిడ్ వెర్షన్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్ర మంలో అభిషేక్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

Andhraprabha business 2018

బిజినెస్

BUSINESS

విమానయానానికి మంచి రోజులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలో విమాన యాన రంగానికి ఇటీవలి కాలంలో ఆదరణ పెరుగుతుంది. వ్యాపార పరంగా విమానయాన వినియోగం కూడా పెరిగింది. ఈ విధంగా విమానయానం ఉత్పాదక యంత్రంగా మారింది. ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుం ది. రాబోవు కాలంలో విమానయానంమరింతగా వృద్ధి చెందడా నికి అవకాశం ఉంది. భారత ఆర్థిక, సామాజిక ప్రగతిలో విమానయానం భాగమవుతుంది అని బిజినెస్ ఎయిర్ క్రాఫ్ట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రోహిత్ కపూర్ అన్నారు. బిజావ్ ఇండియా సమావేశాలు బుధవారం నగరంలో ప్రారంభమయ్యాయి. వ్యాపార, సాధారణ విమానయాన పారిశ్రామికవేత్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విమానయానం ద్వారా భారత ప్రభుత్వం పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచే సంకల్పంతో ఉందని సమావేశాన్ని ప్రారంభించిన పౌర విమానయాన శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పాధే వివరించారు. విమానాలతో పాటుగా హెలికాప్టర్లను విరివిగా వినియోగంలోకి వస్తున్నాయని తెలియజేశారు. పౌర విమానయాన రంగం వృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుందని, వ్యాపార, వాణిజ్య వర్గాలు, పర్యాటకులు విమానయానాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.



ఇక్కడ ముఖేష్.. అక్కడ బేజోస్

● 2018 ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా విడుదల ● రిలయన్స్ అధినేత భారత కుబేరుడు ● 4వేల కోట్ల డాలర్ల సంపదతో ప్రథమ స్థానం





న్యూయార్కు: భారత్‌లో ఏడాదికేడాది బిలియనీర్ల సంఖ్య పెరిగిపోతోంది. ప్రస్తుతం 121 మంది బిలియనీర్లు ఉన్నారు. గతేడాదితో పోల్చుకుంటే 19 మంది పెరిగారు. ప్రపంచంలో అతి ఎక్కువ మంది బిలియనీర్ల దేశంగా భారత మూడో స్థానాన్ని దక్కించుకుంది. అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉందని బిజినెస్ మేగజైన్ ఫోర్బ్స్ వార్షిక బిలియనీర్ల జాబితాలోపేర్కొంది. భారతకు చెందిన పెట్రోరసాయనాల వ్యాపారం చేసే ముఖేష్ అంబానీ దేశంలోనే అత్యంతసంపన్నుడుగా నిలిచారు. ఆయన సంపద ఈ ఏడాది ఏకంగా 16.9 బిలియన్ డాలర్లు పెరిగి 40.1 బిలియన్ డాలర్లకు చేరిందని ఫోర్బ్స్ మేగజైన్ మంగళవారం నాడు విడుదల చేసిన ఆన్‌లైన్ జాబితాలో పేర్కొంది. ప్రపంచ స్థాయిలో మొత్తం 2,208 మంది బిలియనీర్లు రంటే ముఖేష్ అంబానీ ర్యాంకు 19కి చేరింది. గత 2017లో ఆయన 33 వ ర్యాంకులో ఉన్నారు. ఆయన సంపద 23.2 బిలియన్ డాలర్లు. ఈ ఏడాది బిలియనీర్ల విషయానికి వస్తే అమెరికాలో అత్యధికంగా 585 బిలియనీర్లు ఉంటేచైనాలో 373 మంది బిలియనీర్లు తేలారు. వీరిని దిత్రి కామా క్లబ్ ము ద్దుగా పిలుస్తారు. 2017లోభారత్ లో 102 మంది బిలియనీర్లు న్నారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు. ఆయన మొత్తం సంపద 112 బిలియన్ డాలర్లు. మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను మించిపోయారు ఆయన సంపద 90 బిలియన్ డాలర్లు మూడో స్థానంలో వారెన్ బఫెట్ ఆయన సంపద 84 బిలియన్ డాలర్లుగా తేలింది. ఇక బెజోస్ విషయానికి వస్తే ఆయనకు వాషింగ్టన్ పోస్ట్ అనే వార్తాపత్రిక ఉంది. అదీ కాకుండా 100 బిలియన్ డాలర్ల మార్కును దాటిని మొదటి వ్యక్తి కూడా బెజోస్. ఆయన సంపద ఏడాది కాలంలో 39.2 బిలియన్ డాలర్లు పెరిగింది. ఏడాది కాలంలో ఇంత పెద్దమొత్తంలో సంపద పెరగడం ఇదే మొదటిసారి. బిల్‌గేట్స్ విషయానికి వస్తే ప్రపంచంలోనే అతి పెద్ద చారిటి సంస్థ బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్‌ను నిర్వహిస్తున్నారు. తన సంపదలో పెద్దమొత్తంలో దానధర్మాలకు వినియోగిస్తున్నారు. కాగా భారత విషయానికి వస్తే విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీ ఈ ఏడాది రెండవ స్థానానికి ఎగబాకారు. అంతర్జాతీయ ఉక్కు దిగ్గజం లక్ష్మీమిట్టల్‌ను వెనక్కినెట్టారు. గ్లోబల్ ర్యాంకు విషయానికి వస్తే ప్రేమ్‌జీ 2017లో 72వ ర్యాంకు నుంచి ఈ ఏడాది 58వ ర్యాంకుకు చేరారు. 18.8బిలియన్ డాలర్లకు ఎగబాకారు. లక్ష్మీ మిట్టల్ విషయానికి వస్తే ఆయన ఈ ఏడాది అగ్రిపెరిగా... ఈ ఏడాది ర్యాంకులో వెనుకపడ్డారు. 2018లో 62 ర్యాంకుకు దిగివచ్చారు. ఆయన సంపద 18.5 బిలియన్ డాలర్లు ఉంది. భారత్‌లో ఆయన ర్యాంకు మూడవ స్థానం. కాగా గత ఏడాది మిట్టల్ 16.4 బిలియన్ డాలర్లతో 56వ ర్యాంకులో ఉన్నారు.

భారతీయ టాప్ బిలియనీర్లు


19 ముఖేష్ అంబానీ (401 బిలియన్ డాలర్లు - పెట్రో కెమికల్స్)
58 అజీమ్ ప్రేమ్‌జీ (18.8 బిలియన్ డాలర్లు - సాఫ్ట్‌వేర్ సర్వీసెస్)
62 లక్ష్మీమిట్టల్ (18.5 బిలియన్ డాలర్లు - ఉక్కు)
98 శివనాడార్ (14.6 బిలియన్ డాలర్లు - సాఫ్ట్‌వేర్ సర్వీసెస్)
115 దిలీప్ సాంఘ్వీ (12.8 బిలియన్ డాలర్లు - ఫార్మాస్యూటికల్స్)
127 కుమార్‌బిర్లా (11.8 బిలియన్ డాలర్లు - కమాడిటీస్)
143 ఉదయ్ కొటక్ (10.7 బిలియన్ డాలర్లు - బ్యాంకింగ్)
151 రాధాకృష్ణ దమానీ (10 బిలియన్ డాలర్లు - ఇన్వెస్ట్‌మెంట్, రిటైల్)
154. గౌతమ్ అదానీ (9.7 బిలియన్ డాలర్లు - కమాడిటీ, పోర్ట్స్)
170 సైరస్ పూనావాలా (9.1 బిలియన్ డాలర్లు - వ్యాక్సిన్)
176 సావిత్రి జిందాల్ (8.8 బిలియన్ డాలర్లు - స్టీల్)
176 సునీల్ మిట్టల్ (8.8 బిలియన్ డాలర్లు - టెలికం)

మహిళా బిలియనీర్లలో



భారతీయ మహిళా బిలియనీర్లలో సావిత్రి జిందాల్ నిలిచారు. జిందాల్ స్టీల్ అండ్ పవర్ కంపెనీ చెందిన సావిత్రి గ్లోబల్ ర్యాంకు 176 కాగా ఆమె సంపద 8.8 బిలియన్ డాలర్లుగా నిలిచింది. ఆమె తర్వాతి స్థానం బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందార్ షా గ్లోబల్ ర్యాంకు 629 ఆమె సంపద 3.6 బిలియన్ డాలర్లుగా రికార్డు అయ్యింది. అయితే 39 సంవత్సరాల ఫైనాన్షియల్ టెక్నాలజీ వ్యాపారి విజయ్ శేఖర్ శర్మ అత్యంత యువ బిలియనీర్ నిలిచారు. ఆయన గ్లోబల్ ర్యాంకు 1394 కాగా ఆయన సంపద 1.7 బిలియన్ డాలర్లుగా నిలిచింది. సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు శివనాడార్ భారత సంపన్నుల్లో నాలుగో స్థానంలో నిలిచారు. ఆయన సంపద 14.6 బిలియన్ డాలర్లు గ్లోబల్ ర్యాంకు 98. సన్ ఫార్మా వ్యవస్థాపకుడు దిలీప్ సాంఘ్వీ ఐదవ స్థానంతో 12.8 బిలియన్ డాలర్ల సంపదతో గ్లోబల్ ర్యాంకు 115. కాగా భారతీయ ఫార్మారంగం నుంచి మొత్తం 16 మంది బిలియనీర్లున్నారు. అటు తర్వాత కన్జ్యూమర్ గూడ్స్ రంగం నుంచి 15 మంది రియల్ ఎస్టేట్ నుంచి 9 మంది, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్‌తో పాటు ఇన్వెస్ట్‌మెంట్ రంగాల్లో చెరో ఎనిమిది మంది

జాబితా నుంచి నీరవ్ ఔట్



వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రెండు బిలియన్ డాలర్ల వరకు మోసం చేసిన విషయం తెలిసిందే. ఆయన గత ఏడాదితో పాటు ఈ ఏడాది బిలియనీర్ల జాబితాలో లేరు. అయితే ప్రత్యేకంగా భారతీయ బిలియనీర్ల జాబితాలో అక్టోబర్‌లో ప్రచురించిన దాంట్లో ఆయన 85వ ర్యాంకులో ఉన్నారు. ఆయన సంపద 1.8 బిలియన్ డాలర్లుగా తేలింది. కాగా భారత సంతతికి చెందిన వారు విదేశాల్లో ఉన్న బిలియనీర్లు రెండు బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపద కలిగిన వారు తొమ్మిది మంది వరకు ఉన్నారు. వారు ఆస్ట్రేలియా, బ్రిటన్, మలేషియా, సింగపూర్, అమెరికాల్లో ఉన్నారు.

తగ్గిన జెఎల్ఆర్ గ్లోబల్ అమ్మకాలు

● ఫిబ్రవరి 2.6 శాతం క్షీణత

న్యూఢిల్లీ: టాటామోటార్స్‌కు చెందిన జాగ్వార్ అండ్ ల్యాండ్ రోవర్ (జెఎల్ఆర్) గ్లోబల్ అమ్మకాలు గత నెలలో 2.6 శాతం క్షీణించి 39,911 యూనిట్లు మాత్రమే విక్రయించగలిగింది. ఈ వారంలోనే వెలికి జాగ్వార్ బ్రాండ్ అమ్మకాలు ఫిబ్రవరిలో 11,566యూనిట్లు విక్రయించింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 5.2 శాతం అమ్మకాలు తగ్గాయని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. ల్యాండ్ రోవర్ అమ్మకాలు గత నెలలో 28,346 యూనిట్లు విక్రయించింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 1.5 శాతం క్షీణించాయి. కంపెనీ రిటైల్ అమ్మకాలు మొత్తం కలిపితే గత నెలలో 39,911 యూనిట్లు విక్రయించింది. చైనాలో అమ్మకాలు 3.3 శాతం పెరుగుతుంది. ఉత్తర అమెరికా మార్కెట్లో 1.5 శాతం పెరిగితే. బ్రిటన్ మాత్రం ఫిబ్రవరిలో 15.2 శాతం అమ్మకాలు తగ్గాయి. అలానే యూరోప్‌లో 6.9 శాతం వరకు తగ్గాయి.

టీవీఎస్ మోటార్ రేస్ ఎడిషన్

అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ

న్యూఢిల్లీ: టీవీఎస్ మోటార్ బుధవారం నాడు రేస్ ఎడిషన్ అపాచీ ఆర్‌టీఆర్ 300 4వీను దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.1,08,985 (ఎక్స్ షో రూం ఢిల్లీ)గా ప్రకటించింది. రేస్ ఎడిషన్ 2.0 మోటార్‌సైకిల్ ఎ-ఆర్‌టి సిప్పర్ క్లచ్ టెక్నాలజీతో రూపుదిద్దుకుంది. దీని ద్వారా క్లచ్‌పై భారం 22 శాతం వరకు తగ్గుతుందని ప్రకటనలో ఒక ప్రకటనలో పేర్కొంది. ఇంజన్ విషయానికి వస్తే 197.75 సీసీ సింగిల్ సిలిండర్ మోటార్‌తో 5 స్పీడ్ గేర్‌బాక్స్ కలిగి ఉంటుంది. కార్బొరేటర్‌తో పాటు ఈఎఫ్ఐ తో పాటు కార్బొరేటర్‌తో పాటు ఏబీఎస్ వెరియెంట్‌లలో లభిస్తుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ మార్కెటింగ్ అరుణ్ సిద్ధార్థ్ చెప్పారు. ఈ బైక్ ద్వారా రేసింగ్ అనుభూతిని పొందవచ్చునని ఆయన అన్నారు. కార్బొరేటర్ వెరియంట్ ధర రూ.95,185, ఈఎఫ్ఐ వెరియెంట్ ధర రూ.1,07,885, కార్బొరేటర్‌తో పాటు ఏబీఎస్ వెరియెంట్ ధర రూ.1,08,985గా నిర్ణయించారు. అయితే ఈఎఫ్ఐ, ఏబీఎస్ వెరియెంట్ బైక్‌లు ఎంపిక చేసిన డీలర్ల వద్ద మాత్రమే లభిస్తాయని కంపెనీ స్పష్టం చేసింది.



స్పెషల్ ఎడిషన్


జెస్ట్ ప్రీమియం ఆవిష్కరణ



హైదరాబాద్: టాటామోటార్స్ క్లబ్ బుధవారం నాడు జెస్ట్ ప్రీమియం కారు ప్రీమియోను మార్కెట్లో విడుదల చేసింది. ఈప్రత్యేక ఎడిషన్‌కు 13 ఫీచర్లను జోడించింది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా దీనికి 85వేల మంది పైగా కస్టమర్లున్నారని టాటామోటార్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కారుకు వచ్చిన స్పందనను చూసి జెస్ట్ ప్రీమియో వెర్షన్‌ను తీసుకొచ్చింది. ఈ కారును మార్చి 1 నుండి దేశవ్యాప్తంగా అన్ని డీలర్ల వద్ద అందుబాటులో ఉంచారు. దీని ధర రూ.7.47 లక్షలు డిజిల్ వెర్షన్, ఎక్స్ షోరూం హైదరాబాద్‌గా నిర్ణయించింది. టాటామోటార్స్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ ఎన్ బర్మన్ మాట్లాడుతూ స్పెషల్ ఎడిషన్ జెస్ట్‌ను విడుదల చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కొత్త లుక్స్‌తో వినియోగదారుడి డబ్బుకు తగ్గ విలువ ఈ కారు ఇస్తుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇంజన్ వివరాల విషయానికి వస్తే 1.3 లీటర్, 4 సిలిండర్ బీఎస్-4 క్వాడ్రజెట్, కామన్‌రైల్, టర్బో డిజిల్ ఇంజన్ ఉంది. 75 పీఎస్‌కి, 190ఎన్ఎంటార్క్ అందిస్తుంది. 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌ను అందించారు. ఇంటీరియర్‌లను అందంగా తీర్చిదిద్దారు.

ప్రయివేటు పెట్టుబడులు తగ్గాయి

● మెగాడీల్స్ లేవు ● ఎర్నెస్ట్‌యంగ్ నివేదిక



ముంబై: ప్రైవేట్ పెట్టుబడులు, వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు గత నెల ఫిబ్రవరిలో భారీగా 60 శాతం వరకు తగ్గాయి. నెలవారి ప్రాతిపదికన చూస్తే పెట్టుబడులు తగ్గి 1.4 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి. గత నెలలో మొత్తం 63 డీల్స్ కుదిరాయి. మొత్తానికి చూస్తే మెగాడీల్స్ ఏవీ గత నెలలో జరగలేదని ఎర్నెస్ట్ అండ్ యంగ్ నివేదిక తెలిపింది. 300 డాలర్ల కంటే ఎక్కువ డీల్స్ జరిగిన దాఖలాల్లేవు. కాగా జనవరి లో మొత్తం 3.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి ఈ వివరాలను బుధవారం నాడు విడుదల చేసిన నివేదికలో వివరించింది. దీనికి ప్రధాన కారణం గ్లోబల్ మార్కెట్లో ఫిబ్రవరి నెల నుంచి ఒడిదుడుకులు మొదలయ్యాయి. ఈక్విటీ మార్కెట్లో కరెక్షన్ ఏర్పడింది. భారత్‌లో కూడా ఇదే పరిస్థితి కొనసాగు తోందని ఈవై భాగస్వామి వివేక్ సోని తెలిపారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిగుమతి సుంకం పెంచుతామని ప్రకటించి వాణిజ్య యుద్ధానికి తెరతీయడంతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ట్రంప్ ఇటీవల ఉక్కు, అల్యూమినియంపై భారీగా దిగుమతి సుంకం పెంచుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో గ్లోబల్ మార్కెట్లో ఒడిదుడుకులు మరిన్ని రోజులు కొనసాగే అవకాశాలున్నాయి. అయితే దీర్ఘకాలానికి చూస్తే భారతకు పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అయితే జనవరిలో భారత్‌లోకి పెద్ద మొత్తంలో పెట్టుబడులువచ్చాయి. హెచ్‌డీఎఫ్‌సీ గ్రూపునకు ఏకంగా 1.7 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు వచ్చాయి. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే ఫిబ్రవరి పెట్టుబడులు ఏకంగా 256 శాతం పెరిగాయి. దీంతో పాటు డీల్స్ కూడా రెట్టింపు అయ్యాయని నివేదికలో వివరించింది.

కాగా ఫిబ్రవరిలో 100 మిలియన్ డాలర్ల నాలుగు డీల్స్ కుదిరాయి. గిరిష్టంగా 580 మిలియన్ డాలర్లని తెలిపింది. గత ఏడాది ఇదే నెలలో ఇలాంటి జరగలేదని తెలిపింది. స్టార్టప్ కంపెనీలకు పెద్దమొత్తంలో పెట్టుబడులు వచ్చాయి. రికార్డు స్థాయిలో 30 డీల్స్‌కుదిరాయి... వాటిలో 295 మిలియన్ డాలర్లు, తర్వాతి స్థానం టెక్నాలజీ రంగంలో 296 మిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు వచ్చాయి. మొత్తం 14 డీల్స్ కుదిరాయని తెలిపింది. అదే విధంగా గత నెలలో 12 పెట్టుబడులు ఉపసంహరణ జరిగాయి. వీటి విలువ 234 మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని తెలిపింది. అతి పెద్ద ఇన్వెస్టర్ నిష్క్రమణ విషయానికి వస్తే అపోలో గ్లోబల్ లాజిక్స్ గ్రూపు నుంచి తప్పుకుంది. దీని విలువ 74 మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని నివేదికలో పేర్కొంది.

ఎయిర్‌సెల్ మూసివేత

● లక్ష మంది కస్టమర్లు బీఎస్ఎన్ఎల్‌కు



న్యూఢిల్లీ: భారీ సంక్షోభంలో చిక్కుకున్న టెలికం ఆపరేటర్ఎయిర్‌సెల్ మూతపడింది. దీనికి సంబంధించిన లక్ష మంది కస్టమర్లు ప్రభుత్వరంగానికి చెందిన బీఎస్ఎన్ఎల్‌లో చేరినట్లు బీఎస్ఎన్ఎల్ బుధవారం నాడు తెలిపింది. గత నెలలో 57,435 మంది ఎయిర్‌టెల్ కస్టమర్లకు మొబైల్ నెంబర్ పోర్టబిలిటి ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారారు. మరో 1.85 లక్షల మంది కస్టమర్లు తమ నెట్‌వర్క్‌లో చేరేందుకు దరఖాస్తులు చేసుకున్నారని... బీఎస్ఎన్ఎల్ తమిళనాడు సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్ మార్షల్ ఆంథోని లియో చెప్పారు. గత ఐదు రోజుల్లోనే అంటే మార్చి 1 నుంచి ఐదవ తేదీ వరకు సుమారు 1.28 లక్షల మంది కస్టమర్లు బీఎస్ఎన్ఎల్‌కు మారారు. ఇప్పటికే 66,886 కస్టమర్లు తమ నెట్‌వర్క్‌లోకి మారారని ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. గత వారం ఎయిర్‌సెల్ ఎన్‌సీఎల్‌టీకి దివాలా దరఖాస్తును అందజేసింది.

ఎలుగు పంజా

● భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో పతనం బుధవారం నాడు కొనసాగింది. బ్యాంకింగ్ రంగంలో జరుగుతున్న కుంభకోణాల నేపథ్యంలో బ్యాంకు షేర్లు నష్టపో గా... గ్లోబల్ మార్కెట్లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో గ్లోబల్ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. కాగా బీఎస్ఈ మొత్తం 284 పాయింట్లు నష్టపోయి 33,033 పాయింట్లు, నిఫ్టీ 95 పాయింట్లు క్షీణించి 10,154 వద్ద ముగిశాయి. బ్యాంకింగ్ రంగానికి వస్తే స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, పీఎన్‌బీ బ్యాంకులు అత్యధికంగా నష్టపో యాయి. ఎస్ఎఫ్ఐఓ ముందు ఐసీఐసీఐ బ్యాంకు అధికారులు హాజరై నీరవ్‌మోడీ ఇచ్చిన రుణాల గురించి వివరించారు. నష్టపోయిన షేర్ల విషయానికి వస్తే అదానీపోర్ట్స్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, అంబుజా సిమెంట్స్, హిందుస్థాన్ పెట్రోలియం, రిలయన్స్ ఇండస్ట్రీస్ లు ఉన్నా యి. దీనికి వ్యతిరేకంగా హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ, జీ ఎంటర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్, మారుతి సుజుకి, ఏషియన్ పెయింట్స్, కొటక్ మహీంద్రా బ్యాంకు, టాటామోటార్స్‌లున్నాయి.



గీతాంజలి బకాయిలు రాబట్టడం కష్టమే



ముంబై: ప్రైవేట్ బ్యాంకులు ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు అధికారులు ఎస్ఎఫ్ఐఓ అధికారుల ముందు హాజరై నీరవ్‌మోడీ, గీతాంజలి జెమ్స్‌కు ఇచ్చిన రూ.1,000 కోట్ల రుణాలు రాబట్టడం కష్టమేనని స్పష్టం చేశారు. విశ్వసనీయవర్గాల సమాచారం ఐసీఐసీఐ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ఎస్ కన్నన్, యాక్సిస్ బ్యాంకు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ వి శ్రీనివాసన్‌లు ముంబైలోని ఎస్ఎఫ్ఐఓ ముందు మంగళవారం నాడు హాజరయ్యారు. విచారణ అధికారులతో నీరవ్ మోడీతో పాటు మెహుల్‌చోక్సీల నుంచి బకాయిలు రాబట్టడమే దాదాపు కష్టమేనని చెప్పినట్లు తెలుస్తోంది. కన్నన్ విచారణ అధికారులకు తమ బ్యాంకు రూ.800 కోట్ల వరకు ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. కాగా శ్రీనివాసన్ మాత్రం తమ బ్యాంకు రూ.200 కోట్ల వరకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. వీరిద్దరు దేశం నుంచి పారిపోయిన వజ్రాల వ్యాపారుల నుంచి బకాయిలు రావడం కష్టమేనని చెప్పినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఎస్ఎఫ్ఐఓ ఐసీఐసీఐ బ్యాంకు చీఫ్ చందా కొచ్చార్, యాక్సిస్ బ్యాంకు చీఫ్ శిఖా శర్మలను మంగళవారం హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసిం ది. అయితే వీరిద్దరు తమ ప్రతినిధులుగా తమ ఎగ్జిక్యూటివ్‌లను పంపించింది.

ఉద్యోగం కంటే వృత్తికి ప్రాధాన్యం ఇవ్వాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విద్యార్థులు వారు చదువుతున్న కోర్సులు పూర్తి అయిన తరువాత వెంటనే ఉద్యోగం కోసం వెతుకులాడకుండా వృత్తికి ప్రాధాన్యం ఇచ్చేలా ఉండాలని బయోకాన్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్, ఎండీ కిరణ్ మజుందార్ షా సూచించారు. మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసుకుని బయటికి వెళుతున్న ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐ.ఎం.టి 2018 స్నాతకోత్సవం శంషాబాద్‌లోని క్యాంపస్‌లో జరిగింది. స్నాతకోత్సవంలో ఐఎంటీ అధ్యక్షులు ఎంపీ కమల్ నాథ్, డైరెక్టర్ డాక్టర్ సతీష్ ఐలావాలి పాల్గొన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న 300 మంది విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేశారు. వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేశారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు తెలిపి కిరణ్ మజుందార్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. క్లాస్‌రూమ్‌లో నేర్చుకున్న విషయాలను జీవితంలో గుర్తుంచుకొని అమలు చేయాలని సూచించారు. రోజు రోజుకు టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. ఫేస్‌బుక్, అమెజాన్, గుగూల్ వంటి వాటి ఆదాయం సుమారు 3.5 ట్రిలియన్ డాలర్లు ఉందని, ఇది ఇండియా బడ్జెట్ కంటే ఎక్కువ అని అన్నారు. టెక్నాలజీతో అభివృద్ధి చెందిన ఆ సంస్థలు ఎంత ఆదాయాన్ని పొందడమే కాకుండా, ఉద్యోగ అవకాశాలను కూడా అందిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగానికి, వృత్తికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర చాలా ఉందని అన్నారు. కలలు కనడమే కాకుండా వాటిని పర్యవేక్షించుకుని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. డాటా, డాటా అనాలిస్టు, డాటా సైన్స్‌లో ఉద్యోగ అవకాశాలు బాగా పెరుగుతున్నాయని, యువత వాటిపై పట్టుసాధించుకోవాలని సూచించారు. ఐఎంటీ అధ్యక్షులు, ఎంపీ కమల్‌నాథ్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు బిజినెస్ లీడర్లుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి ముగింపు ఇంకొకదానికి నాంది అవుతుందని, అ లాగే ఇక్కడ కోర్సు ముగించుకొని బయటికి కెరీర్ లోకి వెళుతున్నందున అక్కడ విజయం సాధించాలన్నారు. జీవితంలో ఎప్పుడు నేర్చుకోవడం ఆపవద్దని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ నా దేశం ముందుండాలని కోరుకుంటున్నారని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా అదే విషయాన్ని తన దేశంలోని యువతకు చెప్పారని గుర్తు చేశారు.

జీఎంఆర్ ఎయిర్‌పోర్టుకు ఏఐసీ గుర్తింపు

● వరుసగా నాలుగో సారి ఏఐసి గుర్తింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడంలో ప్రపంచ గుర్తింపు పొందింది. మాంట్రియల్ కేంద్రం గా ఉన్న ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) 2017లో నిర్వహించిన సర్వేలో జీఎంఆర్‌కు ఈ మేరకు గుర్తింపు వచ్చింది. ఏటా 5 నుంచి 15 లక్షల మంది ప్రయాణీకులు ప్రయాణించే విమానాశ్రయాల కేటగిరీలో అందిస్తున్న సేవలు, ప్రమాణాలపై నిర్వహించిన అధ్యయనంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అగ్రస్థానంలో నిలిచింది. గత నాలుగేళ్లుగా ఈ సర్వేలో మొదటి మూడు అగ్రస్థాయి ఎయిర్‌పోర్టుల్లో జీఎంఆర్ నిలుస్తూ వచ్చింది. 2014లో దేశంలోనే ఏసీఐ డైరెక్టర్ జనరల్ ఎక్సలెన్స్ ఎయిర్‌పోర్టు సర్వీస్ క్వాలిటీ అవార్డును పొందిన మొదటి ఎయిర్‌పోర్టుగా జీఎంఆర్ నిలిచింది. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు గుర్తింపు పొందడాన్ని పురస్కరించుకుని జీఎంఆర్ ఛైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాలా మాట్లాడుతూ, ఈ విజయం వెనక ఎందరో భాగస్వాముల కృషి ఉందన్నారు. ఈ విజయానికి తమ సంస్థ నిబద్ధతకృషి ఉందని వారి సేవలను ప్రశంసించారు.


ఎస్ఎఫ్ఐఓ ముందుకు

పీఎన్‌బీ చీఫ్ హాజరు



ముంబై: ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ మెహతా బుధవారం నాడు సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఓ) ముందు హాజరయ్యారు. పీఎన్‌బీలో జరిగిన రూ.12,700 కోట్ల స్కాం స్టేట్‌మెంట్ రికార్డ్‌చేశారు. కాగా గత రెండు రోజుల నుంచి ఎస్ఎఫ్ఐఓ రెండు బిలియన్ డాలర్ల మోసం కేసు గురించి ఇప్పటివరకు పీఎన్‌బీతో కలిపి మూడో బ్యాంకును విచారించింది. కాగా పీఎన్‌బీ నీరవ్ మోడీతో పాటు మెహుల్ చోక్సీలు రూ.12వేల కోట్ల పైనే మోసం చేసిన విషయం తెలిసిందే. కాగా మెహతా బుధవారం నాడు ఉదయం 11 గంటలకు ఎస్ఎఫ్ఐఓ కార్యాలయంలోకి ప్రవేశించడం కనిపించింది. కాగా యాక్సిస్ బ్యాంకుతో పాటు ఐసీఐసీఐ బ్యాంకు సీనియర్ అధికారులు మంగళవారం నాడు ఎస్ఎఫ్ఐఓ ముందు హాజరయ్యి పీఎన్‌బీ స్కాం కేసుకు సంబంధించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఇదిలా ఉండగా పీఎన్‌బీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవి బ్రహ్మాజీరావుతో పాటు మెహతాను గత నెలలో సీబీఐ విచారించింది. అయితే ఈ కేసులో మెహతాతో పాటు రావులను తాము నిందితులుగా భావించడం లేదని సీబీఐ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా కార్పొరేట్ మంత్రిత్వశాఖ కింద పనిచేసే ఎస్ఎఫ్ఐఓ మోడీ, చోక్సీ కంపెనీలకు రుణాలిచ్చిన 31 బ్యాంకు అధికారులను విచారించనున్నట్లు తెలుస్తుంది. మోడీ, చోక్సీ కంపెనీలకు గత రెండు సంవత్సరాల నుంచి రుణాలిచ్చిన బ్యాంకు అధికారులను కూడా ఎస్ఎఫ్ఐఓ పిలిపించి వారి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తుందని బ్యాంకర్ ఒకరు చెప్పారు. కాగా సీబీఐ ఇప్పటి వరకు పీఎన్‌బీ స్కాం కేసుకు సంబంధించి సుమారు డజను మందికిపైగా అరెస్టు చేసింది. కాగా పీఎన్‌బీలో ప్రస్తుతం పనిచేస్తున్న అధికారులతో పాటు మాజీ అధికారులు కూడా ఉన్నారు.

తెలంగాణకే తలమానికం'కుంటాల'



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కుంటాల జలపాతం తెలంగాణకే తలమానికమని అటవీ మంత్రి జోగురామన్న పేర్కొన్నారు. ఇక్క డకు విహార యాత్ర కోసం వచ్చే యువతీ, యువకులు ప్రమా దాల బారిన పడి చని పోవడం చా లా బాధాకరమన్నారు. ఇక్క డకు వచ్చే పర్యాటకుల కోసం కనీస వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు సందర్శకులు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి అరణ్యభవన్‌లో ఉన్నతాధికారులతో బుధవారం మంత్రి సమీక్షించారు. కుంటాల సహజ సౌందర్యం, అటవీ ప్రాంతం ఏ మాత్రం దెబ్బతినకుండా పర్యావరణ హితమైన టూరిజంలో భాగంగా కుంటాల వాటర్‌ఫాల్స్ దగ్గర అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు.

పారదర్శకంగా వ్యవహరిస్తా

తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిగా ప్రజాస్వామ్యబద్ధంగా, నిబంధనల మేరకు పారదర్శకంగా బాధ్య తలను నిర్వహిస్తానని తెలంగాణ రాష్ట్ర తొలి ఎన్నికల ప్రధా నాధికారిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ రజత్‌కుమార్ చెప్పారు. బుధవారం సచి వాలయంలోని తన కార్యాలయంలో ఆయన విలే ఖరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తగా ఏర్ప డిన తెలంగాణ రాష్ట్రా నికి ప్రధాన ఎన్నికల అధికారి (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్) గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. 2019 సాధారణ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ బస్సులు

•గోల్డుస్టోన్ సంస్థతో ఆర్టీసీ ఒప్పందం •తొలి దశలో 40 బస్సులు •సెప్టెంబర్‌లో రోడ్డెక్కనున్న ఈ-బస్సులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సులను తిప్పడానికి ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి దశలో 40 బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోబోతుంది. ఈ మేరకు గోల్డు స్టోన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. సెప్టెంబర్ లో ఈ -బస్సులు గ్రేటర్ పరిధిలోని ఎంపిక చేసిన రూట్లలో తిరిగే విధంగా ప్రణాళిక సిద్ధం చేసింది. తొలి దశ ప్రయోగం విజయవంతమైన పక్షంలో మరో 60 బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోవాలని నిర్ణయించింది. అద్దె ప్రాతిపదికన ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయడానికి అసక్తి కలిగిన సంస్థల నుండి ఆర్టీసీ టెండర్లను అహ్వానించింది. ఆర్టీసీ ప్రకటనకు స్పందించిన 11 సంస్థలు 5 బిడ్లను దాఖలు చేశాయి. వాటిలో అశోక లీలాండ్, టాటా మోటార్స్, గోల్డు స్టోన్, హూండాయ్ లాం టి మో టారు తయారీ సం స్థలు ఉన్నాయి. బిడ్లను పరిశీలించిన తర్వాత ఆర్టీసీ అధికారులు గోల్డు స్టోన్ సంస్థతో అవగాహన ఒప్పందం క ుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు ఇచ్చే సంస్థలు బస్సుల నిర్వహణ, బీమా, డ్రైవర్‌ను సమకూర్చ వలసి ఉంటుంది. కిలో మీటర్‌కు రూ. 35.35 ల చొప్పున అద్దె ఇవ్వడానికి ఆర్టీసీ అంగీకారం తెలిపింది. అత్యాధునిక సౌకర్యాలతో ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు ఇవ్వడానికి గోల్డు స్టోన్ సంస్థ ముందుకు వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఒకొక్క బస్సు ఖరీదు సుమారు రూ. 2.50 కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. సాధా రణ ఏసీ బస్సు ఖరీదు రూ. కోటి నుండి రూ. రూ. 1.20 కోట్ల వరకు ఉంటుందని, ఎలక్ట్రిక్ బస్సులు భారీ వ్యయంతో కూడుకున్నవైనందున అద్దెకు తీసుకుంటున్నామని వివరిం చారు. ఎలక్ట్రిక్ బస్సులు శబ్ద, కాలు ష్య రహితం అన్నారు. వాటి నిర్వహణ కూడా భారం కాబోదని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రధాన మార్గాల్లో వాహన కాలుష్యం తగ్గించాలనే సంకల్పంతోనే ఎలక్ట్రిక్ బస్సులను ప్రయోగాత్మకంగా అద్దె ప్రాతిపదికన ప్రవేశపెట్టాలని భావించామన్నారు. రాబోవు కాలంలో దశల వారిగా గ్రేటర్ పరిదిలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడానికి అవకాశం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నందున ఇప్పటికే అనేక సంస్థలు ఉత్పత్తిని ప్రారంభించాయని వెల్లడించారు.

ట్రెజరీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



ఆంధ్రప్రభ, హైదరాబాద్ : ట్రెజరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి ఆయన సచివాలయంలో జరిగిన తెలంగాణ ట్రెజరీ ఎన్‌జీవో అసోసియేషన్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రెజరీ ఉద్యోగుల సాదకబాధకాలను తీర్చేందుకు ముందుంటానని స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన తెలంగాణ రాష్ట్రబీవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాదరావు మాట్లాడుతూ ట్రెజరీ ఉద్యోగుల సంఘం డైరీ అన్ని శాఖల ఉద్యోగులకు దిక్సూచీగా ఉపయోగపడుతుందన్నారు. ట్రెజరీ ఎన్‌జీవో ఉద్యోగుల డైరీలో ఉద్యోగుల అంశాలే పొందుపర్చామని డైరెక్టర్ కెఎస్ఆర్‌సి మూర్తి అన్నారు. టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రెజరీ ఎన్‌జీవో ఉద్యోగుల అన్ని సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, కార్యదర్శి మహిపతి, అసోసియేట్‌అధ్యక్షుడు పర్వతాలు, ఇంద్రసేనారెడ్డి. జిల్లాల నేతలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై గళమెత్తుతాం

తెదేపా ఎమ్మెల్యే సండ్ర



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రతిపక్షాలకు తగినంత సమయం కేటాయించాలని తెలుగుదేశంపార్టీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. తమ పార్టీ సభ్యులు ప్రజా సమస్యలు లేవనెత్తేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. రైతు సమస్యలు, విద్యార్థి, నిరుద్యోగ సమస్యలు, రిజర్వేషన్లు, దళితులు, బీసీలు, ఇతర కులవృత్తులు ఎదుర్కొన్న సమస్యలు, భూ కుంభకోణాలపై ప్రభుత్వాన్ని నిల దీయనున్నట్లు ఆయన తెలిపారు. శాసనసభ సమావేశాల్లో తెదేపా సభ్యులు లేవ నెత్తాల్సిన అంశాలపై టిడిఎల్‌పిలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వెం కటవీరయ్యతో పాటు పార్టీ శాసనసభ్యుడు ఆర్.కృష్ణయ్య, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్ బాబు పాల్గొన్నారు.

మాధవరెడ్డికి తెదేపా నేతల నివాళి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీమంత్రి, దివంగత ఎలిమినేటి మాధవరెడ్డి 18వ వర్ధంతిని తెదేపా తెలంగాణ నాయకులు ఘనంగా నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని మాధవరెడ్డి విగ్రహాన్ని పూలతో అలంకరించి ఆ పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య, ఆర్.కృష్ణయ్య, పార్టీ ఉపాధ్యక్షుడు ఎం.అమర్‌నాథ్ బాబుతో పాటు పలువురు నేతలు మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి నివాళు లర్పిం చారు.

11న టీఆర్ఎస్ఎల్పీ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈనెల 12నుండి ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. టీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం ఈనెల 11న నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. 11న తెలంగాణభవన్‌లో జరిగే భేటీకి సిఎం కెసిఆర్ హాజరుకానున్నారు. శాసనసభసమావేశాల్లో పార్టీ అను సరించాల్సిన వైఖరి, ఎన్నికల ఏడాదిలో ప్రజలతో వ్యవహరించాల్సిన తీరు, జాతీ య రాజకీయ ప్రకటన నేపథ్యంలో ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన అంశాలపై సిఎం వారికి వివరించనున్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటున్న బీజేపీ

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆరోపణ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా మాదిగలను బీజేపీ పార్టీ మోసం చేస్తుందని (ఎంఎస్ఎఫ్) మాదిగస్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్రకమిటీ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించింది. మార్చి 13వ తేదీన ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌కు అన్నివర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలైన ఈ విషయంపై బీజేపీ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ ఓయూ విద్యార్థి సంఘాలు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కళ్లకు గంతలు కట్టుకొని విద్యార్థులు నిరసన తెలియచేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సుధాకర్ మాదిగ, కొమ్ము శేఖర్ మాదిగ, కృష్ణమాదిగ, రంజిత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

115 చెరువులు మంజూరు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మిషన్‌కాకతీయ-4వ దశ పథకం ద్వారా 115చెరువులు మంజూరుచేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. వనపర్తి 9, రంగారెడ్డి 43, వికారాబాద్ 2, నల్లగొండ 12, సంగారెడ్డి 31, సిద్దిపేట 6, యాదాద్రి 12 చెరువులను మంజూరుచేశారు. మంజూరుచేసిన చెరువుల టెండర్లు, అగ్రిమెంట్ల ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని అధికారులు కోరారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల పరీక్ష నిర్వహించండి

బీఆర్ అంబేద్కర్ వర్సిటీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: శ్రీకాకుళం జిల్లాలోని బీఆర్ అంబేద్కర్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక పరీక్షను నిర్వహించేందుకు హైకోర్టు అనుమతించింది. అయితే ఫలితాలను మాత్రం పర్కటించొద్దని హైకోర్టు వర్సిటీ రిజిస్ట్రార్ ను ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ .రామచంద్రరావు బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేసే నిమిత్తం వర్సిటీ జారీ చేసిన ప్రకటనను సవాలు చేస్తూ కాకినాడకు చెందిన కె.దండేష్ కుమార్ హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే.

త్రిపుర ఘటనపై వామపక్షాల ఆందోళన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : త్రిపురలో వ్లాదిమిర్ లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు బుధ వారం హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బషీర్‌బాగ్ కూడలిలో దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు ఇరు పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏప్రిల్ 27న ఫెడరల్ ఫ్రంట్

(మొదటిపేజీ తరువాయి)

వెళ్ళాలన్న భావనలో అధినేత ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో ఉన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఖచ్చితంగా తన వ్యూహం ఫలిస్తుందన్న ధీమాలో సిఎం ఉన్నట్లు సన్నిహిత వర్గాలు వివరించాయి. గుణాత్మకమార్పును దేశమంతా కోరుకుంటోందని, టిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకకు జాతీయ నాయకులు హాజరైతే.. దేశం చూపు ఈ ఫ్రంట్‌పై పడుతుందని టిఆర్ఎస్ అంచనా వేస్తోంది. అందుకే బిజెపి, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయ వేదికగా టిఆర్ఎస్ ప్లీనరీ వేదికను రూపొందిస్తున్నారని.. ఈ వేదికగా ప్రకటించేఫెడరల్ ఫ్రంట్, దాని విధానాలతో జాతీయపార్టీలు తప్పనిసరిగా ఈ అంశాలపై మాట్లాడాల్సిన అనివార్యత కెసిఆర్ తీసుకొస్తారని టిఆర్ఎస్ ముఖ్యులు చెబుతున్నారు. జాతీయస్థాయిలో కొందరు రిటైర్డ్ ఆర్థిక, రక్షణరంగ, నీటిపారుదల రంగ నిపుణులను కూడా ఈ వేదికకు ఆహ్వానించేందుకు చర్చలు జరుగుతున్నాయి. టిఎంసి, ఎంఐఎం, జెఎంఎం, ఛత్తీస్‌గడ్‌కు చెందిన అజిత్‌జోగి పార్టీ తమ అధినేతతో మాట్లాడారని, దేశమంతా.. బిజెపి, కాంగ్రెస్ లతో విసిగిపోయినందున కెసిఆర్ నేతృత్వంలో ఫెడరల్ ఫ్రంట్ బ్రహ్మాండంగా విజయవంతమవుతుందని టిఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత జితేందర్‌రెడ్డి ఆంధ్రప్రభకు చెప్పారు.

సంచలన ఎజెండా..

గత ఏడాది ప్లీనరీ వేదికగా రైతుకు పెట్టుబడి మద్దతు పథకాన్ని ప్రకటించి సంచలనం సృష్టించిన కెసిఆర్.. ఈసారి ప్లీనరీ వేదికగా దేశరైతాంగానికి అనేక ఆకర్షణీయ పథకాలు ప్రకటించనున్నట్లు సమాచారం. దేశంలో రైతాంగం ప్రధానంగా సాగునీరు, పెట్టుబడి, మద్దతుధర సమస్యలతో ఇబ్బందులు పడుతుండగా.. వీటికి విరుగుడుగా అత్యంత ఆకర్షణీయ పథకాలను ప్రకటించాలని భావిస్తున్నట్లు సమాచారం. రైతు పెట్టుబడి పథకం, దేశంలోని రైతులందరికీ ఉచితభీమాతో పాటు ప్రతి ఎకరానికి సాగునీరు, రైతు పంటకు మద్దతుధర.. మార్కెట్‌లో రేటు లేకుంటే ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసేలా చేయడం వంటి అంశాలను ప్రకటించే అవకాశముంది. ముఖ్యమంత్రి జాతీయ రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించిన సందర్భంగా.. బ్రహ్మపుత్ర నది అంశాన్ని ప్రస్తావించగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఇలాంటి అనేక అంశాలు.. సమస్యలను తనదైన శైలిలో ప్రస్తావించి.. పథకాలు ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది. ఏప్రిల్ 27న టిఆర్ఎస్ ఆవిర్భవించగా, ఈ ఏడాది ఏప్రిల్ 27కు పార్టీ 17వసంతాలు పూర్తిచేసుకుని 18వ వసంతంలోకి అడుగిడనుంది. పార్టీ లక్ష్యమైన.. తెలంగాణ రాష్ట్రం సాధించడంతో పాటు సాధించిన రాష్ట్రంలో అధికారాన్ని కూడా హస్తగతం చేసుకుని తిరుగులేని స్థాయిలో పార్టీని నిర్మించుకుంది. ఈ క్రమంలో జాతీయ రాజకీయాలపై దృష్టిపెట్టిన కెసిఆర్.. భారతదేశ రాజకీయాలను సమూలంగా మారుస్తానన్న ధీమాతో వ్యూహాత్మకంగా ఫెడరల్ ఫ్రంట్ అడుగులు వేస్తున్నారు. వచ్చే నెల 27న లేదా 24న హైదరాబాద్ వేదికగా ప్లీనరీ నిర్వహించాలని భావిస్తున్నారు.

రైతు సంక్షేమమే రాజకీయ అస్త్రం

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని ఏ విధంగా పురోగతి దిశగా పయనించవచ్చుననే వ్యూహాన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఇన్నాళ్ళూ వనరులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైన ప్రభుత్వాల తీరును ఎండగట్టేందుకు కేసీఆర్ సమాయత్తమవుతున్నారు.

అసెంబ్లీ వేదికగా అన్నదాతలకు వరాల వర్షమే

రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ వరాల వర్షం కురిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు అమల్లో ఉన్న పథకాలపై సభ్యులందరి అభిప్రాయాలు విన్న తర్వాత నాలుగైదు కొత్త పథకాలను కూడా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతు సంక్షేమ పథకాలన్నింటినీ మరింత మెరుగుపర్చడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాలను కూడా ఈ సందర్భంగా ప్రకటించనున్నారు. వ్యవసాయానికి రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటల ఉచిత విద్యుత్, చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయానికి అనుబంధంగా ఉపాధి పథకాలు, పంటల సాగుకు అవసరమైన ముడి సరుకుపై భారీ రాయితీలు ఇవ్వనున్నారు. ఉత్పత్తుల మార్కెటింగ్‌పై కొత్త విధానం, రైతు సమన్వయ సమితిల ద్వారా ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించనున్నారు. కూరగాయలు, పండ్లు అమ్ముకునేందుకు రైతులకు సబ్సిడీపై సంచార మార్కెటింగ్ వాహనాలు, పంట గిట్టుబాటు కాని సందర్భంలో, ప్రకృతి విపత్తుల కారణంగా ఉత్పత్తులను అమ్ముకోలేని పరిస్థితుల్లో మద్దతు ధరలపై అధనంగా బోనస్ కూడా ఇవ్వాలని యోచిస్తున్నారు. సబ్సిడీ బర్రెల పథకం, 90శాతం సబ్సిడీపై గొర్రెల షెడ్ల పథకంతో పాటు మరిన్ని రాయితీలతో కూడిన పథకాలను సీఎం సభలో ప్రకటించనున్నారు.

రైతుల అభిప్రాయాలపై అధికారిక సర్వే, ఆ ప్రకారమే ప్రోత్సాహకాలు

రాష్ట్ర అభివృద్ధికి, ఆర్థిక వృద్ధిరేటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడుతున్న వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు గల అవకాశాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. వచ్చే ఏడాది మరిన్ని రైతు సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. అందుకు గల మార్గాలపై అధ్యయనం చేసి కార్యాచరణ ప్రణాళికను తయారు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పూర్తయిన రుణమాఫీ పథకం, వచ్చే వానాకాలం నుంచి ప్రారంభిస్తామని ప్రకటించిన పెట్టుబడి రాయితీ పథకంపై రైతుల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకున్నారు. అందుకోసం అధికారికంగానే సర్వే నిర్వహించి నివేదిక తెప్పించుకున్నారు. సమగ్ర రైతు సర్వేతో పెట్టుబడి పథకానికి అర్హుత జాబితాలు రూపొందించడంతో పాటు రుణమాఫీ పథకం ద్వారా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు చేకూరిన లబ్ధిపైనా వాకబు చేశారు. సీఎం కేసీఆర్ మదిలో ఉన్న ఆలోచనల మేరకు ఉన్నతాధికారులు అంతర్గత కార్యాచరణను తయారు చేస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పెట్టుబడి పథకం ద్వారా ఎకరాకు రూ.4వేల మొత్తాన్ని బేరర్ చెక్కుల రూపంలో పంపిణీ చేయడంతో పాటు పంటల సాగును మరింతగా ప్రోత్సహించేందుకు కొత్త పథకాలను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా స్వయం ఉపాధి కోసం ఎదురుచూస్తున్న గ్రామీణ యువత దృష్టిని వ్యవసాయ రంగంవైపు మళ్ళించేందుకు చర్యలు ప్రారంభించారు. 2018-19 వ్యవసాయ సంవత్సరంలో అమలు చేయబోయే కొత్త పథకాల ద్వారా యువతరాన్ని ఆకర్షించబోతున్నారు.

ఒప్పంద వివాహాలకు చట్టభద్రత

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. పెళ్లి బంధం పెటాకులైతే, ఆస్తుల పంపిణీ ఎలా? అనే విషయంపై భాగస్వాములిద్దరూ ముందుగానే అవగాహనకు వస్తారు. ఈమేరకు ఒప్పందంపై సంతకాలు చేస్తారు. అంతేకాదు వైవాహిక జీవితంలో ఎవరు ఏవిధమైన బాధ్యతలు నిర్వర్తించాలన్న అంశాన్ని కూడా కొన్నిసార్లు ఒప్పందంలో పొందుపరుస్తారు. వంట, ఇంటి పని ఎవరు చూడాలి? పిల్లల్ని స్కూలుకు దిగబెట్టే బాధ్యత ఎవరు చేపట్టాలి? ఒకవేళ ఇద్దరూ ఉద్యోగులైతే ఆర్జితాన్ని ఎలా ఖర్చు చేయాలి? తదితర అంశాలపై ముందే స్పష్టమైన అవగాహనకు వస్తారు. వీటన్నింటినీ పకడ్బందీగా ఒప్పంద పత్రంలో నమోదు చేసుకుంటారు. ఇండియాలోనూ ఈ తరహా ఒప్పందాలు అడపా దడపా జరుగుతుంటాయి. కానీ మనదేశంలో వీటికి చట్టబద్ధత లేదు.

త్వరలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ

ఒప్పంద వివాహాలపై చట్టబద్ధత కల్పించడం ద్వారా వివాహాలకు రక్షణ కల్పించొచ్చని కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ భావిస్తోంది. కేంద్రమంత్రి మేనకా గాంధీ ఆధ్వర్యంలో ఈవిధమైన చట్టానికి గల సాధ్యాసాధ్యాలు, విధి విధానాలపై ప్రాథమిక ముసాయిదా రూపొందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఒకసారి ఆస్తులు, బాధ్యతల పంపిణీపై ముందే అవగాహనకు వస్తే, అర్ధాంతరకఠిన వివాహ రద్దు పట్ల భార్యాభర్తలిద్దరు జాగ్రత్తగా ఉండే అవకాశం ఉంటుంది. అయితే, ఈరకమైన ఒప్పందాలతో మహిళలకు న్యాయం జరగదని కొందరు ఉన్నతాధికారులు వాదిస్తున్నారు. ముఖ్యంగా, ప్రవాస భారతీయ పెళ్లి కొడుకుల విషయానికొస్తే, విడాకుల తర్వాత సదరు మహిళ జీవితం బానిసత్వంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వివాహ ఒప్పందాలకు చట్టబద్ధత సాధ్యాసాధ్యాలపై చర్చించేందుకు వచ్చే వారం ఉన్నతస్థాయి కమిటీ న్యూఢిల్లీలో భేటీ కానుంది. ఈ భేటీలో హోం శాఖ, న్యాయశాఖ, మహిళా సంక్షేమశాఖ ప్రతినిధులతో పాటు మహిళా హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ ప్రతినిధులు కూడా పాల్గొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుత చట్టంలో మార్పులపైనా ఈ భేటీలో చర్చిస్తారు.

2015లోనే తొలి అడుగు..

ఈవిధమైన కార్యాచరణకు రెండేళ్ల కిందటే బీజంపడింది. కానీ అనివార్య కారణాల వల్ల ముందడుగు పడలేదు. స్త్రీశిశు సంక్షేమశాఖ కార్యదర్శి వ్యతిరేకించడం వల్లే నాడు ఈ బృహత్తర విధానం ముందుకు సాగలేదన్నది అసలు విషయం. పెళ్లికి ముందు ఒప్పందాలు లేదా ప్రమాణాలకు చట్టబద్ధత ఆచరణపై సదరు అధికారి లేవనెత్తిన సందేహాలతో మొత్తం వ్యవహారం నిలిచిపోయిందని సదరు మంత్రిత్వ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఆయన లేవనెత్తిన అభ్యంతరాలు వాస్తవ పరిస్థితులకు దూరంగా ఊహా జనితంగా ఉందని మరొక ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

ఇప్పుడు ఎందుకీ చర్చ?

రెండేళ్ల కిందట మరుగున పడిన అంశం హడావుడిగా మళ్లీ తెరపైకి రావడానికి గల కారణం మాత్రం ఎన్ఆర్ఐలేనని తెలుస్తోంది. ప్రవాస భారతీయ దాంపత్యం విచ్చిన్నమయిన సందర్భాల్లో మహిళలు దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉభయ దేశాల్లోని చట్టాలు వారిని ఆదుకోవడం లేదు. విడాకుల తర్వాత వారి బతుకు ప్రశ్నార్థకం అవుతోంది. ఇటీవల కాలంలో ఎన్ఆర్ఐ విడాకుల కేసులు ఎక్కువ అయ్యాయి. దీంతో రెండేళ్ల కిందటి ఆలోచనకు కేంద్రం తెరపైకి తీసుకువచ్చింది. వివాహపూర్వ ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం ద్వారా మహిళల్లో నెలకొన్న ఆందోళలను దూరం చేయొచ్చని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి మేనకా గాంధీ భావిస్తున్నారు.

1872 చట్టమే ప్రతిబంధకం..

పెళ్లికి ముందు ఒప్పందాలను చట్టం పరిధిలోకి తీసుకువచ్చే కార్యాచరణకు 46 ఏళ్ల కిందటి చట్టం అవరోధంగా నిలుస్తోంది. 1972లో తీసుకొచ్చిన ఒప్పంద చట్టంలోని 23, 26 సెక్షన్లు పూర్వ వివాహ కాంట్రాక్టు చెల్లుబాటును నిరోధిస్తోంది. దానికితోడు భారతీయ వివాహ చట్టంలో ముందస్తు ఒప్పందాల ప్రస్తావన లేకపోవడం మరొక కారణం. అందువల్ల ప్రస్తుత చట్టంలో మార్పులు చేయడం అనివార్యంగా కనిపిస్తోంది. సవరణల తర్వాత విడాకుల అంశం సరళతరం అవుతుంది. అభిప్రాయ భేదాలు లేదా మరే ఇతర కారణాల చేతనైనా భార్యాభర్తల్లో ఎవరైనా వైవాహిక బంధం నుంచి బయటకు వచ్చేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. పెళ్లికి ముందే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆస్తులు, బాధ్యతల పంపిణీ తేలికవుతుంది. అయితే, వినూత్న మార్పులపై తుదినిర్ణయానికి వచ్చేముందు అనేక అంశాలపై విస్తృత చర్చలు చేయాల్సి ఉంటుంది అని న్యాయశాఖ ఉన్నతాధికారి ఒకరు వివరించారు.

మజ్లిస్ చేతిలో టీఆర్ఎస్ కీలుబొమ్మ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : టిఆర్ఎస్ పార్టీ మజ్లిస్ చేతిలో కీలు బొమ్మగా మారిందని బిజెఎల్‌పి నేత జి. కిషన్ రెడ్డి అన్నారు. థర్డ్ ఫ్రంట్ ఆలోచన కెసిఆర్‌ది కాదని, అసదుద్దిన్ ఓవైసీదని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసదుద్దీన్ ఆదేశాల మేరకే కెసిఆర్ థర్డ్ ఫ్రంట్ అని పర్రకటించారని, ఉదయం కాంగ్రెస్, బిజెపిలను నామరూపాలు లేకుండా చేస్తామని అసదుద్దీన్ ఎంఐఎం కార్యకర్తల సమావేశంలో చెప్పారని, అదే రోజు సాయంత్రం కాంగ్రెస్, బిజెపి రహిత ఫ్రంట్‌ను ఏర్పాటు చేస్తానని కెసిఆర్ ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసినా కెసిఆర్ వాగ్ధానం చేశారని, ఇప్పుడు అది సాధ్యం కాదని తెలిసి రిజర్వేషన్ల అధికారాలను రాష్ట్రా లకు ఇవ్వాలని పార్లమెంట్‌లో పోరాటం చేస్తున్నారన్నారు. వాస్తవానికి మైనారిటీలపై కెసిఆర్‌కు ప్రేమ లేదని ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక పార్లమెంట్‌లో ఎంపీలతో కొత్త డ్రామాకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీఆర్ఎస్ అంటే తెలంగాణ రాక్షససమితి

బీజేపీ అధికార ప్రతినిధి సుభాష్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టిఆర్ఎస్ అంటే తెలంగాణ రాక్షస సమితి అని బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ ఒక ప్రకటనలో విరుచు కుపడ్డారు. ప్రజాస్వామ్య విలువలకు, మానవతా విలువలకు తిలోదకాలిచ్చిన టిఆర్ఎస్ ప్రజల రక్తాన్ని తాగుతోందని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కాని హామీలిచ్చిన కెసిఆర్ వాని నెరవేర్చడంలో విఫలమయ్యారని, తీరా ఇప్పుడు వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు కొత్త కొత్త నాటకాలను మొదలు పెడుతున్నారని ఆరోపించారు. జాతీయ పార్టీ అయిన బిజెపి సిద్ధాంతాల గురించి ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్‌కు కనీస అవగాహన లేదన్నారు. ప్రపంచంలోని రాజకీయ పార్టీల నేతలకు అబద్ధాల పోటీ పెడితే కెసిఆర్ అండ్ కంపనీకి మొదటి బహుమతి రావడం ఖాయమన్నారు. ప్రజల అవసరాలను పక్కకు పెట్టి కుటుంబ పాలనకు పెద్ద పీట వేసిన కెసిఆర్ పాలనకు చరమగీతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

గవర్నర్ నరసింహన్‌కు బెంజ్‌కారు

- రూ. 1.70 కోట్లతో కొనుగోలు

చేయాలని ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భద్రతా కారణాల దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌కు ఖరీదైన కొత్తకారును సమకూర్చింది. సుమారు రూ.1.70 కోట్లతో సాధారణ పరిపాలన శాఖ ఈ కారును కొనుగోలు చేసింది. నెల రోజుల క్రితం రాజ్‌భవన్ నుంచి అందిన ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. ఈ కారుకు అవసరమైన మొత్తాన్ని విడుదల చేస్తూ బుధవారం ఆర్థికశాఖ జీవో విడుదల చేసింది. 2017-18 నుంచి నిధులు విడుదల చేసినట్లు పేర్కొంది. సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి అర్విందర్ సింగ్ స్వయంగా మోడల్ ఎస్-450 బెంజ్ కారును రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు అప్పగించారు.

పపువా గునియాలో భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

కొన్ని ప్రాంతాలు కొండ ప్రాంతాల్లోని ఇళ్లు కొన్ని కొట్టుకుపోయాయని సమాచారం. ఇప్పటికే రెడ్‌క్రాస్ వంటి సహాయక బృందాలు రంగంలోకిదిగి బాధిత కుటుంబాలకు సహాయం అందిస్తున్నారని, కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు సమాచారం. న్యూ గునియాప్రాంతాలకు సరైన రోడ్లు, వసతి సౌకర్యాలు కొరవడ్డాయని, వెంటనే భూకంపంలాంటి జాతీయ విపత్తులకు స్పందించడానికి సమయం పట్టవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. భూకంప ప్రాంతంలో సమాచార వ్యవస్థ మెరగవడానికి సమయం పట్టవచ్చని, వేలాది మంది బాధితులకు సహాయక బృందాలు ఆహారం, తదితరాలు అందజేస్తున్నారని న్యూజిలాండ్ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి విన్‌స్టన్ పీటర్ పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగుల డీఏ పెంపు

(మొదటిపేజీ తరువాయి)

పెన్షనర్లకు అమలు చేయనున్నారు. దీని వల్ల దేశంలోని 48.41లక్షల మంది కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, 61.17 లక్షలమంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుంది. ప్రభుత్వ ఖజానాపై అదనంగా ఏడాదికి 6077.72 కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. 14నెలలక గాను 7090.68కోట్ల అదనపు భారం పడనుంది. ఏడో వేతన సంఘం ఫార్ములాకు అనుగుణంగా ఈ పెంపును నిర్ణయించారు.



నాలుగు వరుసల ఆర్వోబీలకు లైన్ క్లియర్

- 50:50 దామాషాలో నిధుల కేటాయింపు
- రాష్ట్ర మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో నాలుగు వరసల రోడ్డు ఓవర్ బ్రిడ్జీ (ఆర్ఓబీ)ల నిర్మాణానికి రైల్వేశాఖ అంగీకారం తెలిపిందని రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 50 : 50 నిష్పత్తిలో రైల్వేశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులు భరిస్తాయని పేర్కొన్నారు. రోడ్ అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైల్వే పరంగా చేపడుతున్న ప్రాజెక్టులపై రాష్ట్ర రహదారుల శాఖ, రైల్వే అధికారులతో మంత్రి బుధవారం ఖమ్మంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 460 లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్ఓబీలు చేపట్టాలని రైల్వే శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, వాటిని దశలవారిగా చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. మొదటి దశలో ఈ సంవత్సరం 52 ఆర్ఓబీలను రూ. 2,700 కోట్లతో చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేశామని తెలిపారు.లెవల్ క్రాసింగుల వద్ద ప్రమాదాల నివారణకు , ట్రాఫిక్ అంతరాయాలు తగ్గించేందుకు ప్రభుత్వం పరంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాత ఆర్ఓబీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, హైదరాబాద్ శివారు ప్రాంతమైన మియా పూర్ - పటాన్‌చెరువు వద్ద రైల్వే టెర్మినల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పరి శీలనలో ఉన్నాయని తుమ్మల తెలియజేశారు. ఎంఎంటీఎస్ పనులు 2018 కి పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. అంతకు ముందు భద్రాచలం - కొవ్వూరు బ్రాడ్ గేజ్ ను ప్లాన్‌ను మంత్రి పరిశీలించారు. భద్రాచలం రోడ్డు నుండి సత్తుపల్లి వరకు అక్క డి నుండి దమ్మపేట, జీలుసమిల్లి (తెలంగాణ సరిహద్దు) వరకు 105 కిలో మీటర్ల అలైన్‌మెంట్‌ను చూశారు. మంత్రి వెంట రైల్వే చీఫ్ ఇంజినీర్ జీవీ రమణా రెడ్డి, సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ జేవీఎల్ గణపతి, రహదారులు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ పింగిలి సతీష్ ఇతర అధికారులు లింగయ్య తదితరులు ఉన్నారు.

న్యాక్‌కు విశ్వకర్మ అవార్డు
డీజీ బిక్షపతిని అభినందించిన మంత్రి

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్ (న్యాక్) కు ప్రతిష్ఠాత్మకమైన సీఐడీసీ విశ్వకర్మ అవార్డు 2018 వచ్చిన సందర్భంగా అకాడమీ డైరెక్టర్ జనరల్ బిక్షపతిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. నిర్మాణ రంగంలో నైపుణ్య అభి వృద్ధికి గానూ న్యాక్ చేసిన విశేష కృషికి గానూ ఈ అవార్డును బిక్షపతి అందు కున్నారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ఒకకార్యక్రమంలో కన్స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీఐడీసీ) చైర్మన్ డాక్టర్ పీఎస్ రానా చేతుల మీదుగా బిక్షపతి అందుకున్నారు. బిక్షపతితో పాటు న్యాక్ అధికారులు పి గంగాధర్, శాంతిశ్రీ కూడా అవార్డును స్వీకరించారు. 2012,2016 లలో కూడా న్యాక్ సంస్థకు ఈ అవార్డు లభించింది.

కాళేశ్వరంతో తెలంగాణ సస్యశ్యామలం

- జీవనదులుగా మారుతున్న కాలువలు
- గత ప్రభుత్వాలు నీళ్లిచ్చే ఉద్దేశంతో నిర్మాణాలు చేపట్టలేదు
- నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట, ప్రభన్యూస్ : ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకులు ప్రాజెక్టులు రైతులకు నీళ్ళిచ్చే ఉద్దేశంతో నిర్మాణాలు చేయలేదని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం శనిగరం మద్యతరగతి ప్రాజెక్టు, తోటపల్లి రిజర్వాయర్, తోటపల్లి లిఫ్ట్ పథకం, మోయె తుమ్మెద వాగుపై అక్యువ్ డెక్ట్, గౌరవెల్లి రాజర్వాయర్ పంప్‌హౌజ్, టర్నెల్, సర్జ్‌పుల్, కెనాల్ పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరం ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి 75శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు.

ఒకప్పుడు ప్రాజెక్టులంటే కలగా మిగిలేవని, నేడు టీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులంటే నిజమని నిరూపించడం జరిగింద న్నారు. ఎవరడ్డుపడ్డా వచ్చే వర్షకాలానికి కాళేశ్వరం నీళ్ళతో బీడు భూములను తడుపుతామన్నారు. ప్రాజెక్టుల్లో భూమి కోల్పోయిన భూనిర్వాసితులకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎకరాకు రూ.2 లక్షల నష్టపరిహారం ఇస్తే తమ ప్రభుత్వం రూ. 7 లక్షల వరకు ఇచ్చి రైతులకు అండగా నిలి చిందన్నారు. కాళేశ్వరం తొలి ఫలితం హుస్నాబాద్ తదితర దుర్భిక్షప్రాంతాలకు అందు తుందన్నా రు. సిరి సిల్ల, హుస్నా బాద్, మాన కొం డూర్, ఇల్లంత కుంట, స్టేషన్ ఘణ్ పూర్, అసెం బ్లీ నియోజ కవర్గా లను సస్య శామలం చేయడమే కేసీఆర్ లక్ష్య మన్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో నిర్వహిస్తున్న గౌరవెల్లి సాగునీరు ప్రాజెక్టు ద్వారా యాసంగిలో 75వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మిడ్ మానేరు ద్వారా 75వేల ఎకరాలకు అందివ్వనున్నట్లు మంత్రి తెలిపారు. 8.3టీఎంసీల నిలువ సామర్థ్యంతో సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందించేలా గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందన్నారు. 12కి.మీ.ల టర్నెల్ పనుల్లో 6కి.మీ.ల టర్నెల్ పనులు పూర్తి కాగా, 75కి.మీ.లకు గాను 73కి.మీలు పూర్తి అయిందన్నారు. 2కి.మీ.ల పనులకు గాను మిగిలిన భూసేకరణ పనుల ను పూర్తి చేయాలని సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల కలెక్టర్ లను మంత్రి ఆదేశించారు. గౌరవెల్లి ప్రాజెక్టు క్రింది సిల్లింగ్ భూములలో మోకా మీద ఉన్న వారికి ప్రభు త్వం తరుపున పూర్తిగా సహకరిస్తున్నామని మంత్రి భరోసా ఇచ్చారు. వరద కాలువలన్ని జీవ నదులుగా మారనున్నాయన్నారు. మంత్రి వెంట ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీష్ కుమార్, టీఆర్ఎస్ నాయకులు పేరియాల రవీందర్ రావు తదితరులు ఉన్నారు.

ఇలాగైతే కష్టం..

- మీ పని కూడా మీరు చేయకపోతే ఎలా..!
- యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ఎంత వరకు వచ్చింది
- అధ్యాపక పోస్టులపై ఎందుకు మెలిక పెడుతున్నారు?
- వీసీల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం గరం గరం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: విశ్వవిద్యాలయాల్లో జరగాల్సిన పనులు జరగడం లేదు... వీసీలుగా మీరు నిర్వహిం చాల్సిన పనిని సక్రమంగా నిర్వహించడం లేదు... ప్రభుత్వం ఏమాత్రం జోక్యం చేసుకోకపోయినా పనులు చేయడం లేదంటే లోపం ఎక్కడుంది.. అని విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి వీసీల సమావేశం లో ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలు పార దర్శకంగా పని చేయడం లేదు.. పరీక్షల నిర్వహణలో సమస్యలు.. పిహెచ్‌డీ అడ్మిషన్లల్లో అవకతవకలు.. ఇలా అన్నిం టిలోనూ సమస్యలే ఉంటున్నాయి. వీటిని పరిష్కరించాల్సిన వీసీలు వాటిని పరిష్కరించకపోవడంతో ప్రభుత్వానికి తలవంపులు వస్తున్నాయని మండి పడ్డారు. బుధవారం వీసీల సమావేశం రూసా కార్యా లయంలో జరిగింది. సమావేశానికి 14 యూని వర్సిటీల వీసీలు హాజరయ్యారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి, ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య, కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్‌తోపాటు యూనివర్సిటీల వీసీలు పాల్గొన్నారు.

గతంలో వీసీలతో గవర్నర్ సమావేశం నిర్వహించిన సందర్భంలో తీసుకున్న నిర్ణయాల్లో ఒక్కటీ కూడా ఏ వీసీ అమలు చేయలేదని.. అప్పుడు నిర్ణయించినట్టుగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్‌ను ఎవరు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు గవర్నర్ తిరిగి ఎప్పుడు సమావేశం పెడుతున్నారని.. ఏటీఆర్ ఏమైందని అడుగు తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని వివిధ యూని వర్సిటీల్లో ఉన్న అధ్యాపక ఖాళీల భర్తీ కోసం 1561 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వాటిని భర్తీ చేయడం కోసం ఏ ఒక్క యూనివర్సిటీ కూడా ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదని మండి పడ్డారు.

యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీ విషయంలో ఉపముఖ్యమంత్రి అత్తమీది కోపం దుత్తమీది తీర్చినట్టుగా ఉందని వీసీలు గుసగుసలాడుతున్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను జారీ చేయాలని అనుకున్న సమయంలో ఉన్నత విద్యా శాఖ కార్యాలయం నుంచి యుజిసి కొత్త మార్గదర్శకాలు వచ్చాయి.. వాటిపై అభిప్రాయాలు చెప్పాలని లేఖలు వచ్చాయని, తద్వారా నోటిఫికేషన్లు ఆగిపోతే అదేదో తాము ఆపేసినట్టు తమపై డిప్యూటీ సీఎం మండిపడుతున్నారని అనుకుంటున్నారు. తాము అధ్యాపక పోస్టులను భర్తీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని అయినా ప్రభుత్వం నుంచి వచ్చే లేఖల ఫలితంగానే ఆలస్యం అవుతోందని చెబుతున్నారు.

జూన్ నెలాఖరులోగా అధ్యాపక పోస్టుల భర్తీ

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యా పక పోస్టులను జూన్ నెలాఖరులోగా భర్తీ చేయాలని విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి వీసీలను ఆదేశించారు. యూనివర్సిటీలకు కేటాయించిన రూ.420 కోట్లను మార్చి 31లోపు ఖర్చు చేయాలని ఆదేశించారు. ఇప్పటి ఎందుకు ఖర్చు చేయలేకపోయారని, వాటిని వెంటనే ఖర్చు చేసేలా చూడాలన్నారు. 1561 పోస్టుల భర్తీలో వచ్చిన సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించామని, వాటిపై రోస్టర్ పాయింట్లు, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు నిర్ణయించుకొని వెంటనే ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్లు జారీ చేసి జూన్ నెలాఖరులోగా భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. యూనివర్సిటీలు, వాటి అనుబంధ కాలేజీల్లో విద్యార్థులు, అధ్యాపకులు హాజరు కోసం బయోమెట్రిక్ మెషిన్లను ఏర్పాటు చేయాలన్నారు.

పాస్ పుస్తకాలపై స్పష్టత

- ఐదు టెండర్లు సక్రమం
- తిరస్కరణకు గురైన మూడు బిడ్లు
- గురు, శుక్రవారాల్లో ఖరారు
- 9లోగా రైతు సమాచారం
- చెక్కుల పంపిణీ

ఆంధ్రప్రభ, హైదరాబాద్: పట్టాదార్ పాస్ పుస్తకాల అంశం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ప్రభు త్వం జారీ చేసిన టెండర్ గడువు ఈ నెల 5తో ముగి యగా మొత్తం 8 సంస్థలు బిడ్లను దాఖలు చేశాయి. కాగా ఇందు లో నుంచి ప్రభుత్వ పరిశీలన తర్వాత 3 సంస్థలు డిస్ క్వాలిఫై అయ్యాయి. వీటిని తిరస్కరిం చిన ప్రభుత్వం అర్హతలు సాధించిన 5 సంస్థలకు చెందిన టెండర్ బిడ్లను పరిశీలిస్తోంది. గురు, శుక్ర వారాల్లో అర్హత సాధించిన సంస్థకు టెండర్ కట్టబెట్టి ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. ఆ తర్వాత మొత్తం 21 రోజుల పనిదినాల్లో పాస్ పుస్తకాలను ముద్రించి ఇవ్వాలనే షరతును ప్రభుత్వం విధించే అవకాశం ఉంది. సాంకేతిక అర్హతలు, ముద్రణా ప్రమాణాలు, అందరికంటే తక్కువ ధర కోట్ చేసిన వారికి టెండర్‌ను అప్పగించనున్నారు.

మార్చి 11నుంచి 30 జిల్లాల్లో 71.75 లక్షల మంది రైతాంగానికి కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు కం టైటిల్ డీడ్‌లను అందించాలన్న సర్కార్ యోచనకు టెండర్లతో జాప్యమైంది. నాలుగు దశల్లో టెండర్లను పిలవగా తొలుత టెండర్‌ను సొంత చేసుకున్న కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ అగ్రిమెంట్‌నుంచి వైదొలిగింది. ఆ తర్వాత తాజాగా తెలంగాణ రైట్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదార్ పాస్ బుక్స్ సవరణ చట్టం- 2018 ని అమలులోకి తెస్తూ ప్రభుత్వం గత బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత టెండర్లు ముగిసిన తర్వాత ఒక్కో మండలంలో తొలుత 5 గ్రామాల్లో వీటిని పంపిణీ చేసేలా కార్యాచరణ చేస్తున్నా రు. మార్చి 11 నుంచి దశలవారీగా 71 లక్షల వ్యవ సాయ ఖాతాలకు కొత్త పాస్ పుస్తకాలు అందనున్నాయి.




భూ దస్త్రాల ప్రక్షాళన తర్వాత ఎల్ఆర్‌యూపి సమాచారం అంతా ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో పొందు పరుస్తున్నారు. తహశీల్దార్ల డిజిటల్ సంతకాలు, రైతుల ఫొటోల సేకరణ ఊపందుకుంది. ఆధార్ నెంబర్ జత చేయడంలో కొందరు విముకత చూపుతుండటంతో కొంత ప్రతిష్టంభన నెలకొంది. భూ దస్త్రాల పరిశీలన పూర్తయిన తర్వాత గ్రామాలనుంచి సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ చేయడంలో అనేక సమస్యలు ఎదురయ్యాయి.

ప్రభుత్వం 100 రోజులపాటు నిర్వహించిన భూరికార్డుల పరిశీలనతో 1,12,077 చ.కి రాష్ట్ర భూభాగానికి చెందిన వివరాలు ఖాతాల వారీగా ప్రభుత్వం సేకరించింది. 2.80 కోట్ల ఎకరాల భూభాగంలో 1.42 కోట్ల ఎకరాల వివాదరహిత వ్యవసాయ భూమి ఉందని గుర్తించగా, 17.89లక్షల ఎకరాల భూమి వివిధ న్యాయపరమైన వివాదాల్లో ఉన్నట్లుగా తేల్చారు. మరో 11.95లక్షల ఎకరాల భూమి రైతుల వద్ద పడావుగా ఉండి సేద్యానికి దూరంగా ఉందని గుర్తించారు. 84.00లక్షల ఎకాల చెరువులు, కుంటలు, కాలువలు, రైల్వేలైన్, సబ్‌స్టేషన్లు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల కింది భూములు, కోర్టు కేసుల్లోని అటవీ భూములు ఉన్నాయి. దాదాపు 97 వేల ఎకరాల అసైన్డ్ భూముల్లో మూడో వ్యక్తులు కబ్జాల్లో ఉన్నట్లుగా తేలింది. 9న సాయంత్రానికి వివరాలందజేయాలని రెవెన్యూ స్పెషల్ సీఎస్ రాజేశ్వర్ తివారీ కలెక్టర్లు, జేసీలకు ఆదేశించారు. బుధవారం ఆయన సచివాల యం నుంచి అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల వివరాలు, పట్టా భూమి వివరాలు, సర్వే నెంబర్లు, ఖాతా నెంబర్ల వంటి నిర్దేశిత అంశాలను, ఆయా ఫార్మాట్‌లలో రూపొందించి సాఫ్ట్ కాపీని అందించాలని ఆదేశించారు. ఆ తర్వాత ఆయా వివరాలన వ్యవసాయ, ఆర్థిక శాఖలకు అందజేస్తామని ఆయన చెప్పారు.

29న యాదవ బహిరంగ సభ

- ఏర్పాట్లు పూర్తి
- 10 లక్షల మంది గొల్ల, కురమల సమక్షంలో సీఎం కేసీఆర్‌కు సన్మానం: మంత్రి తలసాని శ్రీనివాస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఏప్రిల్ 29న సికింద్రాబాద్‌లో జింఖానా గ్రౌండ్‌లో 10 లక్షల మంది యాదవ, కుర్మలతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ వెల్లడించారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో యాదవ, కుర్మ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి గొల్ల, కుర్మలు తరలి వచ్చేవిధంగా చర్యలు తీసుకుం టున్న ట్లు ఆయన తెలిపారు. ఇందు కోసం గొల్ల, కుర్మ నాయ కులతో ఉమ్మడి జిల్లాస్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. ఈ సమ న్వయ కమిటీల సభ్యులు ఈనెల 11 నుంచి జిల్లాలకు వెళ్ళి జిల్లా, డివి జన్, మండల స్థాయిలో సమావేశాలు, బహిరంగ సభ ఉద్దేశాన్ని వివరించి సభకు అధిక సంఖ్యలో తరలివచ్చే విధంగా చూస్తారని తెలిపారు. బహిరంగ సభ గురించి వాల్‌పోస్టర్లు, వాల్ పెయింటింగ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు వివరించారు. అడగకుండానే రూ.5వేలకోట్ల ఖర్చుతో గొల్ల, కుర్మలకు గొర్రెలను పంపిణీ చేస్తున్నారని, ఇప్పటి వరకు 47 లక్షల గొర్రెలను పంపిణీ చేయగా, వాటి వాళ్ళ 15 లక్షల గొర్రె పిల్లలు జన్మించినట్లు తెలిపారు. దీనితోపాటు సంక్షేమ భవనాల కోసం కోకాపేటలో ఎంతో విలువైన 10 ఎకరాల భూమి, రూ.10 కోట్లు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. అంతేకాకుండా కుర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేశంకు ఎమ్మెల్సీని ముఖ్యమంత్రి ప్రకటించారని, యాదవ కులస్తుడిని రాజ్యసభకు పంపుతామని తెలిపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇన్ని చేసిన కేసీఆర్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ సభ తర్వాత రాజకీయంగా యాదవ, కుర్మ దశ మార బోతుందని అన్నారు. ఈ సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, గొర్రెల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ రాజయ్య యాదవ్, యాదవ మహిళా సంఘం అధ్యక్షురాలు రాగం సుజాత, యాదవ సంఘాల నాయకులు చింతల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నారం బ్యారేజీను సందర్శించిన జీఎస్ఐ అధికారులు

మహదేవ్‌పూర్, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు సందర్శించారు. రెండు రోజుల సర్వే చేసిన అధికారులు, ఇంజనీర్లకు బ్యారేజ్ పొడువుక కరకట్టలు కట్టాలి, ఎంత ఎత్తుకట్టలని ఇంజనీర్లకు సూచించారు. జీఎస్ఐ అధికారి అజయ్‌కుమార్, ఇంజనీర్లు ఎస్ఈ సుధాకర్‌రెడ్డి, డీఈఈ యాధగిరి, జేఈఈ శ్రావణ్ తదితరులు ఉన్నారు.

నేడు ప్రభుత్వాధికారులతో అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సభ నిర్వహణ, ఏర్పాట్లపై శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసన సభస్పీకర్ మధుసూదనాచారి, కార్యదర్శి నర్సింహాచార్యులు ప్రభుత్వ ఉన్నతాధికారులతో గురువారం సమావేశం కానున్నారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.జోషి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హాలతో సమావేశం అవుతారు. అనంతరం 11.30 గంటలకు హోంశాఖ కార్యదర్శి, డీజీపీలతో సమావేశమై తగిన ఆదేశాలు ఇస్తారని అసెంబ్లీ కార్యదర్శి తెలిపారు.

బెట్టు వీడని విపక్షాలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు మూడో రోజు తుడిచిపెట్టుకుపోయాయి. విపక్షా లు, మిత్రపక్షా లు శివసేన, టిడిపి ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. బుధవారం లోక్‌సభ కార్య కలాపాలు ప్రారంభం కాగానే కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై చర్చించాలని వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపాయి. తమిళనాడు రామస్వామి నాయకర్ విగ్రహాల ధ్వంసంపై డిఎంకె, త్రిపురలో లెనిన్ విగ్రహం ధ్వంసంపై సిపిఎం నిరసన వ్యక్తం చేశాయి. రిజర్వేషన్ల కోటా పెంచాలని టిఆర్ఎస్, ఏపి విభజన చట్టం హామీలు అమలు చేయాలని టిడిపి, ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్సిపి, కావేరి నదీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడి ఎంకె ఎంపీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. ప్రశ్నోత్తరాల సమయం జరగకుండా అడ్డుకున్నారు. సభ కార్యకలాపాలు సాగేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పదే పదే విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు పట్టించుకోకపోవడంతో సభ పదేపదేవాయిదా పడింది. ఇటు రాజ్యసభలోనూ కాంగ్రెస్, తృణమూల్, టిడిపి, ఏఐడిఎంకె ఆందోళన కొనసాగించాయి. కాంగ్రెస్, టిడిపి, టిఆర్ ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.

అఖిలపక్ష సమావేశం నిర్వహించిన స్పీకర్

వరుసగా మూడోరోజూ పార్లమెంటు సమావేశాలు స్తంభించిపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీ నేతల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై వాయిదా తీర్మానం కింద చర్చ జరగాలని కాంగ్రెస్ పార్టీ నేత మల్లిఖార్జున ఖర్గే డిమాండ్ చేశారు. అయితే ఇప్పటికే 193కింద చర్చకు అనుమతించారని ప్రభుత్వం చెప్పగా, వాయిదా తీర్మాంపై చర్చ జరగాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. సభలో ఆందోళన చేస్తున్న టిడిపి, వైఎస్సార్సిపి, శివసేన, డిఎంకె, ఏఐడిఎంకె పార్టీల అభిప్రాయాలను స్పీకర్ తెలుసుకున్నారు. సభ సజావుగా నడిపేందుకు సహకరిస్తే అన్నిఅంశాలను చర్చించేందుకు వీలు కలుగుతుందని స్పీకర్ సుమిత్రా మహాజన్ చెప్పారు. రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నట్లు ఆశాభావం వ్యక్తంచేశారు.

మన్మోహన్‌తో ఏపీసీసీ భేటీ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఢిల్లీలో ఈనెలలో జరగనున్న ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశంపై చర్చించాలని ఏపీసీసీ నేతలు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కోరారు. పల్లంరాజు, రఘువీరారెడ్డి, కేవీపీ రామచంద్రరావు, సుబ్బిరామిరెడ్డి, జేడీ శీలం, శ్రీరామచంద్రయ్య, గిడుగు రుద్ర రాజుతో కూడిన ఏపీసీసీ నేతల బృందం బుధవారం సాయంత్రం 6 గంటలకు మన్మోహన్‌ను ఆయన నివాసంలో కలిసింది. మార్చి 16 నుంచి 3 రోజుల పాటు ఏఐసీసీ ప్లీనరీ సమావేశాలు జరగున్నాయి. అందుకు సంబంధించిన రాజకీయయ తీర్మానాల్లో స్పెషల్ స్టేటస్ అంశాన్ని చేర్చాలని వారు మన్మోహన్‌కు విజ్ఞప్తి చేశారు. రెండోరోజూ కాంగ్రెస్ నేతలు పార్లమెంట్ స్ట్రీట్‌లో ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షను చేపట్టారు. దీనికి సీనియర్ నేత మల్లిఖార్జు ఖర్గే, డీఎంకే నాయకురాలు కనిమొళి, మహిళా కాంగ్రెస్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ సుస్మితా దేవ్‌తో పాటు ఇతర రాజకీయ నాయకులు, విద్యార్థి, ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ప్లీనరీ సమావేశాల్లో ప్రత్యేక హోదా అంశంపై చర్చ జరిపి నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

హోదా కోసం ఎందాకైనా...

• మూడోరోజు వైసీపీ ఎంపీల ఆందోళన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా పోరులో అధికార, విపక్ష పార్టీలు పోటాపోటీగా ఆందోళన చేస్తున్నాయి. రోజులాగే బుధవారం కూడా వైఎస్సార్సీపీ ఎంపీలు తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. టీడీపీ ఎంపీలు గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తుండగా, వైఎస్సార్సీపీ ఎంపీలు గేట్ నంబర్ 1 వద్ద నిలబడి నిరసన తెలిపారు. కేంద్ర విధానాలతో పాటు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీరునూ వారు తప్పుబట్టారు. రాజీ పడడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వైఎస్సార్సీపీ ఎంపీలు విమర్శించారు. హోదా ఇచ్చేదే లేదని కేంద్రం రెండేళ్ల క్రితమే తేల్చేసిందని గుర్తు చేశారు. అయినా హోదా కోసం పోరాడాలని నిర్ణయించుకున్నామని... హోదా వచ్చే వరకూ పోరాటాన్ని ఆపేదే లేదన్నారు. ప్యాకేజీ విషయంలో కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలనీ డిమాండ్ చేశారు.

స్వలాభం కోసమే ప్యాకేజీ అడిగారు : విజయసాయిరెడ్డి

రాజ్యసభలో మంగళవారం నేను అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖా సహాయ మంత్రి చాలా స్పష్టంగా ఒక విషయం చెప్పారు. ప్రత్యేక హోదా గతంలో కలిగిన రాష్ట్రాలకు పన్నులను రీఫండ్ చేస్తున్నారు. పన్ను చెల్లించకుండా మినహాయింపునిచ్చినా, చెల్లించి రిఫండ్ చేసినా ఒకటే. స్వలాభం కోసమే నాడు చంద్రబాబు ప్యాకేజీ కోరారు. హోదాతో నాడు ప్రయోజనం లేదని అన్నారు. హోదా రాకపోవడానికి కారణం చంద్రబాబు నాయుడు. నాడు ప్యాకేజీ కి అంగీకరించారు కాబట్టి హోదా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి తప్పుకుంటే ఏపీకి హోదా వస్తుంది.

అసెంబ్లీ సీట్ల పెంపు కుదరదు

• రాజ్యసభలో కేంద్రం సమాధానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపు ఇప్పట్లో కుదరదని కేంద్ర ప్రభుత్వం మరోసారి తేల్చి చెప్పింది. తెలుగుదేశం రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు ధర్మపురి శ్రీనివాస్ విడి విడిగా అడిగిన ప్రశ్నలకు రాజ్యసభలో కేంద్ర హోంశాఖ ఈ మేరకు సమాధానమిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3) ప్రకారం 2026 తర్వాత ప్రచురించే జనాభా లెక్కల ఆధారంగా తదుపరి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపు లేదా సర్దుబాటు చేయాల్సి ఉంటుందని హోంశాఖ సహాయ మంత్రి హన్సరాజ్ గంగారాం ఆహిర్ లిఖితపూర్వక జవాబులో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26(1) ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంచాలంటే 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల వరకు వేచి ఉండాలని, లేదంటే ఆ మేరకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 170ని సవరించాలని ఆయన స్పష్టం చేశారు. నిజానికి 2026 తర్వాత జరిగే జనాభా లెక్కలు 2031లోనే. అవి ప్రచురించిన తర్వాత ఇటు పార్లమెంటు, అటు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్యల్లో మార్పులు చేర్పులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే విభజన చట్టంలో మాత్రం ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సీట్లను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ సీట్లను 119 నుంచి 153కు పెంచాల్సిందిగా ఉందని, ఆ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విజ్ఞప్తులు కూడా అందాయని జవాబులో కేంద్రం పేర్కొంది. అయితే రాజ్యాంగ సవరణ చేయకుండా ఈ మేరకు సీట్ల పెంపు సాధ్యపడదని స్పష్టం చేసింది.

హోదా లేదు.. ప్యాకేజీ మాత్రమే

• రెవెన్యూ లోటు కింద 1600 కోట్లు ఇస్తాం • ప్యాకేజీ కింద ఈఎపి, నాబార్డు ద్వారా నిధులు ఇప్పిస్తాం • రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి • పన్ను రాయితీలు కోరితే బీహార్, జార్ఖండ్ కూడా అడుగుతాయి• రాజధానికి అడ్వాన్స్‌గా 2500 కోట్లు ఇచ్చాం • పోలవరానికి 5వేల కోట్లు ఇచ్చాం • కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పాత పాట



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదాకు బదులుగా ఆర్థిక ప్రయోజనాలకు ఇచ్చేందుకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ పునరుద్ఘాటించారు. విదేశీ సంస్థల ద్వారా గానీ, నాబార్డు ద్వారా గానీ హోదాకు సమానమైన నిధులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వమే దీనిపై నిర్ణయం తీసుకోవాలని తేల్చి చెప్పారు. బుధవారం న్యూఢిల్లీలో నార్త్‌బ్లాక్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ విలేకరుల సమావేశం నిర్వహించారు. విభజనతో ఆంధ్రప్రదేశ్ నష్టపోయిన నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ రూపంలో సాయం చేస్తామని స్పష్టంచేశారు. 14 ఆర్థిక సంఘం సిఫారసుల నేపథ్యంలోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని మరోసారి స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా అంటే 90 :10 శాతం నిధుల ఫార్ములా అని చెప్పారు. కేంద్రం అమలు చేసే పథకాలకు 90శాతం కేంద్రం భరిస్తుందని, సాధారణ రాష్ట్రాలకైతే 60 శాతం నిధులను భరిస్తుందన్నారు. ప్రత్యేక హోదా వల్ల అదనంగా వచ్చే 30శాతం నిధులను మరో మార్గం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రత్యేక హోదా అనేదే లేదని స్పష్టం చేశారు.

ప్రత్యేక హోదా అనేది లేనందువల్ల దానికి సమానమైన నిధులు ఏపీకి ఇవ్వాలని నిర్ణయించామన్నారు. 90 శాతం నిధులను మరో మార్గంలో ఇస్తామన్నారు. హోదా అనేపదం లేకుండా 30శాతం అదనపు నిధులను ఇస్తామని స్పష్టం చేశారు. విదేశీ సంస్థల నిధుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు నిధులు ఇప్పిస్తామని చెప్పారు. దీనిలో 90శాతం నిధులను కేంద్రమే తిరిగి చెల్లిస్తుందని చెప్పారు. దీనికి తాము కట్టుబడిఉన్నామని స్పష్టం చేశారు. అయితే ఈఏపీ ద్వారా కాకుండా నాబార్డు ద్వారా ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదించిందన్నారు. అయితే ఇలా ఇప్పిస్తే కేంద్రానికి, రాష్ట్రానికి ద్రవ్యలోటు పెరుగుతుందన్నారు. ద్రవ్యలోటు పెరిగి దుష్పరిణామాలు ఏర్పడడం మంచిది కాదన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా స్పెషల్ పర్పస్ వెహికిల్ ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. ఎస్పీవి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే దానికి నేరుగా నాబార్డు ద్వారా నిధులు ఇప్పిస్తామని చెప్పారు. నాబార్డుకు తాము 90శాతం నిధులును తిరిగి చెల్లిస్తామని వెల్లడించారు. ఈఏపీ నా లేదంటే నాబార్డు ద్వారా ప్రత్యేక హోదాకు సమానమైన ఆర్థిక ప్రయోజనాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీనిపై రాష్ట్రప్రభుత్వం సానుకూల నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. ఏపికి ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వమని ఎక్కడా కూడా చెప్పలేదన్నారు. ప్రత్యేక హోదా వల్ల అదనంగా వచ్చే 30శాతం నిధులను వేరే పద్ధతిలో తీసుకోవాలని మాత్రమే కోరామన్నారు. ఆ నిధులను ఈఎపినా, లేక నాబార్డా ద్వారానా అన్నది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలన్నారు. ఏపికి ప్రత్యేక సాయం అందిస్తామని స్పష్టం చేశారు. రెవెన్యూ లోటు భర్తీకి సంబధించి 2013-14 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4000 కోట్లు చెల్లించామన్నారు. కేవలం 138 కోట్లు బకాయి ఉందన్నారు. అయితే 2015-16 ఫార్ములా ప్రకారమైతే 1600 కోట్లు వస్తుందన్నారు. ఈ రెండింటికి తాము సిద్ధంగాఉన్నామన్నారు. 2015-16 ఫార్ములా ప్రకారం రాష్ట్రానికి ప్రయోజనం జరుగుతుందన్నారు. ఇది చాలా చిన్న సమస్య అన్నారు. ఇక కేంద్ర సంస్థల ఏర్పాటు ప్రక్రియ జరుగుతుందోన్నారు.

పన్ను రాయితీల కింద పెట్టుబడి అలవెన్స్, తరుగుదల అలవెన్స్‌లను ఇప్పటికే ప్రకటించామని చెప్పారు. మొదటి రెండు సంవత్సరాలకు దీనిని ప్రకటించామన్నారు. మరిన్ని పన్ను రాయితీలు అంటే, ఏపి కంటే తక్కువ రెవెన్యూ ఉన్న రాష్ట్రాలు కూడా అడిగేఅవకాశముందన్నారు. బీహార్ లాంటి రాష్ట్రాలు కూడా అడుగుతాయన్నారు. జాతీయ స్థాయిలో తాము అన్ని రాష్ట్రాలను చూడాల్సి ఉందన్నారు. ప్రత్యేక ప్యాకేజీ, రెవెన్యూ లోటు ఈ రెండు ముఖ్యమైన అంశాలు పరిష్కారం కావాలన్నారు. ప్రత్యేక హోదా అంటే అదనంగా 30 శాతం ఆర్థిక ప్రయోజనాలేనని అన్నారు.రాజధానికి ఇప్పటికే అడ్వాన్స్ గా 2500 కోట్ల రూపాయలు ఇచ్చామని, త్వరలోనే దాని అభివృద్ధి జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. రైల్వే జోన్ సహా మిగిలిన అంశాలపై సానుకూలంగా ఉన్నామన్నారు. ఏపీకి ప్రత్యేక ఆర్థిక ప్రయోజనాలను అందించేందుకు రెడీగాఉన్నామన్నారు. పోలవరానికి ఇప్పటికే 5వేల కోట్లకు పైగా ఇచ్చామన్నారు. దానికి తగ్గట్లుగా అభివృద్ధి చేయాలన్నారు.

స్నేహానికి బీటలు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానితో మాట్లాడేందుకు తాను ప్రయత్నించానన్న విషయాన్ని వారి ప్రత్యేకాధికారికి (ఓఎస్‌డీ) తెలియజేశానని చంద్రబాబు అన్నారు. ఏపీ నుంచి కేంద్రమంత్రివర్గంలో ఇద్దరు మంత్రులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అశోక గజపతిరాజు కేబినెట్ మంత్రిగా ఉంటూ పౌర విమానయాన శాఖను నిర్వహిస్తుండగా, సుజనా చౌదరి సహాయ మంత్రిగా కొనసాగుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిగా పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటుచేసి ప్రకటించడంతో ఆగ్రహోదగ్రుడైన తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అందుబాటులో ఉన్న రాష్ట్ర మంత్రులు, ఢిల్లీలో ఉన్న ఎంపీలు, కేంద్ర మంత్రులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తాజా పరిణామాలపై చర్చించారు. రాష్ట్ర మంత్రులతో పాటు ఢిల్లీలో ఉన్న ఎంపీలు కేంద్రం నుంచి వైదొలగడమే మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. అరుణ్ జైట్లీ పాత పాటనే మళ్ళీ పాడారని ఇక ఎంతకాలం వేచిచూడకుండా తక్షణమే మంత్రి పదవుల నుంచి తప్పుకుంటేనే బాగుంటుందని వారు సూచించినట్టు తెలుస్తోంది. రాజీనామాల అంశంపై కేంద్రమంత్రి సుజనా చౌదరితో మాట్లాడిన చంద్రబాబు ఆయన అభిప్రాయాన్ని కూడా తీసుకున్నారు. అశోకగజపతిరాజు కేంద్ర మంత్రిమండలి సమావేశంలో ఉన్నందున ఆయనకు రాజీనామాల విషయాన్ని చెప్పి ప్రధాని మోడీకి ఫోన్ చేయాలని చంద్రబాబు భావించారు. గురువారం ఉదయం ఈ ఇరువురు మంత్రులు తమ రాజీనామాల లేఖలను ప్రధానమంత్రికి స్వయంగా అందజేయనున్నట్టు సమాచారం.

రాష్ట్రంలో బీజేపీ మంత్రుల రాజీనామా

కేంద్ర మంత్రులు ఢిల్లీలో తమ రాజీనామా లేఖలను సమర్పించిన మరు క్షణతే ఏపీ మంత్రివర్గంలో భాజపా తరపున ప్రాతి నిధ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ కామినేని శ్రీనివాస్, దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాల రావు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తమ రాజీనామాలను అందజేయనున్నారు. బుధవారం రాత్రి విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో సమావేశమైన బీజేపీ నేతలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి బుధవారం ఉదయమే ఈ ఇద్దరు మంత్రులు తమ రాజీనామా లేఖలను సిద్ధం చేసుకుని ఏ క్షణంలోనైనా వాటిని చంద్రబాబుకు అందజేయాలని ప్రతిపాదించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ చంద్రబాబు బుధవారం శాసనసభలో మాట్లాడారు. ఈ సందర్భంగా చేసిన సుదీర్ఘ ప్రసంగంలో ఎన్‌డిఎ నుంచి వైదొలిగే అంశాన్ని ప్రస్తావిస్తారని భావించిన భాజపా ఒకవేళ ఈ నిర్ణయం ప్రకటిస్తే అక్కడికక్కడే రాజీనామాలు చేయాలని ఆ పార్టీ మంత్రులు భావించారు. రాజీనామాలకు సిద్ధ పడాలని భాజపా అధినాయకత్వం ఈ ఇద్దరు మంత్రులను మంగళవారం రాత్రే ఆదేశించినట్టు ప్రచారం జరుగుతోంది.

ఢిల్లీలో కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ మీడియా సమా వేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించిన చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడినట్టు సమాచారం. ఈ సమయంలోనే కేంద్రంనుంచి వైదొలగాలని మానసికంగా నిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

హోదాపై మాట తప్పిన కేంద్రం

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో తెదేపా, భాజపా కలిసి ఎన్నికల బరిలోకి దిగాయి. అప్పటి ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్రమోడీ రెండు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఎన్నికలు ముగిసి ఫలితాలు విడుదలయ్యాక జరిగిన పరిణామాల్లో ఏపీకి చెందిన ఇరువురు ఎంపీలు కేంద్రమంత్రి పదవులను చేపట్టారు. తిరుమల వెంకన్న సన్నిధిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న నరేంద్రమోడీ తాము అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని, విభజన చట్టంలోని అన్ని హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరిగిన పరిణామాల క్రమంలో ప్రత్యేకహోదాకు బదులు అంతకన్నా మిన్నగా ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాల్లో భాగంగా ఫైనాన్స్ కమీషన్‌ను రద్దుచేసి ఆ స్థానంలో నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంస్థ ఏర్పాటయ్యాక రూపొందించుకున్న విధివిధానాల్లో భాగంగా కొత్తగా ఏ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వరాదని ప్రతిపాదించారు. అవసరమైతే హోదాకన్నా మిన్నగా ప్యాకేజీని ప్రకటించాలని కేంద్రానికి నీతి ఆయోగ్ సూచించింది. దీంతో ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని ప్యాకేజీని ఇస్తామని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఇందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం అంగీకరించలేదు. రాష్ట్రాన్ని విడదీసే సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వవలసిందేనని డిమాండ్ చేశారు. చివరికి కేంద్ర ప్రభుత్వం చంద్రబాబును ఒప్పించి హోదాకన్నా ఎక్కువగా ప్యాకేజీ ద్వారా రాష్ట్రానికి నిధులు కేటాయిస్తామని విభజన చట్టంలో హామీలన్నింటినీ నెరవేరుస్తామని భరోసా ఇచ్చింది. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీకి చట్టబద్ధత కల్పించాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. అలాగైతేనే ప్యాకేజీకి తాము అంగీకరిస్తామని తేల్చిచెప్పినా కేంద్రం మాత్రం చట్టబద్ధత కల్పించే విషయంలో ముందుకు రాలేదు.

చంద్రబాబు పోరాట బాట

రాష్ట్రానికి రావలసిన నిధులు, హోదాకు సంబంధించి ముఖ్యమంత్రి హోదాలో 29సార్లు చంద్రబాబు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టారు. చిట్టచివరిగా రెండు మాసాల క్రితం ప్రధాని మోడీని కలిసి తమ రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తోందని విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని రాజధానికి నిధులను సమకూర్చడం లేదని, ఆర్థిక లోటు భర్తీకి చర్యలు నామమాత్రంగా ఉన్నాయంటూ నిరసన వ్యక్తంచేశారు. ఏపీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామని ప్రధాని హామీ ఇచ్చినా అవి అమలు కాకపోవడంతో చంద్రబాబు కేంద్రంపై పోరాడాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈలోగా ఏపీలో విపక్ష పార్టీగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ హోదాపై ఉద్యమాన్ని ఉధృతం చేసింది. మరోవైపు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా పార్టీ తరపున ప్రత్యేక హోదా ఇవ్వవలసిందేనంటూ పట్టుబట్టారు. తాజాగా కేంద్రం ఇచ్చిన నిర్ణయాలపై సంయుక్త నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటుచేసి నివేదిక సిద్ధంచేశారు. ఆ నివేదికను ఆయన ఇప్పటికే ఏపీ సీఎం చంద్రబాబుకు పంపించారు.

రాజీనామాలు చేసి లోక్‌సభ, రాజ్యసభలో పోరాడితే సమావేశాలకు అడ్డు తగులుతున్నారంటూ సస్పెన్షన్ వేటు వేసే అవకాశం ఉందని, ఇలా చేస్తే రాష్ట్రానికి సంబంధించిన డిమాండ్లను కేంద్రం దృష్టికి, ప్రజల దృష్టికి తీసుకువెళ్ళలేమని కొందరు ఎంపీలు చంద్రబాబుతో జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో అభిప్రాయ పడినట్టు సమాచారం. లోక్‌సభ రెండవ దఫా సమావేశాలకు ముందు విజయవాడలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాజీనామాల అంశం ప్రస్తావనకు వచ్చినపుడు పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశిస్తే ఉన్నపలంగా ఈ క్షణంలో రాజీనామాకు సిద్ధమని అశోక గజపతి రాజు స్పష్టంచేశారు. మంగళవారం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన శాసనసభాపక్షసమావేశంలో 95 శాతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేంద్రం నుంచి బయటకు వద్దామన్న సంకేతాలు ఇచ్చారు. చంద్రబాబు మూడు ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అందజేశారు. ఇందులో 95 శాతం మంది కేంద్రం నుంచి బయటకు రావాలని సంకేతాలు ఇచ్చారు. శాసనసభలో బుధవారం చంద్రబాబు రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై మూడు గంటలపాటు చర్చించారు. కేంద్రం రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని తూర్పారబట్టారు. ప్రత్యేక హోదాకు సంబంధించి గత నాలుగేళ్ళుగా తాను చేస్తున్న పోరాటాన్ని వివరించారు.

ఎన్నికలకు ముందు జరిగిన ప్రచార సభల్లో పాల్గొన్న ప్రస్తుత ప్రధాని అప్పటి ఎన్‌డిఎ ప్రధానమంత్రి అభ్యర్థి నరేంద్రమోడీ ప్రత్యేక హోదా అంశంలో వెనక్కి తగ్గేది లేదని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. భాజపాను నమ్మి ఎన్నికల్లో ఆ పార్టీకి మద్దతు ఇవ్వడంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు చేసుకున్నామని పేర్కొన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి నాలుగేళ్ళు పూర్తవుతున్నా రాష్ట్రానికి సంబంధించిన విషయంలో ఏమాత్రం సానుకూల నిర్ణ యాలు తీసుకోలేదని అయినా రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగామని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి పదవులు కొత్తేమీ కాదని గతంలో 35 మంది ఎంపీలు గెలిచినా పదవుల కోసం వెంపర్లాడలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అందుకే తమ పార్టీకి చెందిన మంత్రులను రాజీనామా చేయాలని కోరినట్టు చంద్రబాబు తెలిపారు.

ఇదిలా ఉండగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత మూడు రోజులుగా తెదేపా, వైకాపా, లోక్‌సభ, రాజ్యసభలను స్తంభింపజేస్తున్నాయి. ప్రతిరోజూ పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ఎంపీలు తమ నిరసనను కొనసాగిస్తున్నారు. కేంద్రం గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక హోదా ఇవ్వాలని లేనిపక్షంలో తమ పార్టీకి చెందిన ఎంపీలు రాజీనామా చేస్తారని వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. హోదాపై ఏపీలో ప్రతిరోజూపెద్దఎత్తున ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. వామపక్ష పార్టీలతో పాటు విద్యార్థి, యువజన సంఘాలు రహదారుల మీదకు వచ్చి కేంద్ర ప్రభుత్వ వైఖరిని తూర్పారబడుతున్నారు.

ప్రత్యేకహోదా విషయంలో ఈనెల 14న గుంటూరులో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆందోళ న కార్యక్రమాలు ఎలా చేపట్టాలో తెలియజేస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలు కేంద్రం నుంచి తెదేపా ఎంపీలు వైదొలగిన నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించేం దుకు పాదయాత్రలో ఉన్న వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం పార్టీ సీనియర్లతో సమావేశం కానున్నా రు. అనంతరం మీడియా సమావేశం ఏర్పాటుచేసి తన నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

కేంద్రమంత్రి వర్గం నుండి వైదొలగిన తెదేపా

• విభజన హామీల అమలులో కేంద్రవైఖరికి నిరసనగా తెదేపా మంత్రుల రాజీనామా • కేంద్రం తీరు అవమానకరంగా ఉంది • తెదేపాకు పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం • ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంత్రివర్గం నుండి వైదొలగుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఎన్‌డిఏ నుండి వైదొలిగే అంశంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వ పరంగా నిర్ణయం తీసుకున్నామని, కేంద్ర స్పందన పరిగణలోకి తీసుకొని పార్టీ పరంగా రాజకీయ నిర్ణయం తీసుకుంటామని తెలియచేశారు. తమకు రాష్ట్ర ప్రయోజనాల ముఖ్యమన్నారు. కేంద్ర వైఖరిని అన్ని స్థాయిల్లో చర్చించిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంత్రివర్గంలో పని చేస్తున్న తెదేపా మంత్రులు పి. అశోక గజపతి రాజు, సుజనా చౌదరి తమ పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రత్యేక హోదా, రెవెన్యూలోటు, రాయితీల విషయంలో కేంద్రం నుండి ఎలాంటి హామీ రాకపోగా, ప్రత్యేక హోదా సాధ్యం కాదని కేంద్రం స్పష్టం చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాలను ఆశించి ఇప్పటికే 29 సార్లు ఢిల్లీకి వెళ్లి హామీల అమలును గుర్తు చేసినప్పటికీ కేంద్రం అవమానపరంగా వ్యవహరించడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి వర్గం నుండి వైదొలగుతున్నట్టుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీకి టెలిఫోన్‌లో తెలియచేయడానికి ప్రయత్నించినప్పటికీ ఆయన ఫోన్‌లో అందుబాటులో లేరని పేర్కొన్నారు. తనకు రాష్ట్ర ప్రయోజనాలు తప్ప, రాజకీయాలు ముఖ్యం కాదని అన్నారు. తాము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. విభజన చట్టంలోపేర్కొన్న అంశాలకు సంబంధించి ఆనాడు భారతీయ జనతా పార్టీ కూడా భాగస్వామ్యమనే వాస్తవం విస్మరించరాదన్నారు. విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగింది, న్యాయం చేయండని నాలుగు సంవత్సరాలుగా పదే పదే కోరినప్పటికీ కేంద్రం సానుకూలంగా స్పందించకపోగా ఈశాన్య రాష్ట్రాల మాదిరిగా ప్రత్యేకహోదా సాధ్యం కాదని ప్రకటించడంతో, ఏ లక్ష్యంతోనైతే కేంద్ర మంత్రివర్గంలో చేరామో ఆ లక్ష్యం నెరవేరడం లేదని భావించి వైదొలగాలని నిర్ణయించామన్నారు. ఎన్‌డిఏ నుండి వైదొలగే అంశం పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చంద్రబాబునాయుడు తెలిపారు. కేంద్రం ఇప్పటికైనా స్పందించి ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకొని విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుకు ముందుకు రావాలని కోరుకుంటున్నామన్నారు. కేంద్రం అనేక సందర్భాల్లో అవమానకరంగా వ్యవహరించినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాల కోసం భరించామని వివరించారు. సమైక్య స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయవలసి ఉంటుందని, కేంద్రం నుండి తమకు అలాంటి సహకారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మనోభావాలకు ఇబ్బంది కలగని విధంగా రాజకీయ పార్టీలు వ్యవహరించవలసి ఉంటుందన్నారు. విభజన సందర్భంగా తమకు అన్యాయం జరిగిందని భావించి ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో కేంద్ర స్పందన ఆధారంగా తెదేపా చర్యలు ఉంటాయని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మంత్రివర్గం నుండి బిజేపీ వైదొలగుతుందనే విషయం తాను ఆలోచించడం లేదని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరాలన్నదే తన ఆకాంక్ష అని వివరించారు. కేంద్రం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందని, న్యాయం జరిగేంత వరకు ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని ప్రకటించడం బాధాకరం అన్నారు. గతంలో 29 మంది పార్లమెంటు సభ్యులు ఉన్నప్పటికీ బయటి నుండి కేంద్ర ప్రభుత్వానికి మద్దతిచ్చి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకున్నామని గుర్తు చేశారు. రాజకీయాలు సమస్యలకు పరిష్కార మార్గం చూపాల్సి ఉంటుందన్నారు. సమస్యలను అధిగమించడం తెలుగువారికి బాగా తెలుసన్నారు. నచ్చజెప్పడానికి ఎంతో ప్రయ్నతం చేసి చివరగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. విభజన హామీలు అమలు కావడం లేదని, కేంద్రం అందచేసిన సహాయం, ఇస్తున్న వివరణకు పొంతన ఉండటం లేదని గణాంకాలను మరో సారి తెలియచేశారు. రాష్ట్రానికి రావలసిన నిధులను విడుదల చేసి వెంటనే తిరిగి కేంద్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేసుకున్న సంఘటనలు తీవ్రమైన ఆవేదనకు గురి చేశాయన్నారు. కేంద్రం తీరు అవమానకరంగా ఉందన్నారు. మంత్రుల రాజీనామ అనంతర పరిణామాలను పరిగణలోకి తీసుకొని తదుపరి రాజకీయ నిర్ణయం ఉంటుందన్నారు.

మీ మట్టి... మీ నీళ్లు మాకొద్దు

• స్వరం పెంచిన ఏపీ టీడీపీ ఎంపీలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్ సమావేశాల మొదటి రోజు నుంచి ఆందోళన చేస్తున్న టీడీపీ ఎంపీలు బుధవారం స్వరం పెంచారు. హోదా లేదు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెగేసి చెప్పడంతో రోజు కంటే అరగంటే ముందు వచ్చి ఎంపీలు గంటసేపు ఘాటుగా నిరసన తెలిపారు. హామీల అ మలు కోసం చేస్తున్న పోరాటంలో రాజీ పడేదే లేదని, వెనక్కు తగ్గే ప్రసక్తి అంతకన్నా లేదని తేల్చేశారు. మిత్రపక్షం కాబట్టి ఇన్నాళ్లూ ఊరుకున్నామని... ఇకసహించేది లేదని ఎంపీలు స్పష్టం చేశారు. కేంద్రం ఏదో చేస్తుందన్న నమ్మకం ఇక తమకు లేదని మండిపడ్డారు. దగాపడ్డ ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయా లంటూ ప్లకార్డులు పట్టుకుని పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద చేరి నినాదాలు చేశారు. రోజుకో విచిత్ర వేషధార ణతో తన నిరసన తెలుపుతున్న చిత్తూరు ఎంపీ శివప్రసాద్ రైతు వేషధారణలో వచ్చారు. కావడిలో రెండు కుండలతో అక్కడ ప్రత్యక్షమ య్యారు. ఒక కుండలో మట్టి, మరో కుండలో నీళ్లు తీసుకొ చ్చారు. అమరావతి శంఖుస్థాపన సమయం లో ప్రధాని మోదీ మట్టి, గంగాజలాన్ని కానుకగా ఇచ్చారని, ఆయన ఇచ్చిన వాటిని ఆయనకే తిరిగి ఇస్తున్నామని చెప్పుకొచ్చారు.

'నీట్'కు ఆధార్ తప్పనిసరి కాదు

న్యూఢిల్లీ: విద్యార్థులు పరీక్షలకు నమోదు చేసుకోవడానికి ఆధార్ సంఖ్యను తప్పనిసరి చేయవద్దని సుప్రీం కోర్టు సిబిఎస్ఇని బుధవారం ఆదేశించింది. నీట్-2018, తదితర అఖిల భారత పరీక్షలకు హాజరుకాదల్చిన విద్యార్థులకు ఆధార్ సంఖ్యను తప్పనిసరి చేయవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. సంబంధిత సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు జడ్జీల ధర్మాసనం సిబిఎస్ఇని ఆదేశించింది. అంతకుమునుపు నీట్-2018 పరీక్షలకు హాజరుకాదల్చిన విద్యార్థుల నుంచి ఆధార్ సంఖ్య తీసుకునే అధికారం సిబిఎస్ఇకి లేదని సర్వోన్నత న్యాయస్థానానికి యుఐడిఎఐ విన్నవించుకుంది. జమ్మూ కాశ్మీర్, మేఘాలయ, అస్సాం లాంటి రాష్ట్రాల తరహాలో పరీక్షలకు నమోదు చేసుకునే విద్యార్థుల గుర్తింపునకు సంబంధించి పాస్‌పోర్టు, ఓటరు కార్డు, రేషన్ కార్డును సిబిఎస్ఇ వినియోగించుకోవచ్చునని యుఐడిఎఐ నుంచి తనకు సూచనలు అందాయని అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ తెలిపారు.

తొగాడియాకు త్రుటిలో తప్పిన ముప్పు

సూరత్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అంతర్జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియాకు త్రుటిలో రోడ్డు ప్రమాదం తప్పిం ది. ఈ ఘటనపై సూరత్ పోలీ సులు తెలిపిన వివ రాలు ఈ విధంగా ఉన్నాయి. కమ్రీజ్ ప్రాంతంలో తొగా డియా ప్రయాణిస్తున్న వాహనాన్ని అదే మార్గంలో వెళుతున్న ట్రక్ వెనుకనుంచి ఢీకొట్టిందన్నారు. అయితే ఈ ప్రమాదంలో ఆయనకు ఎటువంటి గాయం కాలేదని సురక్షితంగా ఉన్నారన్నారు. ఈ ప్రమాదంపై తొగాడియా మాట్లాడుతూ తాను ప్రయాణిస్తున్న వాహనం బుల్లెట్‌ప్రూఫ్ కావడం వల్లే తనకు ప్రమాదం తప్పిందని లేకపోతే చనిపోయేవాడిని అన్నారు. తనకు జడ్ ప్లస్ సెక్యూరిటీని ఉద్దేశపూర్వకంగానే గుజరాత్ ప్రభుత్వం తగ్గించిందని ఆరోపించారు. కాగా కజ్మీర్ పట్టణానికి కిలోమీటర్ దూరంలో తొగాడియా వాహనాన్ని ఢీకొట్టిందని పోలీసులు తెలిపారు. ఆయన ఓ వేడుకలో పాల్గొనేందుకు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. ఈ ప్రమాదం నుంచి తొగాడియా త్రుటిలో సురక్షితంగా తప్పిం చుకున్నారన్నారు. ప్రమాదానికి కారణమైన ట్రక్ డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ ఎంకె నాయక్ తెలిపారు.

కార్తీపై నార్కో అస్త్రం

న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా వ్యవహారంలో అవినీతికి పాల్పడిన కార్తీ చిదంబరానికి నార్కో టెస్ట్ నిర్వహించడానికి అనుమతించాలని సీబీఐ, ప్రత్యేక కోర్టులో పిటి షన్ వేశారు. దీంతో ప్రత్యేక న్యాయస్థానం జడ్జి సునీల్ రాణా మాట్లాడారు. కార్తీని సీబీఐకి మూడు రోజుల పాటు కస్టడీకి అప్పగించారు. మార్చి 9తో ఇది ముగుస్తుంది. అప్పుడు నార్కో టెస్ట్ గురించి ఆలోచిద్దామని అన్నారు. కార్తీ చిదంబరం చార్టెడ్ అకౌంట్ ఎస్.భాస్కరమన్, సహ నిందితుడు ఇంద్రాణి ముఖర్జీని పోలీసులు అరెస్టు చేశారు. వీరిని విచారించడానికి సీబీఐ సిద్ధం అవుతున్నది. కార్తీని మంగళవారం మరో మూడు రోజుల పాటు సీబీఐ కస్టడీకి అప్పగించిన విషయం తెలిసిందే. కార్తీ తమకు సహకరించడం లేదని, అడిగిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని అందుకే నార్కో టెస్ట్‌కు అనుమతించాలని కోరుతూ పిటిషన్ వేసినట్టు సీబీఐ అధికారులు చెబుతున్నారు. కార్తీని ఫిబ్రవరి 28న అరెస్టు చేయగా, ముఖర్జీ ఆమె కూతురు షీనాబోరే హత్య కేసులో ముంబైలోని కారాగారంలో ఉన్నారు.

కూచిబొట్ల హంతకుడికి 50ఏళ్ళ జైలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాత్య హంకారంతో అమెరికాలో టెక్కీ కూచిబొట్ల శ్రీనివాస్‌ను కాల్చి చంపిన కేసులో అమెరికా మాజీ నేవి అధికారి ఆడం ప్యూరింటన్‌కు అక్కడి కోర్టు 50 సంవ త్సరాల జైలు శిక్ష విధించింది. గత ఏడాది ఫిబ్రవరి 22న శ్రీనివాస్ తన స్నేహితుడు అలోక్ మాదసానితో కలిసి అమెరికాలోని కేన్సస్ నగరంలో ఆస్టిన్స్ బార్ అండ్ గ్రిల్‌లో మద్యం సేవిస్తుండగా ప్యూరింటన్ కాల్పులు జరిపాడు. ఈ సంఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే అసువులు బాయగా, అతడి మిత్రుడు అలోక్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనలో అమెరికాకు చెందిన ఇయాన్ గ్రీలియట్ కూడా గాయాల పాలయ్యాడు. కాల్పులకు తెగబడ్డ ప్యూరింటన్‌ను వెంటనే స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం ప్యూరింటన్‌కు శిక్షను ఖరారు చేసింది. పెరోల్‌కు వీలు లేని శిక్షను కోర్టు విధించింది. విచారణ సందర్భంగా తన చర్య పట్ల ప్యూరింటన్ కోర్టులో పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు.

శ్రీదేవితో సినిమా తీయాలనుకున్నాను

బాలీవుడ్ దర్శకుడు హన్సల్ మెహతా

ముంబై: బాలీవుడ్ దర్శకుడు హన్సల్ మెహతా శ్రీదేవితో ఒక మహి ళా చిత్రం చేసేందుకు ప్లాన్ చేసినట్టు తెలిపారు. యాభై ఏళ్ల వయసులో ఒక మహిళ తనను తాను స్త్రీగా గుర్తించటం ప్రధాన కథ అన్నారు. శ్రీదేవి మరణించటానికి ముందే ఆమెతో చిత్రం చేయాలనుకున్నాను అన్నారు. చైనా నవలకు చెందిన ఒక అందమైన కథ అన్నారు. ఆ కథకు సంబంధించి హక్కులు కూడా పొందాను అన్నారు. ఈ కథను శ్రీదేవి చేస్తే అద్భుతంగా ఉంటుందని భావించి ఆమెకు కథను కూడా వినిపించాను అని మెహతా అన్నారు. కానీ ఇంతలోనే ఆమె మరణించటం నన్ను విభ్రాంతికి గురిచేసిందన్నారు. చిత్ర కథ గురించి ఆయన మాట్లాడుతూ సీనియర్ సూపర్ స్టార్ చుట్టూ తిరిగే కథ అన్నారు. ఇదొక విభిన్న కథ అన్నారు. పెళ్లికాని యాభై ఏళ్ల హీరోయిన్ లేటు వయసులో ప్రేమ గురించి, పెళ్లి గురించి, స్త్రీత్వం, మాతృత్వం గురించి ఒక సాధారణ స్త్రీగా ఆలోచించటం ప్రధాన కథ అన్నారు. ఈ సినిమా తీసి చిత్రాన్ని శ్రీదేవికి అంకితం ఇచ్చేందుకు నిర్ణయించుకున్నానన్నారు.

ఎస్పీ, బీఎస్పీలకు గోరఖ్‌పూర్ పరీక్ష

గోరఖ్పూర్: ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న గోరఖ్పూర్ లోక్‌సభ ఉప ఎన్నిక ఎస్పీ, బీఎస్పీ మైత్రికి కఠినపరీక్షగా నిలవనుంది. మరోవైపు అధికారక బీజేపీ ఈ స్థానం నుంచి ఐదుసార్లు గెలిచి ఆ పార్టీ కంచుకోటగా గోరఖ్పూర్‌ను మలుచుకుంది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే ఉప ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉన్నారు. ఈ స్థానంలో యోగి ఎంపీగా గెలిచి అనంతరం యూపీ సీఎంగా వెళ్లటం కారణంగా ఖాళీ అయిన గోరఖ్పూర్ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఒకవిధంగా ఇది అధికారక బీజేపీకి సిట్టింగ్ స్థానం కావటంతో ఆ పార్టీ గెలుపుపై ధీమాగా ఉంది. దీంతో బలమైన బీజేపీని ఎదుర్కొనేందుకు ఎస్పీ, బీఎస్పీ జతకట్టి ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. 2019లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికారక బీజేపీని ఎదుర్కొనేందుకు ఇరుపార్టీలు పొత్తు విషయం తేలనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఉప ఎన్నికలు మార్చి 11న జరగనున్నాయి.

వాణిజ్యంలో భారత్-చైనా రికార్డు

న్యూఢిల్లీ: ఇటీవల డోక్లాం వ్యవహారంలో భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ...వాణిజ్యంలో మాత్రం చరిత్ర సృష్టించాయి. 2017 ఆర్థిక సంవత్సరంలో ఈ రెండు దేశాల మధ్య రూ.84.44 బిలియన్ డాలర్ల వాణిజ్యం నమోదయింది. ఇంత భారీ ఎత్తున వాణిజ్యం జరగడం ఇదే ప్రథమం. చైనాకు భారత్ ఎగుమతుల్లో కూడా 40 శాతం వృద్ధి సాధించింది. దీని విలువ 16.34 బిలియన్ యుఎస్ డాలర్లు వుంటుందని చైనా కస్టమ్స్ పరిపాలనా విభాగం వెల్లడించింది. గత ఏడాది ద్వైపాక్షిక వాణిజ్యం 71.18 బిలియన్ డాలర్లని, ఈ ఏడాది 18.63 శాతం వృద్ధితో 84.44 బిలియన్ డాలర్లకు చేరుకోవడం చరిత్రాత్మకమని తెలిపింది. ఇరు దేశాల అధిపతులు 2015 లో 100 బిలియన్ డాలర్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ చాలా గత రెండేళ్ళు 70 బిలియన్ డాలర్లకే పరిమితమైంది.

భారత్ డ్రోన్ కూల్చేశాం:పాక్

ఇస్లామాబాద్ : భారత్‌కు చెందిన ఓ డ్రోన్ కాశ్మీర్‌లోని ఎల్ఓసీ వెంట ఉన్న చిత్రకూట్ సెక్టార్‌లో ప్రవేశించిందని పాకిస్థాన్ ఆర్మీ అధికారులు బుధవారం తెలిపారు. డ్రోన్‌ను గుర్తించిన పాకిస్థాన్ మిలటరీ దళాలు కూల్చేసినట్టు వివరించారు. భారత్ డ్రోన్‌కు సంబంధించిన శకలాలను మంగళవారం రాత్రి కనుగొన్నట్టు తెలిపారు. భారత్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని, కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడుస్తున్నదని ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాది కాలంలో నాలుగు డ్రోన్‌లు పాకిస్థాన్ భూభాగంలో ప్రవేశించాయని, అన్నింటిని పాక్ మిలటరీ కూల్చేసిందని ప్రకటించింది.

చిక్కుల్లో చిదంబరం

పీఎన్‌బీ కుంభకోణంలో మాజీ ఆర్థికశాఖ మంత్రి

- 80:20 బంగారం దిగుమతి పథకంలో అవినీతి
- 2013, ఆగస్టులో ప్రవేశపెట్టిన యూపీఏ
- మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు
- నిర్ధారణకు వచ్చిన పీఏసీ



న్యూఢిల్లీ: మాజీ ఆర్థికశాఖ మంత్రి పి.చిదంబరానికి పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం చిక్కులు తప్పడం లేవు. 2013లో తీసుకొచ్చిన 80:20 బంగారు పథకం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్‌కు అనుకూలంగా లేదని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ) సబ్ కమిటీ నిర్ధారణకు వచ్చింది. దీనిపై బీజేపీ ఎంపీ, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ప్రధాన సభ్యుడు నిశికాంత్ దుబే సీబీఐ విచారణకు ఆదేశించడానికి నిర్ణయించుకున్నారు. చిదంబరం ప్రవేశపెట్టిన 80:20 పథకం తీరు తెన్నులు, వాటిలోని అంశాలను పరిశీలించాల్సిందిగా అధి కారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన విష యాలను గోప్యంగా ఉంచాలని సీబీఐ అధి కారులను కోరారు.

ఈ పథకంలో బ్లాక్‌మనీ తిరిగి తిరిగి ఉపగించడం జరిగిందని, మనీ లాండరియింగ్ పాల్పడిటనట్టు ఆరో పణలు ఉన్నాయి. 2013 ఆగస్టులో యూపీఏ సర్కార్ 80:20 పథ కాన్ని ప్రవే శపెట్టింది. వ్యాపారులు పూర్వం ఉన్న 20 శాతం బంగారం ఎగుమతి చేసిన తరువాతే దిగుమతి చేసుకునే నిబంధన పెట్టింది. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌డీఏ ప్రభుత్వం ఈ నిబంధనను తొలగించింది. దీనికి సంబంధించిన వివరాలు ఆర్థిక శాఖ అధికారులు పీఏసీతో పంచుకున్నారు. దీంతో డీఆర్ఐ పథకం నిబంధనలను తుంగలోతొక్కి మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు స్పష్టమవుతున్నది. వారం రోజుల క్రితం 2016 బంగారం దిగుమతి వివరాలను కాగ్ బయటపెట్టింది.

దీనిపై పీఏసీ సభ్యులు నాటి ఆర్థిక శాఖ మంత్రి చిదంబరాన్ని ప్రశ్నించింది. ఈ పథకాన్ని మంత్రి దుర్వినియోగానికి పాల్పడినట్టు ఆరో పించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో భాగస్వాముడైన మెహుల్ చోక్సీతో కలిసి మనీ లాండరింగ్ పాల్పడినట్టు తెలుస్తున్నది. రెవెన్యూ కార్య దర్శితో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్, సెంట్రల్ బోర్డు ఆఫ్ ఎక్సర్‌సైజ్ అండ్ కస్టమ్స్ పలు విషయాలు ప్యానెల్ ముందు ఉంచాయి. ఈ పథకంతో ప్రభుత్వం రూ.1లక్ష కోట్ల వరకు నష్టపోయిందని వివరించారు.

నివేదిక ఇవ్వాలి : ఢిల్లీ హైకోర్టు

పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం విషయమై అవినీతికి పాల్పడిన నీరవ్ మోడీపై వచ్చిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు విచారణ జరిపింది. వెంటనే రూ.11వేల కోట్లకు కుంభకోణం, దీనికి సంబంధించిన అంశాలపై నివేదిక ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను బుధవారం ఆదేశించింది. బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.మురళీధర్, ఐఎస్ మెహతా కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు నోటీసులు అందజేశారు. సర్చ్‌వారెంట్ పత్రాలను కూడా జత చేయాల్సిందిగా ఆదేశించారు. మార్చి 19న మరో విచారణ జరుపుతాం. కేసు పూర్వాపరాలను, పురోగతికి సంబంధించిన అన్ని అంశాలను నివేదిక రూపంలో అందజేయాలని జడ్జీలు తెలిపారు. పీఎన్‌బీకి సంబంధించిన స్థిర, చర ఆస్తులపై తీసుకున్న చర్యలను ఉపసహరించుకోవాలని న్యాయవాది విజయ్ అగర్వాల్ బెంచ్ దృష్టికి తీసుకొచ్చారు.

కర్నాటక లోకాయుక్తకు కత్తిపోట్లు

బెంగళూరు: కర్నాటకలో ఓ వ్యక్తి ఆ రాష్ట్ర లోకాయుక్తను కత్తితో పొడిచిన ఘటన చోటుచేసుకుంది. కర్నాటక లోకాయుక్త జస్టిస్ పి.విశ్వనాథ్ షెట్టి(74)పై బుధవారం మధ్యాహ్నం ఫిర్యాదుదారుడు తేజస్ శర్మా అనే వ్యక్తి లోకాయుక్తను కత్తితో దాదాపు మూడుసార్లు పొడిచాడు. వెంటనే పోలీసులు నిందితుడిని అరెస్టుచేశారు. ఈ ఘటనలో గాయపడిన జస్టిస్ షెట్టీని మల్లయ్యా ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం నుంచి బయటపడినట్టు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స చేస్తున్నారు.పోలీసులు ఇచ్చిన వివరాల ప్రకారం ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తి తన ఫిర్యాదుపై అలసత్వం ప్రదర్శించారనే ఆగ్రహంతో ఏకంగా జస్టిస్‌షెట్టిపై కత్తితో దాడికి పాల్పడినట్టు తెలిసింది. నిందితుడిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నట్లు కర్నాటక హోం శాఖ మంత్రి రామలింగారెడ్డి ప్రకటించారు. ఈ దాడి వార్త తెలియగానే ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మల్లయ్యా ఆస్పత్రికి తరలివెళ్లి పరామర్శించారు. బహుశా దాడికి పాల్ప డిన వ్యక్తి మతిస్థిమితంలేని వ్యక్తి అయిఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడు తముకూరు ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌గా గుర్తించారు. ఓ టెండర్ల వివాదంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేశాడు.

సింగపూర్ పర్యటనకు రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సింగపూర్, మలేషియాలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం సింగపూర్ చేరుకున్నారు. రాహుల్ 9న సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్, మలేషియా ప్రధాని నజీబ్ రజాక్‌తో 10న సమావేశమవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు భారతీయ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించడంతో గురువారం తన సింగపూర్ పర్యటనకు శ్రీకారం పలుకుతారు. అనంతరం సింగపూర్ నేషనల్ యూనివర్శిటీలో లీ కయాన్ యె స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో ఇష్టాగోష్ఠి జరుపుతారు. సభికులను ఉద్దేశించి లాంఛనంగా ప్రసంగిస్తారు. అదే రోజున సింగపూర్ విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో సమావేశమవుతారు. రాహుల్ గాంధీ 9న యంగ్ ప్రొఫెషనల్స్ ఇంటర్నేషనల్ సభ్యులతో భేటీ అవుతారు. అనంతరం సింగపూర్ ప్రధాని, ఉప ప్రధాని థార్మన్ షణ్ముగరత్నంలతో సమావేశమవుతారు. ఓవర్‌సీస్ కాంగ్రెస్ సభ్యులను ఉద్దేశించి రాహుల్ ప్రసంగిస్తారు. భారతీయ ప్రతినిధులతో భేటీ అవుతారు. కాంగ్రెస్ అధినేత సన్‌టెక్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఐఐఎం పూర్వ విద్యార్థులతో ఇష్టాగోష్ఠి జరుపుతారు. 10న మలేషియాకు ప్రయాణిస్తారు.

సీపీఎంలో తరం మారుతోంది!

- బెంగాల్‌లో వృద్ధనేతలకు స్వస్తి
- రాష్ట్ర, కేంద్ర కమిటీల్లోంచి తొలగింపునకు నిర్ణయం
- యువతకు నాలుగింట మూడోవంతుకు అవకాశం
- త్రిపుర ఫలితాలతో మేల్కొన్న కమ్యూనిస్టులు



కోల్‌కత్తా : త్రిపురలో గట్టి ఎదురుదెబ్బ ఎదుర్కొన్న కమ్యూనిస్టులు ఇప్పుడు పశ్చిమబెంగాల్‌లో పలు మార్పులు చేసేందుకు సిద్ధం అవుతున్నది. కురవృద్ధులను పక్కనపెట్టి ఉడుకు రక్తం ఉన్న యువకుల వేటలో పార్టీ తలామునకలైంది. బెంగాల్ రాజ కీయాల్లో సమూల మార్పులు తీసుకురావడానికి కమ్యూనిస్టులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా విజయం సాధించడానికి కమ్యూనిస్టులు చాలా కష్టపడాల్సిన పరిస్థితి నెలకొంది. పశ్చిమబెంగాల్‌లోని 23 జిల్లాల్లో స్థానిక సంస్థల ఎన్నికల కోసం చురుకైన 300 మంది యువకులను పార్టీ ఎంపిక చేసింది. 60 నుండి 80 ఏళ్ల వయస్సున్న 70 శాతం నాయకులను పక్కన పెట్టనుంది. ఇలా చేస్తే తప్ప అధికారంలో ఉన్న తృణముల్ కాంగ్రెస్, బీజేపీకి గట్టి పోటీ ఇవ్వలేమని సీపీఎం నాయకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. తిరిగి పార్టీకి పునర్‌వైభవం తీసుకురావాలనే ఆలోచనలో కమ్యూనిస్టులు ఉన్నట్టు తెలుస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని హోదాల్లో ఉన్న నాయకుల వయస్సుపై దృష్టిసారిస్తున్నాం. ఏరియా కమిటీ నుంచి రాష్ట్ర నాయకుల వరకు వారి వయస్సు, రాజకీయ బలాబలాలు పరిశీలిస్తున్నామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సూర్య కంత మిశ్రా అన్నారు. రాష్ట్ర కమిటీల్లో 75 ఏళ్లు పైబడిన వారిని తొలగిస్తున్నాం. రాష్ట్ర కార్యవర్గంతో పాటు జిల్లా కమిటీల్లో దీన్ని అమలు చేస్తాం. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేవిధంగా చూస్తాం. అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తాం అని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీమన్ బోస్, మాజీ ముఖ్యమంత్రి బుద్ధాదేవ్ భట్టాచార్య అన్నారు.

భట్టాచార్య ఇప్పటికే అనారోగ్యం కారణంగా రాష్ట్ర కమిటీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. భట్టాచార్యను మళ్లీ రాష్ట్ర కమిటీలో తీసుకుంటే పార్టీకి మంచి మేలు జరుగుతుందని, సీపీఎం మరింత బలోపేతం అవుతుందని పలువురు సీనియర్ నేతలు భావిస్తున్నారు. 75 ఏళ్ల పైబడిన వారిని కమిటీ నుంచి తొలగించే నిర్ణయం తీసుకున్నాం. ఈ నిబంధన మాత్రం బీమన్ బోస్‌కు వర్తించదని, ఆయన ఇప్పటికీ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని, అన్ని సమావేశాలకు, ఆందోళనలకు, కాన్ఫరెన్స్‌లకు హాజరు అవుతుంటారని సీనియర్ నాయకులు తెలిపారు. 75 ఏళ్ల పైబడిన వారి చురుకుదనం కూడా పరిగణలోకి తీసుకుంటామని వివరించారు. రాష్ట్ర, కేంద్ర కమిటీల నుంచి చాలా మంది సభ్యులు అనారోగ్యాల కారణంగా స్వచ్ఛందంగా తప్పుకుంటున్నారు. 2015 డిసెంబర్‌లో కోల్‌కత్తాలో నిర్వహించిన ప్లీనంలో కూడా వయస్సుపైబడిన వారిని తొలగించాలని తీర్మానం చేశారు. యువకులను పార్టీ రాష్ట్ర, కేంద్ర కమిటీల్లో తీసుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కమిటీల్లో 45 ఏళ్లకు తక్కువగా ఉన్న వారిని కార్యదర్శులుగా నియమించాలని కోరుకుంటున్నట్టు సీపీఎం రాష్ట్రకార్యదర్శి సూర్యకంత మిశ్రా అన్నారు. 2011 వరకు అనగా 34 ఏళ్ల పాటు పశ్చిమబెంగాల్‌ను లెఫ్ట్ ఫ్రంట్ పాలించింది. తృణముల్ కాంగ్రెస్ రావడంతో పాటు బీజేపీ కారణంగా 2011 నుంచి లెఫ్ట్ ఉనికి లేకుండా పోయింది. 34 ఏళ్ల పాటు లెఫ్ట్ ఫ్రంట్ పశ్చిమబెంగాల్‌ను పాలించింది. ఇక వారికి అవకాశం ఇవ్వొద్దని ప్రజలు భావిస్తున్నారు.



ట్రంప్‌పై మాజీ శృంగారతార దావా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో తనకు సాన్నిహిత్యం ఉందేదనీ, ఆ సంగతి బయటపెట్ట వద్దంటూ రెండేళ్ళ క్రితం ట్రంప్ తరపు న్యాయవాది తనపై ఒత్తిడి తెచ్చారని మాజీ శృంగార తార స్టోర్నీ డేనియల్స్ ఆరోపించారు. తన చేత ట్రంప్ న్యాయవాది మైకేల్ కోహెన్ సంతకాలు చేయిం చుకున్నారని కూడా ఆమె ఆరోపించారు. ట్రంప్‌పై ఆమె నిన్న కాలి ఫోర్నియా కోర్టు లో దావా వేశా రు. ట్రంప్ వ్యక్తిగత న్యాయవాది మైకేల్ కోహెన్ తన కు అప్పట్లో 1,30,000 డాలర్లు చెల్లించారని కూడా ఆమె కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ మేరకు రాసుకున్న ఒప్పందంలో ట్రంప్ పేరునూ, తన పేరునూ మార్చినట్టు ఆమె ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ట్రంప్ తో తనకు 2006 నుంచి 2007 వరకూ సన్నిహిత సంబంధం ఉందని ఆమె పేర్కొన్నారు. స్టోర్నీ అసలుపేరు స్టీఫెనీ క్లిఫోర్డ్ ఆమె పేరు మార్చడమే కాకుండా, ఆమె పిటిషన్‌లో విశ్వసనీయత లేదని తేల్చేందుకు ట్రంప్ తరపు న్యాయవాది ప్రయత్నాలుసాగించారు. ఆమె నోరెత్తకుండా చేయడం కోసం ట్రంప్ తరపు న్యాయవాది మైకేల్ కుతంత్రాలు పన్నినట్టు ఆమె ఆరోపించారు.

హామీ ఇచ్చేదాకా పోరాటమే

- మూడో రోజూ ఆగని తెరాస ఆందోళన
- పట్టిన పట్టు విడువని ఎంపీలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణాకు సంబంధించిన సమస్యలను కేంద్రం పరిష్కరించే వరకూ పార్లమెంట్‌లో పట్టుబడతామని తెరాస తేల్చి చెప్పింది. స్పష్టమైన హామీ వచ్చే వరకూ సభను సాగనివ్వమని ఆ పార్టీ లోక్‌సభా పక్ష నేత జితేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం తమ నిరసనను తెలిపిన ఎంపీలు నేడు కూడా పార్లమెంట్‌లో ఆందోళన చేయనున్నట్టు ప్రకటించారు. మూడు రోజులుగా పట్టిన పట్టు విడవకుండా నిరసన తెలుపుతున్న ఎంపీలు సభ సజావుగా సాగేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహజన్ అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేశారు. టీఆర్ఎస్, కాంగ్రెస్, తృణముల్ కాంగ్రెస్, ఏఐడిఎంకే, శివసేన, సీపీఎం, టీడీపీ ఎంపీలు చేస్తున్న ఆందోళనను విరమించాలని కోరారు. కాంగ్రెస్, టీఎంసీ ఎంపీలు పీఎన్‌బీ స్కామ్‌పై వాయిదా తీర్మానంపై చర్చ చేపట్టాలని కోరారు. అయితే పీఎన్‌బీపై చర్చ జరిగినంత మాత్రాన తమ పోరాటం ఆగదని తెరాస ఎంపీలు స్పష్టం చేశారు. రిజర్వే షన్ల కేటాయింపు పార్లమెంట్, కేంద్ర ఆధీనంలో పెట్టుకోకుండా, రాష్ట్రానికి కి హక్కు లు కల్పించాలని స్పీకర్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పొందు పరిచిన అంశాలను పరిశీలించాలని ఎంపీలు స్పీకర్‌ను కోరగా, ఈ సమస్యలన్నీ పార్లమెంట్ లో పరిష్కారమవుతాయా అని ఆమె ప్రశ్నించారు. ఈ పార్లమెంట్‌లోనే ఉద్యమ నేతగా కేసీఆర్ కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని స్పీకర్‌కు గుర్తు చేశామని ఎంపీ జితేందర్ రెడ్డి అన్నారు. తమ సమస్యలపై చర్చ జరిగేంత వరకు పార్లమెంట్ జరగడం కష్టమని సుమిత్రా మహజన్‌కు స్పష్టంగా వివరించామని తెలిపారు.

నాలుగేళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా స్పందించని కేంద్రం : జితేందర్ రెడ్డి

నూతన రాష్ట్రమైన తెలంగాణ కు చేయూతనివ్వాలని ప్రతిసారీ కోరుతూ వచ్చాం. ఇందులో భాగంగా అంశాల వారిగా కేంద్రానికి మద్దతు తెలిపాం. ఉద్యమ సమయంలో, టీఆర్ఎస్ మేనిఫెస్టోలో రిజర్వేషన్ అంశాలను పొందుపరిచాము. ఇందుకు తగ్గట్లుగా రాష్ట్ర ఏర్పాటు తర్వాత రిజర్వేషన్ల అంశంపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాము. ఎన్నో సార్లు రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం. నేరుగా సిఎం కేసీఆర్, ప్రధాని మోడీని కలిసి రిజర్వేషన్ల అంశంపై చర్చించారు గానీ మోడీ, కేంద్రం ఇప్పటి వరకు రిజర్వేషన్ల అంశంపై చర్చించలేదు. ఉపాధి హామీ పథకాన్నివ్యవసాయానికి అనుసంధానం చేయాలని కోరాం. ఈ విషయాన్ని కేంద్ర పెడచెవిన పెట్టింది. ముఖ్యంగా నిండు సభ వేదికగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ తెలంగాణకు ఎయిమ్స్‌ను కేటాయించారు. కానీ సంవత్సరం గడుస్తున్నా ఇప్ప టి వరకు ఎయిమ్స్‌కు కేంద్రం నయాపైసా విడుదల చేయలేదు. ఎయిమ్స్, బయ్యా రం స్టీల్ ప్లాంట్, ఇతర అంశాలను కేంద్రం విస్మరించింది. ఈ హామీలన్ని టీఆర్ఎస్ పార్టీగా మేము అడగడం లేదు, ఆంధ్రప్రదేశ్ పునః విభజన చట్టంలో పొందు పరిచిన అంశాలనే మేం అడుగుతున్నాం. కానీ ఈ అంశాలపై కూడా కేంద్ర స్పందిం చడకపోవడం బాధాకరం. కొత్తగా పరిశ్రమలు పెట్టుకుంటే రాయితీలు కల్పిస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశలో కేంద్రం సహకరించకపోవడంతో తెలంగాణకు వచ్చే కంపెనీలు, కర్ణాటక, చెన్నై, కోల్‌కత్తా, వివిధ ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ఈ అంశాలన్నిటిపై నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా స్పందించడం లేదు. ఇప్పుడు మేం కూడా ఎన్నికలకు వెళ్లాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ పునః విభజనలోని హామీలపై ప్రజలకు ఏమని చెప్పాలి.



విగ్రహాలపై విద్వేషం

జాతికి సిగ్గు చేటు

- జనసంఘ్ వ్యవస్థాపకుడి విగ్రహం ధ్వంసం
- రంగంలోకి కేంద్ర హోంశాఖ
- కఠిన చర్యలకు మోడీ ఆదేశం

న్యూఢిల్లీ : త్రిపురతో నాంది పలికిన విగ్రహాల విధ్వంసం తమిళనాడు మీదుగా పశ్చిమ బెంగాల్‌కు పాకింది. తాజాగా కోల్‌కతాలో జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని వామపక్ష రాడికల్ వర్గానికి చెందిన ఏడుగురు సభ్యులు ధ్వంసం చేశారు. విగ్రహంపై నల్ల సిరా చల్లారు. దాడికి పాల్పడినవారిలో ఒక మహిళ ఉండటం గమనార్హం. నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ సభ్యులు అలాంటి చర్యకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా హెచ్చరించారు. అదే సమయంలో తమిళనాడులో పెరియార్ విగ్రహ ధ్వంసానికి ఊతమిచ్చేలా ఫేస్‌బుక్‌లో విద్వేష పోస్టు చేసిన పార్టీ నేత ఎ.రాజాపై చర్యలు ఉండవని బీజేపీ చీఫ్ స్పష్టం చేయడం గమనార్హం. ద్రవిడ ఉద్యమ వ్యవస్థాపకుడి విగ్రహ ధ్వంసంపై తమిళనాడులో నిరసనలు పతాకస్థాయికి చేరుకున్నాయి. కోయంబత్తూరులో బీజేపీ కార్యాలయంపై పెట్రోల్ బాంబులు విసిరిన ముగ్గురు వ్యక్తులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. త్రిపురలో హింసాత్మకఘటనలకు సంబంధించి నలుగురిని అరెస్టు చేశారు. పరిస్థితి అదుపులో ఉందని రాష్ట్ర పోలీసు అధికారులు తెలిపారు.

త్రిపురలో ఎన్నికల ఫలితాల అనంతరం చోటు చేసుకున్న హింసకు సంబంధించి గడిచిన 24 గంటల్లో 11 కేసులు నమోదయ్యాయని, దీనిపై నలుగుర్ని అరెస్టు చేసినట్టు పోలీసులు బుధవారం తెలిపారు. హింసను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ(పోలీస్ కంట్రోల్) ప్రదీప్ దే తెలిపారు. ధర్మనగర్ సబ్‌డివిజన్‌కు చెందిన అలన్ బజార్‌లో ఇరు రాజకీయ పక్షాల కార్యకర్తల మధ్య చోటు చేసుకున్న వాగ్వాదం ఘర్ష ణకు దారి తీసిందని సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్(ఎస్‌డిపిఒ) ధీమాన్ దాస్ చౌదురి తెలిపారు. ఇద్దరు సిపిఎం కార్యకర్తలు, నలుగురు బీజేపీ కార్యకర్తలు ఆసుపత్రి పాలయ్యారని చెప్పారు. హింసకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కాబోయే సీఎం విప్లవ్ కుమార్ దేవ్ కోరారని బిజెపి మీడియా ఇన్‌చార్జ్ విక్టర్ షోమ్ తెలిపారు.

విగ్రహ విధ్వంసకులపై కఠిన చర్యలు

కేంద్ర హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విగ్రహాల విధ్వంసంపై పార్లమెంట్ వెలుపల బుధవారం స్పందించారు. అలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ప్రతి ఒక్కరికీ, అన్ని రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి ఘటనలు ఒక్కనాటికి సమర్ధనీయం కాదు అని రాజ్‌నాథ్ సింగ్ విలేకరులతో అన్నారు.

పెరియార్ విగ్రహం ధ్వంసం.. బీజేపీ కార్యకర్తపై వేటు

చెన్నై : పెరియర్ విగ్రహం ధ్వంసం చేసిన కేసులో పార్టీ కార్యకర్త ఆర్.ముత్తురామన్‌ను బీజేపీ తమిళనాడు శాఖ బుధవారం పార్టీ నుంచి బహిష్కరించింది. ఆర్. ముత్తురామన్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నాం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తమిళిసై సౌందర్‌రాజన్ ఏక వాక్య ప్రకటన చేశారు.

కోవై బీజేపీ కార్యాలయంపై పెట్రోల్ బాంబులు

కోయంబత్తూరు: నగరంలోని బీజేపీ కార్యాలయంపై కొందరు వ్యక్తులు బుధవారం పెట్రోల్ బాంబులు విసిరారు. ఘటనలో ఎవ్వరూ గాయపడలేదని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి లొంగిపోయిన ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు వారు చెప్పారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సిద్ధపుడూరు వద్ద బైక్‌పై వచ్చిన వ్యక్తులు ఈ ఘటనకు పాల్పడ్డారు.

తన ఫేస్ బుక్ ఖాతాలో హేతువా ద నేత పెరియార్‌పై వివాదాస్పద పో స్టు చేయలేదని బీజేపీ నేత రాజా అన్నారు. రాజాపై ఎలాంటి చర్యలుండవని అమిత్‌షా స్పష్టం చేశారు.

ముఖర్జీ విగ్రహం ధ్వంసం

కోల్‌కతా: జనసంఘ్ వ్యవ స్థాపకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ఏడుగురు వ్యక్తులు బుధవారం ధ్వంసం చేశారు. దక్షిణ కోల్‌కతాలో చోటు చేసుకుంది. కారకులైన వామపక్ష గ్రూప్ రాడికల్‌కు చెందిన ఏడుగురిని అరెస్ట్ చేసినట్టు పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు.

ఖండించిన ప్రధాని

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశంలో పలు చోట్ల విగ్రహాల విధ్వంసక ఘటనలను బుధవారం గట్టిగా తిరస్కరించారు. ఇదే విషయమై హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడారని అధికార వర్గాలు వెల్లడించాయి.

క్రీడాప్రభ







లేచింది.. నిద్ర లేచింది అన్నాడో కవి. మిగతా విషయాల్లో ఏమో గానీ క్రీడలకు సంబంధించినంత వరకూ మహిళా లోకం నిద్రలేవడమేమిటి.. జనాల్ని నిద్రలేపుతోంది కూడా. ముఖ్యంగా భారతీయ మహిళా క్రీడాకారులు ఆ విషయంలో ముందువరసలో వున్నారు. అందుకు కారణం క్రీడల్లో పెరిగిన మహిళా ప్రాతినిధ్యమే. షూటింగ్, ఆర్చరీ, షాట్ పుట్, బ్యాడ్మింటన్, మహిళా క్రికెట్, జిమ్నాస్టిక్స్ ఇలా ఎన్నో క్రీడల నుంచి మహిళలు పురుషుల కంటే ఎక్కువ పతకాలు తెచ్చారు. దేశగౌరవాన్ని పెంచారు. అంతటితో ఆగిపోవడం లేదు. ప్రముఖ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతూ వారి బ్రాండ్ విలువనూ పెంచుకుంటున్నారు. సానియా మీర్జా మొదలుకుని సైనా నెహ్వాల్, పి.వి సింధు, మిథాలీ రాజ్ ఇలా మహిళలు కేవలం ఆట మాత్రమే అని వదిలేయడం లేదు. ఆట ద్వారా వచ్చే స్టార్ డమ్ ను ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు. అంతేనా వారి కథలు సినిమా తెరమీదకెక్కుతున్నాయి. ఫోగాట్ సిస్టర్స్ కథను దంగల్ పేరుతో సినిమాగా తీస్తే ఎంత పెద్ద హిట్టయిందో చెప్పనక్కర్లేదు. ఇక బాక్సర్ మేరీ కోమ్ కథ కూడా కాసుల వర్షం కురిపించింది. కేవలం కలెక్షన్ల గురించే మాట్లాడితే ఆ సినిమాల, ఆ కథల గొప్పతనాన్ని తగ్గించడమే అవుతుంది. స్త్రీలు పురుషులతో ఎందులోనూ తక్కువ కాదు అనే సందేశం వాటిల్లో వుంది. తెరమీద కథలే కాదు, తెరకెక్కని ప్రతి విజయవంతమైన క్రీడాకారిణి కథ

లేచింది.. క్రీడా మహిళా లోకం

- క్రీడల్లో పెరిగిన మహిళా ప్రాతినిధ్యం
- పురుషాధిపత్యానికి గండి





సందేశమూ అదే- స్త్రీ పురుషుడి కంటే ఎందులోనూ తక్కువ కాదు, అవసరమైతే ఒక మెట్టు ఎక్కువే అని. అయితే సమస్యలు ఇంకా వున్నాయి. ఉదాహరణకి పురుషుల క్రికెట్లో విజయానికి వున్న విలువ మహిళా క్రికెట్లో విజయానికి లేదు. విరాట్ కోహ్లీ ఫ్యాన్ ఫాలోయింగ్, ఆదాయం, స్టార్ డమ్ మిథాలీ రాజ్‌కు కనిపించవు. అయినా పర్వాలేదు. ఇలాంటి వెనకబాటు ఆలోచనలో ఉన్న సమాజాన్ని అయినా పర్వాలేదు. ఇలాంటి వెనకబాటు ఆలోచనలో ఉన్న సమాజాన్ని నిద్రలేపేందుకు సిద్ధంగా ఉన్నాం అంటున్నారు క్రీడాకారిణులు. నిద్రలేపేందుకు సిద్ధంగా ఉన్నాం అంటున్నారు క్రీడాకారిణులు.



షహజాద్ పై నిషేధం

హరారే: అఫ్ఘనిస్తాన్ వికెట్ కీపర్- బ్యాట్స్‌మన్ మహ్మద్ షహజాద్ రెండు మ్యాచుల నిషేధానికి గురయ్యాడు. ప్రపంచ కప్ క్వాలిఫైయింగ్ టోర్నీలో పాల్గొంటున్న అఫ్ఘనిస్తాన్ మంగళవారం జింబాబ్వేతో ఆడిన వన్డే మ్యాచ్ సందర్భంగా ఐసీసీ క్రమశిక్షణ నిబంధనలు 2.1.8 అతిక్రమించి 24 నెలల కాలంలో నిర్ణీత స్థాయిని మించి డిమెరిట్ పాయింట్లను చేరుకున్నాడు. ఈ నిబంధన కింద.. క్రికెట్ పరికరాలను, దుస్తులను, మైదానంలో ఉద్దేశపూర్వకంగా పాడుచేయటం లేదా వాటి గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించడం నేరం. తాను ఔటయిన అనంతరం బ్యాట్‌ను గట్టిగా పిచ్‌పై కొట్టడంతో నిషేధానికి గురయ్యాడు.

బోణీ కొడతారా ?

టోర్నీలో అడుగు పెట్టిన రోహిత్ సేన ఓ అనుభవం లేని జట్టు. అయినా అదే టైటిల్ ఫేవరేట్. కానీ తొలి మ్యాచ్ ముగిసే సరికి ఆ భ్రమలు తొలగిపోయాయి. పొట్టి క్రికెట్‌లో ఆ మూడుగంటల ముచ్చట్లో ఎవరైనా హీరోలు కావొచ్చని శ్రీలంక ఋజువు చేసింది. ఇప్పుడు అదే ఫీట్ ను పునరావృతం చేసే అవకాశం కోసం బంగ్లా ఎదురుచూస్తోంది. మరి టీమిండియా బంగ్లాకు అవకాశం ఇస్తుందా? లేక అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుని సిరీస్‌లో బోణీ కొడుతుందా?

ఏకపక్షంగా సాగుతుందనుకున్న నిదహాస్ ట్రోఫీ ఆరంభ మ్యాచ్ ముగిసేసరికి ఆసక్తికరంగా మారింది. ఊహించని రీతిలో శ్రీలంక చేసిన ఎదురుదాడికి రోహిత్ సేన చేతులెత్తేసింది. ఆ ఓటమి నుంచి తేరుకునే లోపే బంగ్లాతో మరో మ్యాచ్ వచ్చేసింది.

పేసర్లు మెరవాల్సిందే

లంకతో మ్యాచ్ గణాంకాలు ఒక్కసారి పరిశీలిస్తే శార్దూల్ ఠాకుర్ తన తొలి ఓవర్‌లోనే 27 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇక చివరి ఐదు ఓవర్లలో ఇండియన్ బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. అప్పటికే ప్రధాన బ్యాట్స్‌మెన్ అందరినీ కోల్పోయి న శ్రీలంక ఒక్క వికెట్ పడ్డా ఒత్తిడికి లోనయ్యేదే. కానీ అలా జరగలేదు.

ఈ మధ్య కాలంలో భారత విజయాల్లో పేసర్ల పాత్ర గణనీయంగా పెరిగింది. బుమ్రా, భువనేశ్వర్ లు ఆరంభ ఓవర్లలో వికెట్లు నేలకూల్చడమే గాక.. ఆఖరి ఓవర్లలో మరీ పొదుపుగా బౌలింగ్ చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా బుమ్రా డెత్ ఓవర్లలో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపిస్తున్నాడు. పరుగులు ఇవ్వడు, అవసరమైతే వికెట్లు నేలకూలుస్తాడు. ప్రస్తుతం ఆ పేస్ ద్వయం లేని పక్షంలో మరో సారి లక్ష్యాన్ని కాపాడుకోవాల్సి వస్తే రోహిత్ సేనకు ఇబ్బందులు తప్పకపోవచ్చు.

స్పిన్నర్లకు సవాలే

కొన్ని సార్లు భారత స్పిన్నర్లు అభేద్యుల్లా కనిపిస్తారు. కాకపోతే దానికి కారణం ఎక్కువ మ్యాచ్‌లు స్పిన్ ఎదుర్కోడానికి ఇబ్బంది పడే జట్లతో ఆడడమే తప్ప మరోటి కాదు. ఈ మధ్యే సౌతాఫ్రికా టూర్‌లో అదరగొట్టిన చాహల్ లంక బ్యాట్స్‌మెన్ ను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోవడం అందుకు ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. లంకతో మ్యాచ్‌లో 4 ఓవర్లకు గానూ 2 వికెట్లు తీసి 37 పరుగులు సమర్పించుకున్నాడు. ఉపఖండ బ్యాట్స్‌మెన్ స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొంటారు. ట్రై సిరీస్‌లో ఉపఖండ జట్లు మాత్రమే ఆడుతున్నాయి కాబట్టి భారత స్పిన్నర్లకు నేటి మ్యాచే గాక సిరీస్ మొత్తం సవాలుగా నిలవనుంది.

నేటి మ్యాచ్
బంగ్లాదేశ్ - ఇండియా
సాయంత్రం 7 గంటలకు
ప్రత్యక్ష ప్రసారం
డీ స్పోర్ట్స్, జియో లైవ్

సమతూకంగా బంగ్లా జట్టు

రెగ్యులర్ కెప్టెన్ షకిబుల్ హసన్ అందుబాటులో లేడు అనే విషయం తప్ప తప్ప బంగ్లా జట్టులో లోటేమీ కనిపించ డం లేదు. తమీమ్ ఇక్బాల్, మహ్మదుల్లా, ముష్ఫికర్ రహీమ్‌ల రూపంలో నాణ్యమైన బ్యాట్స్‌మెన్.. ముస్తాఫిజుర్, రూబెల్ లరూపంలో నికార్సైన పేస్ బౌలర్లు.. సబ్బీర్ రహ్మాన్, సౌమ్య సర్కార్ లరూపంలో చక్కటి ఆల్ రౌండర్లు ఆ జట్టు సొంతం. గతంలో భారత జట్టుపై మహ్మదుల్లా చేసిన బ్యాటింగ్ విన్యాసాలు గానీ.. ఐపీఎల్‌లో ముస్తఫిజుర్ యార్కర్లు కానీ ఏ భారతీయ క్రికెట్ అభిమాని మరిచిపోలేడు. ఎప్పటికప్పుడు పెద్ద జట్లకు షాకిస్తూనే వస్తున్న బంగ్లాదేశ్ నేటి మ్యాచ్‌లో అలాంటి ఫలితం కోసం ప్రయత్నిస్తుందనడంలో సందేహం లేదు.

జట్లవివరాలు

భారత్ : రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్(వైస్ కెప్టెన్), కే ఎల్ రాహుల్, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్(వికెట్ కీపర్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యుజువేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనద్కత్, మొహమ్మద్ సిరాజ్, రిషబ్ పంత్

బంగ్లాదేశ్ : మహ్మదుల్లా(కెప్టెన్), తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ఇమ్రుల్ కేస్, ముష్ఫికర్ రెహ్మాన్(వికెట్ కీపర్), సబ్బీర్ రెహ్మాన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, రూబెల్ హుసేన్, తస్కిన్ అహ్మద్, అబు హిదర్, అబు జాయేద్, ఆరిఫుల్ హక్, నజ్ముల్ ఇస్లామ్, నూరుల్ హసన్, మెహిదీ హసన్, లిటన్ దాస్



ఈ మధ్యకాలంలో మా ఫామ్ గొప్పగా లేదు. కొన్ని సందర్భాలలో అనవసరంగా భయాందోళన లకు గురవుతూ మ్యాచ్‌లను చేజార్చుకుంటున్నాం. అలా జరగకుండా చూసుకుంటాం - తమీమ్ ఇక్బాల్



లంకతో మ్యాచ్‌లో మా బౌలర్లు చేయగలిగిందంతా చేశారు. అవేమీ సత్ఫలితాలను ఇవ్వలేదు. మా బౌలింగ్‌లో కావలసినంత అనుభవం ఉందనే అనుకుంటున్నా. బ్యాటింగ్ పరంగానూ ఇబ్బందులు లేవు. జట్టులో ఆల్ రౌండర్లకు కొదవలేదు. తిరిగి పుంజుకుంటామని ఆశిస్తున్నాం - రోహిత్ శర్మ

పురుష విభాగంలో నిరాశే

న్యూఢిల్లీ: మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో మహిళా షూటర్లు రాణిస్తుంటే మరోపక్క పురుష షూటర్లు పతకాల రౌండ్‌లో నిరాశ పర్చారు. బుధవారం జరిగిన మిక్స్‌డ్ టీం ట్రాప్ ఈవెంట్ ఫైనల్లో భారత్ రెండు టీంలతో బరిలోకి దిగింది. ఒక జట్టులో మానవ్‌జిత్ సింగ్ సంధు, శ్రేయాసి సింగ్‌లుండగా, మరో జట్టులో క్యానన్ చినాయ్, సీమా తోమర్‌లున్నారు. వీరు ఓటమి చెందినప్పటికి.. భారత్ బుధవారం నాటికి పతకాల పట్టికలోమూడు స్వర్ణాలు, నాలుగు కాంస్య పతాకాలతో అగ్ర స్థానంలో ఉంది. చైనా, రుమేనియాలు ఒక స్వర్ణం, ఒక రజతంతో మొత్తం రెండు పతకాలతో ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నాయి. పురుషుల ట్రాప్ ఈవెంట్ ఫైనల్స్‌లో జొరావర్ సింగ్ సంధు క్వాలిఫైయింగ్ రౌండ్లో 125 పాయింట్లు సాధించాల్సి ఉండగా.. 114 పాయింట్లతో పూర్తి చేసి 32వ స్థానం పొందాడు. క్యానన్ చెనాయ్ 107 పాయింట్లతో 44వ స్థానం పొంది క్వాలిఫైయింగ్ రౌండ్లనే పూర్తి చేయలేకపోయాడు. లక్సెంబర్గ్‌కు చెందిన లిండన్ సోసా ఈ ఈవెంట్లో స్వర్ణ పతకం సాధించి ఈ చిన్ని ప్రపంచకప్‌లో తన దేశానికి తొలి పతకాన్ని సాధించిపెట్టాడు. ఇటలీకి చెందిన బుక్యులియెరి ఎమ్మాన్యులె రజత పతకాన్ని, ఫిన్లాండ్‌కు చెందిన టోర్న్‌రూస్ విసా కాంస్య పతకాన్ని సాధించాడు.

'శాయ్' బడ్జెట్ సర్దుబాటు చేస్తాం

న్యూఢిల్లీ: 2018-19 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ)కు కేటాయింపులను తగ్గించలేదని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. బుధవారం రాజ్యసభలో క్రీడాశాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ.. గత నెలలో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో క్రీడా బడ్జెట్‌కు కేటాయింపులు రూ.2,196.36 కోట్లకు పెంచిందన్నారు. ఇది 2017-18 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.258.2 కోట్లు ఎక్కువ అని తెలిపారు. సాయ్‌కు కేటాయింపులు తగ్గించలేదని నిధులను తిరిగి క్రీడా మంత్రిత్వ శాఖ, సాయ్‌ల మధ్య పునః సర్దుబాటు చేస్తామని తెలిపారు. 2018-19 సంవత్సరంలో శాయ్‌కు రూ.429.56 కోట్లు కేటాయించారు. ఈ మొత్తాన్ని 2017-18 కేటాయింపులు రూ.495.73 కోట్లతో పోలిస్తే రూ.66.17 కోట్లు తక్కువ అన్న విషయంపై సహచర సభ్యుడు ప్రశ్న లేవనెత్తగా మంత్రి పైవిధంగా సమాధానమిచ్చాడు.

ధోనీ, అశ్విన్ రేటింగ్ తగ్గింపు

'ఎ ప్లస్' నుంచి 'ఎ' కి కుదించిన బీసీసీఐ

న్యూఢిల్లీ: మాజీ భారత క్రికెట్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ, సీనియర్ ఆఫ్ స్పిన్నర్ ఆర్ అశ్విన్‌లను బీసీసీఐ ఎ ప్లస్ కేటగిరి నుంచి ఎ కేటగిరికి మార్చింది. ఈ మార్పు వీరిద్దరికి వచ్చే ఆదాయానికి గండికొట్టింది. బుధవారం భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) ఆటగాళ్ల కాంట్రాక్టులకు సంబంధించి ఎ, ఎ ప్లస్ కేటగిరి మార్పులను ప్రకటించింది. 'ఎ ప్లస్' కేటగిరిలో బ్యాటింగ్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లతో పాటు పేసర్లు భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా పేర్లను ప్రకటించింది. బీసీసీఐ వీరికి ఏటా రూ. 7కోట్ల ఆదాయం ఇస్తుంది. 'ఎ' కేటగిరిలో ధోనీ, అశ్విన్‌లతోపాటు రవీంద్ర జడేజా, మురళి విజయ్, చటేశ్వర్ పూజారా, అజింక్యా రహానే, వర్ధమాన్ సాహాలున్నారు. వీరికి ఏడాదికి రూ.5 కోట్ల ఆదాయం పక్కాగా వస్తుంది. 'బి' కేటగిరిలో కె ఎల్ రాహుల్, ఉమేష్ యాదవ్, కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్, హార్దిక్ పాండ్యా, ఇశాంత్ శర్మ, దినేష్ కార్తీక్‌లున్నారు. వీరికి ఏడాదికి రూ.3 కోట్ల ఆదాయం రానుండగా 'సి' కేటగిరిలో ఉన్న కేదార్ జాదవ్, మనీష్ పాండే, అక్సర్ పటేల్, కరుణ్ నాయర్, సురేష్‌రైనా, పార్థివ్ పటేల్, జయంత్ యాదవ్‌లకు ఏడాదికి కోటి రూపాయల ఆదాయం పొందనున్నారు. సీనియర్ మహిళా క్రికెటర్లలో ప్రపంచకప్ తారలు మిథాలీరాజ్, జులన్ గోస్వామి, హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధానలను 'ఎ'లో చేర్చింది. వీరికి కాంట్రాక్టులో భాగంగా ఏడాది రూ.50లక్షలు బీసీసీఐ చెల్లిస్తుంది. 'బి' కేట గిరిలో పూనం యాదవ్, వేదా కృష్ణ మూర్తి, రాజేశ్వరీ గ్వైక్వాడ్, ఎక్తా బిస్త్, శిఖాపాండె, దీప్తి శర్మలకు ఏడాదికి రూ.30 లక్షలు ఇవ్వనుంది. ఈ వార్షిక కాంట్రాక్టుల సమయం ఆక్టోబర్ 2017 నుంచి మొదలై 2018 సెప్టెంబర్‌లో ముగుస్తుంది. భారత క్రికెట్ అవసరాలకు తగ్గట్టు ఆటగాళ్ల సామర్థ్యాల మేరకు వారికి హోదాలను ప్రకటించి, నిర్ణీత ప్రతిఫలంను ముట్ట జెప్పే పద్ధతి ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే మనదే ఉత్తమంగా ఉందని పాలక మండలి కమిటీ(సీఓఏ) భావిస్తోందని బీసీసీఐ ప్రకటించింది. బీసీసీఐ ఆదాయం భారత సీనియర్ల జట్టు(పురుషులు) ఏడాదిలో దేశీయం గా ఆడే మ్యాచుల సంఖ్యపై ఆధారపడివుంటుంది. దీని ప్రకారం, ఆటగాళ్లకు రాబడి లేదా దానికి సమానమైన నష్ట పరిహారం అందించే నిధి(పీఆర్/సీఈఎఫ్) ఏర్పాటుకు సీఓఏ అనుమతినిచ్చింది. ఇందుకోసం బీసీసీఐ ఏటా తన మిగులు నిధుల నుంచి రూ.125 కోట్లు ఇవ్వనుంది.





అథ్లెటిక్స్ ఫెడరేషన్‌పై జావెలిన్ కోచ్ గుర్రు

పాటియాలా: ఇండియాలో పనిచేయడానికి వచ్చే విదేశీ కోచ్‌లు తమ అసహనాన్ని బహిరంగంగా వ్యక్తపరచడం మామూలే. ఇప్పుడదే వరసలోకి జాతీయ జావెలిన్ త్రో కోచ్ ఉయ్ హన్ కూడా చేరాడు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలు తన పనికి తగిన ఫలితం ఇచ్చేందుకు తాత్సారం చేస్తున్నాయని ఈ మాజీ ఛాంపియన్ ఆరోపించారు. ''ఇక్కడ గొప్ప జీతమేమీ అందదు. దానికి బాధ లేదు. కానీ ఫలితాల ఆధారంగా బోనస్‌లు గట్రా ఉండాలి కదా'' అని హన్ ప్రశ్నించారు. అధికారులను కలిసినా లాభం లేదని ఆయన వాపోయారు. హన్ డిమాండ్లలో దూర ప్రయాణాలకు బిజినెస్ క్లాస్ టికెట్లు, ట్రెయినింగ్ క్యాంపులో సరైన సదుపాయాలు వున్నాయి. కనీసం ట్రెయినింగ్ క్యాంపులో ఎక్విప్‌మెంట్ లేకపోవడం, అధికారులు సకాలంలో స్పందించకపోవడం ఈ లెజెండరీ అథ్లెట్‌ను విస్మయపరుస్తోందట. ప్రస్తుతం హన్ 10 మంది జావెలిన్ త్రోయర్లకు శిక్షణ ఇస్తున్నాడు. వారిలో నీరజ్ చోప్రా వచ్చే కామన్ వెల్త్ గేమ్స్‌లో పతకం తెస్తాడని భారత్ ఆశలు పెట్టుకుంది.

వార్నర్‌కు ఫైన్-డికాక్‌తో వాగ్వాదం

డర్బన్ : క్వింటన్ డికాక్‌తో గొడవ విషయంలో ఐసీసీ వార్నర్‌ను దోషిగా తేల్చింది. క్రికెట్ ప్రతిష్టకు భంగం కలిగించిన కారణంగా ఆస్ట్రేలియన్ వైస్ కెప్టెన్‌కు మ్యాచ్ ఫీజులో 75 శాతం కోత విధించింది. తొలి టెస్టులో నాలుగో రోజు టీ విరామంలో డికాక్, వార్నర్ ల మధ్య మాటల యుద్ధం నడవడం, ఆ వివరాలన్నీ సీసీటీవీల్లో రికార్డవ్వడం తెలిసిందే.

క్రికెట్‌కు ఎడ్ కొవాన్ గుడ్ బై

సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెటర్ ఎడ్ కొవాన్ ప్రొఫెషనల్ క్రికెట్ కు గుడ్ బై చెప్పాడు. 2011 బాక్సింగ్ టెస్టులో ఇండియా మీదే కొవాన్ అంతర్జాతీయ క్రికెట్ ప్రస్థానం మొదలవ్వడం విశేషం. మొత్తం 18 టెస్టులకు ప్రాతినిధ్యం వహించిన ఈ టాస్మానియన్ స్టార్ 31.28 సగటుతో 1001 పరుగులు చేశాడు.

ఫైనల్ ఆశలకు ఊపిరి



ఇపో(మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీలో ఆతిథ్య జట్టు మలేసియాపై 5-1తేడా తో గెలిచిన భారత్, ఫైనల్ ఆశలకు మళ్లీ ఊపిరి పోసింది. మంగళవారం ఆస్ట్రేలియాతో ఓడి ఫైనల్స్ ఆశలను దాదాపుగా వదలుకున్న భారత్ బుధవారం మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో పుంజుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో సర్దార్ సింగ్ సేన మలేసియా ఆటగాళ్లపై ఆధిక్యతను చాటింది. భారత్ ఆది నుంచే ప్రత్యర్థుల గోల్ పోస్టుపై దాడులను చేస్తూ ఆట 10వ నిమిషంలో శైలేంద్ర లక్రా భారత్‌కు తొలి గోల్ చేసిపెట్టగా, ఆనంతరం 33వ నిమిషంలో మలేసియా ఆటగాడు ఫైజల్ సారి పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. దీనితో స్కోరు 1-1తో సమమైంది. అనంతరం మలేసియా ఆటగాళ్లకు అవకాశమివ్వలేదు. 42వ నిమిషంలో భారత ఆటగాడు గుర్జంత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్ చేసి భారత ఆధిక్యాన్ని రెండుకు పెంచాడు. 48వ నిమిషంలో రమణ్‌దీప్‌సింగ్ పాస్ చేసిన బంతిని సుమిత్ సింగ్ అద్భుతంగా గోల్ చేసిభారత్‌కు మూడో గోల్‌ను సాధించాడు. 51 నిమిషంలో రమణ్‌దీప్ సింగ్ గోల్ చేయగా 57వ నిమిషంలో గుర్జంత్ సింగ్ మరో చేసి భారత్‌ను తిరుగులేని ఆధిక్యం సంపాదించి పెట్టి భారత్ గెలుపును ఖాయం చేశాడు. ఈ గెలుపుతో భారత్ ఫైనల్ ఆశలు సజీవంగా ఉన్నాయని చెప్పవచ్చు. ఇది మిగతా జట్ల మధ్య జరిగే మ్యాచుల ఫలితాలపై ఆధారపడి ఉంది. ఐర్లాండ్‌ను ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియా 4-1 తేడాతో చిత్తుగా ఓడించడంతో ఐర్లండ్ టోర్నీ నుంచి నిష్క్రమించినట్లే. కాగా ఆసీస్ ఫైనల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ఆసీస్ 12 పాయింట్లతో అగ్ర భాగాన ఉండగా, అర్జెంటీనా 7 పాయింట్లు, మలేసియా 6 పాయింట్లు, భారత్ 4 పాయింట్లను కలిగివుంది. శుక్రవారం జరిగే ఐర్లాండ్‌తో జరిగే పోటీలో ఆదేశాన్ని భారత్ భారీ తేడాతో ఓడించి, అదే సమయంలో ఆస్ట్రేలియా, అర్జెంటీనాపై గెలిచి.. ఇంగ్లండ్, మలేసియాల మధ్య మ్యాచ్ కనీసం డ్రాగా ముగియాలి అప్పుడే భారత్ ఫైనల్‌కు చేరకుంటుంది.

చెలరేగిన టేలర్ గాయం తోనూ...

ఇంగ్లండ్‌పై 5 వికెట్ల తేడాతో కివీస్ విజయం



డునేడిన్: గాయంతో బాధపడుతున్నప్పటికి.. రాస్‌టేలర్ మ్యాచ్ ఆడి న్యూజిలాండ్‌కు విజయం సాధించిపెట్టాడు. బుధవారం ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో టేలర్ 147 బంతుల్లో 181 పరుగులు చేసి ఆజేయంగా నిలిచి తన జట్టు విజయంలో కీలక భూమిక వహించాడు. ఫలితం 5 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌కు విజయం చేకూరింది. హోరాహోరాగా సాగిన ఈ పోటీలో టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ ఇంగ్లండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 335 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాట్స్‌మన్లలో జాని బెయిర్ స్టో, జోరూట్‌లు సెంచరీలు చేసినప్పటికి ఫలితం లేకపోయింది. కివీస్ బౌలర్లలో ఐష్ సోధీ 58 పరుగులిచ్చి 4 వికెట్లు తీయగా, మున్రో, ట్రెంట్ బౌల్ట్ చెరి రెండు వికెట్లు తీశారు. టిమ్ సౌథీ ఒక వికెట్ తీశాడు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ ఓపెనర్లు ఇద్దరూ డకౌట్లుగా వెనుదిరిగినప్పటికి కెప్టెన్ విలియమ్సన్, టేలర్‌లు పరిస్థితిని చక్కబెట్టారు. విలియమ్సన్ 45 పరుగులుచేసి స్టోక్స్ బౌలింగ్‌లో బట్లర్‌కు క్యాచిచ్చి ఔటయ్యాడు. అనంతరం వికెట్ కీపర్ టామ్ లెథాం వచ్చి టేలర్‌తో జత కలిశాడు. ఇరువురు కలసి స్కోరును ఉరకలెత్తించారు. లెథాం 71 పరుగులు చేసి కర్రెన్ బౌలింగ్‌లో మొయిన్‌కు క్యాచిచ్చి వెనుతిరిగాడు. అనంతరం గ్రాండ్‌హోమ్మి వచ్చి 23 పరుగులు చేసి ఔటయినప్పటికి కివీస్ ఇబ్బంది పడలేదు. గెలుపుకు మరో 33 పరుగుల అవసరమున్న దశలో హెన్రీ నికోలస్ బ్యాటింగ్‌కు వచ్చి 13 పరుగులు చేయగా మిగతా పరుగులను టేలర్ పూర్తి చేశాడు. హెన్రీ నికోలస్ 13 పరుగులతో, టేలర్ 181 పరుగులతో నాటౌట్ నిలిచారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.